Sunday, February 12, 2023
1:28 PM

1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 4
సంచిక : 11
పుటలు : 52

రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

జనవరి 2019



తెలంగాణ గిరిజన సంస్కృతిలో... పాట–సాధికారత

అడవి మీద ఆధారపడి బతికే గిరిజనులు
మన సమాజంలో అటవీ శాస్త్రవేత్తలు.
అడవి వంటి ఉమ్మడి వనరులను వాడుకోవడంలో పాటించే కట్టుబాట్లు,
నిత్య జీవితంలో వారి సమాజాన్ని అదుపాజ్ఞలలో ఉంచుతాయి.

సి. భవానీదేవి రచన
భాషోద్యమ కథానిక : స్పర్శ

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఫిబ్రవరి 21ని
ఈసారి భాషా హక్కుల దినోత్సవంగా
రెండు తెలుగు రాష్ట్రాలలో జరుపుకొందాం
– తెలుగుభాషోద్యమ సమాఖ్య పిలుపు

మన ఆలోచన తీరుతెన్నులు మారనిదే ప్రభుత్వ వైఖరిని మార్చలేము

తెలుగుజాతి (ట్రస్టు) స్టాల్ నెం.70 ను సందర్శించండి

30 వ విజయవాడ పుస్తక మహోత్సవం

స్వరాజ్య మైదానం (పి.డబ్ల్యు.డి.గ్రౌండ్స్), విజయవాడ

2019 జనవరి 1 నుండి 11 వరకు మధ్యాహ్నం 2 గం॥ నుండి 9గం॥ వరకు



అమ్మనుడి పత్రికకు చందాదారులుగా చేరి ప్రతినెలా పత్రికను పోస్టులో మీ ఇంటికే అందుకోండి.

చందా వివరాలు

శాశ్వత చందా	రూ.5000
5 సం॥	రూ.1000
3 సం॥	రూ. 700
1 సం॥	రూ. 240

నూతన చందాదారులకు జనవరి 2019 సంచిక ఉచితం

అమ్మనుడి పత్రికకు కొత్తగా చందాదారులుగా చేరేవారికి ఉచిత బహుమతులుగా ఈ పుస్తకాలను పొందండి

శాశ్వత చందా రు. 5000/- చెల్లించి 'తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం', 'ద్రావిడ మంగోలు భాషల జన్యుసంబంధం' రెండు పుస్తకాలనూ ఉచితంగా పొందండి.

5 సం॥లకు చందా రు.1000/-లు చెల్లించి 'ఎల్లలులేని తెలుగు' పుస్తకాన్ని ఉచితంగా పొందండి.

3 సం॥ చందా రు. 700/- చెల్లించి, 'తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం' పుస్తకాన్ని ఉచితంగా పొందండి.

భాషాభిమానులు, రచయితలు, భాషోద్యమకారులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు, ఆసక్తిగల ప్రజలు అందరూ చదువదగ్గ పుస్తకాలు ఇవి.


పదిశాతం తగ్గింపు ధరకు లభించు పుస్తకాలు మరియు సిడి వివరాలు

స.వెం.రమేశ్ రచన




ఎల్లలు లేని తెలుగు
వెల : రు.200/-లు

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు రచనలు




తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం
వెల :రు. 100/-




ద్రావిడ, మంగోలు భాషల జన్యుసంబంధం
వెల : రు.350/-

బంగారయ్య రచన



నుడి - నానుడి
వెల : రు.200/-

తెలుగు ఉద్యమం గీతాలు సి.డి



వెల : 30/-

తెలుగుజాతి (ట్రస్టు)
విక్రయశాల నిర్వాహకుడు : డా॥ సామల లక్ష్మణబాబు (9440448244)

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు,
డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్,
సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి

జనవరి 2019

- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...



రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట -రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi@gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

లోపలి పుటలలో....

రేఖాచిత్రాలు:పావులూరి చిదంబరేశ్వరరావు ముఖచిత్రం: తమ్మా శ్రీనివాసరెడ్డి
వ్యంగ్యచిత్రాలు: సరసి కంప్యూటరీకరణ : లంకె జనార్దన్

'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలు కొందరు వాట్సప్ (watsup) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు ఆమోదించజాలమని తెలుపుతున్నాము. దయచేసి పోస్టులోగాని, లేదా editorammanudi@gmail.com కుగాని పంపించండి.

\- సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:
సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం,విజయవాడ-520004.
కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com

రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

మాసపత్రిక

నుడి - నాడు - నెనరు

చందా వివరాలు

		వ్యక్తులకు	సంస్థలకు	విదేశీయులకు
శాశ్వత చందా	:	రూ.5000	రూ.7500	--
5 సం॥	:	రూ.1000	రూ.1500	150 డాలర్లు
3 సం॥	:	రూ. 700	రూ.1000	75 డాలర్లు
1 సం॥	:	రూ. 240	రూ. 400	25 డాలర్లు

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

AMMA NUDI - AXIS BANK, TENALI

అక్కౌంట్ నెం. **915020010550189**

IFSC Code : UTIB0000556

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.

చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

'అమ్మనుడి' ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం. 58, సండేమార్కెట్, **నెల్లూరు**-1. ఫోన్:7386223538.

హెచ్చరిక

'అమ్మనుడి' పత్రిక సిసి-బై-ఎస్ఏ లైసెన్సు (*క్రియేటివ్ కామన్స్ - అట్రిబ్యూషన్ షేర్ అలైక్*) లో ప్రచురితమవుతున్నది. దీని ప్రకారం ఈ పత్రికలో ప్రచురించిన వాటిని తిరిగి స్వేచ్ఛగా ఎవరైనా తమ రచనల్లో వినియోగించుకొని స్వయంగా గాని, ఇతరుల ద్వారా గాని, సోషల్ మీడియాలో గాని వాటిని ప్రచురించుకోవచ్చు. అయితే, ఆ సందర్భంలో - ఆ తొలి రచయిత పేరును, 'అమ్మనుడి' ఫలానా సంచిక నుండి తీసుకున్నట్లూ తప్పక ఉటంకించాలి. దయచేసి ఈ అంశాన్ని రచయితలు, ప్రచురణ కర్తలు, చదువరులు గమనించ గోరుతున్నాము

అమ్మభాష తెలుగును కాపాడుకొనే ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురిస్తున్నాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల తెలుగు పిల్లలకు - మొత్తంగా తెలుగు జాతికి - కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల నుంచి ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికం పంపిస్తున్నాము.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.

సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. ఫోన్ : 9848016136.
e-mail : editorammanudi@gmail.com

తెలుగు భాషోద్యమ సమాఖ్య పిలుపు

2019 ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని రెండు తెలుగు రాష్ట్రాలలో 'భాషా హక్కుల దినోత్సవం'గా జరుపుకొందాం

తెలుగు రాష్ట్రాల్లో తెలుగులో పాలనను ప్రభుత్వాల నుండీ, కోర్టులనుండీ పొందాలని కోరుకోవడం ప్రజల హక్కు. అది పాలకుల బాధ్యత. బాధ్యతను విస్మరించే ప్రభుత్వాలను నడిపే పార్టీలను, పట్టించుకోని ప్రజా ప్రతినిధులను నిగ్గదీయడం, పోరాటం చేయటం ప్రజల హక్కు. ఆ హక్కుల సాధనకు పోరాటం చెయ్యని ప్రజా సంఘాలను, రాజకీయ పార్టీలను మన్నించ కూడదు. - ఉత్తుత్తి వాగ్దానాలను చేసి, జీవోలను ఇచ్చి కూడా అమలు పరచని పాలక వర్గాలను నిలదీయాలి. విమర్శించాలి. ప్రశ్నించాలి. ప్రజాస్వామ్య బద్ధంగా పోరాటం చెయ్యాలి. ఎన్నికల వాగ్దాన పత్రాల్లో (మానిఫెస్టోలు) భాషావిధానం ప్రకటించమని అడగాలి. అలా ప్రకటించక పోయినా, అమలుకు సిద్ధంకాకపోయినా పోరాటం చెయ్యాలి.

అందుకే -రానున్న 21-2-2019 గురువారం నాడు రెండు రాష్ట్రాల్లోని ప్రజలంతా 'భాషా హక్కుల దినోత్సవం' గా జరుపుకొందాం. ఆ రోజున ఎవరికి తోచిన పద్ధతుల్లో వారుగా నిరసన ప్రకటనలు, డిమాండ్ల ప్రకటనలు చేద్దాం. ప్రభుత్వాలను, పార్టీలను నిలదీద్దాం.

<u>నిక్కచ్చులు (డిమాండ్లు)</u>

1. రెండు తెలుగు రాష్ట్రాల్లో సచివాలయం నుండి పంచాయితీ వరకు - పరిపాలన అంతా తెలుగులో జరగాలి. ఇందుకు రాష్ట్రాల ముఖ్యమంత్రులు బాధ్యత వహించాలి.

2. పాఠశాలల్లో బోధన అంతా మాతృభాషల్లో జరగాలి. ప్రాథమిక స్థాయి వరకు దీనిని తప్పనిసరి చెయ్యాలి. పై తరగతుల్లో బోధనామాధ్యమాన్ని ఎంచుకొనే స్వేచ్ఛ ఇవ్వవచ్చు.

3. కేవలం ఒక సబ్జెక్టుగా మాతృభాషను బోధిస్తామనడం, మాతృభాషల్ని ఉపయోగం లేకుండా చేసి వాటి నెత్తిన మేకు కొట్టి ఎదగకుండా చేయడమే. ఆధునిక భాషగా వినియోగంలోకి తేకపోతే అవి నశిస్తాయి. వాడని భాషలు వాడిపోతాయి. భాషలను నశింపజేసే విధానాలను మనం ఒప్పుకోం.

4. రానున్న ఎన్నికలకు పార్టీలు తమ ఎన్నికల ప్రణాళిక (వాగ్దానాల పత్రం)ల్లో పాలనలో బోధనలో తమ భాషా విధానాన్ని ప్రకటించాల్సిందే. అలా ప్రకటించని పార్టీలకు మనం ఓటు వెయ్యవద్దు.

విన్నపం : తెలుగు భాషోద్యమ సమాఖ్య పిలుపును ఇష్టపడేలా అన్ని సంఘాలు, వ్యక్తులు, సంస్థలు - ఈ డిమాండ్లతో కార్యక్రమాలను నిర్వహించాలని, విన్నవిస్తున్నాం. కోరినవారికి తగు సహకారం అందించడానికి సమాఖ్య సిద్ధంగా ఉంది. సంప్రదించండి

ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి
డా॥ వెన్నిసెట్టి సింగారావు
ఫోన్: 9393015584

తెలంగాణ కార్యదర్శి
తిరువరంగం ప్రభాకర్
ఫోన్: 9848336848

డా॥ సామల రమేష్‌బాబు, అధ్యక్షులు
తెలుగుభాషోద్యమ సమాఖ్య
98480 16136

ప్రజల భాషలో పరిపాలించేదే ప్రజాస్వామ్య ప్రభుత్వం

మయన్మార్(బర్మా)

చావు కూడా – పెళ్లి లాంటిదే



"...చావు కూడా పెళ్ళిలాంటిదే, బ్రదర్..." మీకొక సినిమా పాట గుర్తుకొస్తుంది కదూ! ఆకలి రాజ్యం సినిమాలో కమల్‌హాసన్ పాడిన (నిజానికి పాడింది బాలు) పాట. మొన్న బర్మా వెళ్లినప్పుడు ఒక చావును చూసిన నాకు ఆ పాట గుర్తుకొచ్చింది. శవాన్ని మోసుకెళ్లే పాడెను చూస్తే (అక్కడివారు దానిని ఆనంచాలు అంటారు) మతి పోయింది. పెండ్లి పల్లకిని అలంకరించిన తీరులో అలంకరించారు. రంగు రంగుల పూలతో, రంగురంగు బట్టలతో అలంకరించారు. నాలుగు మూలలా నాలుగు అరటి మొక్కలు కట్టారు. పాడె శవాన్ని పడుకోబెట్టారు. చుట్టూ బట్టతో కన్పించకుండా అలంకరించి వాటిపై రంగు రంగుల పూలతో అలంకరించారు. ఈ అలంకరణ అంతా సుమారు 5 గురు మనుష్యులు ఓ అయిదుగంటలు పెండ్లి మండపాన్ని అలంకరించినట్లుగా అలంకరించారు. దీనికి ఓ ప్రత్యేక జట్టు వుంటుంది. వీరికి చావు వార్త అందగానే దహనం రోజున ప్రొద్దున్నే కావలసిన సామగ్రితో చావు ఇంటికి చేరుకొని పని ప్రారంభిస్తారు. ఈ జట్టు శవానికి స్నానం చేయించడం దగ్గర నుంచి శవ దహనం వరకు వారే చేస్తారు. ప్రతి తెలుగు వారు ఎక్కువగా ఉండే మ్యై, బగో, మోలమేన్, రంగూన్ నగరాలలో ఇలాంటి బృందాలు వున్నాయి. ఇందులో మ్యై నగరంలో వుంటున్న కేశవ అనే అతను పాడె అలంకరణలో పేరు పొందాడు. వేరే ప్రాంతాల వాళ్ళు కూడా వీరిని పిలిపించుకొని అలంకరణ చేయిస్తారు.

కొన్ని జట్లు ఒకే రకమైన టీ షర్టులు వేసుకొని వెళ్తారు. ఇక శవ యాత్ర అయితే మరీను. సుమారుగా ఓ రెండు వందల మంది వరకు పెండ్లి ఊరేగింపులాగా బర్మీయులు తెలుగువారు అని భేదం లేకుండా వేన్లతో వెళ్తారు. ముఖ్యంగా చెప్పుకొనవలసినది ఆడ మగ అనే భేదం లేకుండా అందరూ వెళ్తారు. ఒకప్పుడు అంటే పూర్వం రోజుల్లో అయితే మన తెలుగు ఆడవారు శ్మశానాలకు వచ్చేవారు కాదు. కానీ బర్మీయులు అలా కాదు. ఆడ మగ శ్మశానానికి వెళ్లే అలవాటు వుంది. ఇరుగు పొరుగున వుండే బర్మీయులు చనిపోతే వారి ఆడ వారితో కలిసి శ్మశానానికి వెళ్లే అలవాటు నెమ్మదిగా మొదలై ఇప్పుడు తెలుగువారు చనిపోయినా పెద్ద సంఖ్యలో ఆడవారు శ్మశానానికి వెళ్లే అలవాటు చేసుకున్నారు. వీరు స్వంతంగా శవాన్ని తీసుకెళ్లడానికి ఓ బండి (వేన్) ని ఏర్పాటు చేసుకున్నారు. మోలమేన్ నగరంలో అయితే ఆ బండితో బాటు మనుషులను శ్మశానానికి తీసుకెళ్ళడానికి దుర్గాలమ్మ దేవాలయం తరపున ఓ బండి (వేన్), నూకాలమ్మ దేవాలయం తరపున ఓ బండి, సింహాద్రప్పన్న గుడి తరపున ఓ బండి, దండు మారియమ్మ గుడి తరపున ఓ బండిని పంపిస్తారు. అన్నీ కలిపి ఓ 7,8 వేన్లు, బైకులు, స్కూటర్లతో ఓ పెళ్లి ఊరేగింపులాగా వెళతారు. ఆలదండు మారియమ్మగుడి వారైతే బండితోపాటు ఓ వెయ్యి రూపాయలు(మన డబ్బులలో) కూడా ఇస్తారు. ఇందుకోసం నెలనెలా కొంత డబ్బులు వసూలు చేస్తారు. ఏదిఏమైనా ఇలాంటి కష్టకాలంలో అందరూ కలిసికట్టుగా వుంటూ, ఒకరికొకరు ధైర్యం చెప్పుకుంటూ, ఇలాంటి పనులు చేయడం మెచ్చదగినదే. బర్మా తెలుగు వారికి జేజేలు పలుకుదాం. శవాన్ని తీసుకెళ్లే బండిని పాడెలోపల పట్టేలాగున స్వంతంగా బాడీని నిర్మించుకొని వాడుకుంటున్నారు.

యర్రా నాయుడు
9000582436

మార్కులే చదువులకు కొలమానం కాదు!

అప్పటివరకు పిల్లలు ఇంట్లో ఏ భాషలో మాట్లాడుకుంటారో, నేర్చుకుంటారో విద్య ఆ వాతావరణానికి కొనసాగింపుగా ఉండాలి అనేది నిపుణులు చెప్పే విషయం. మాతృభాషలో చదవటం, రాయటం వంటి నైపుణ్యాలు వచ్చి, లోకజ్ఞానం పెరిగే దశలో ఇంగ్లీషును పరిచయం చేయాలి. ఇది ఒక సంధికాలం లాంటిది. ప్రపంచంలో కొన్ని దేశాల్లోని స్కూళ్లలో ముందుగా మాతృభాషలో కొంత నైపుణ్యం వచ్చేలా చేసి, తర్వాత రెండో భాషను బోధిస్తారు. మనకు ఇక్కడ ఐదవ తరగతి వరకూ తెలుగులో చదువుకోనివ్వాలి. ఆరో తరగతిలో ఇంగ్లీషును పరిచయం చేయాలి. పై తరగతుల్లో బోధనతో ఇంగ్లీషుపై పూర్తి స్థాయిలో అవగాహన ఏర్పడేలా చేయాలి. ఇదే శాస్త్రీయమైన పద్ధతి. అలా కాకుండా చిన్నప్పటి నుంచే ఇంగ్లీషు మీడియంలో వేసేస్తే సరి! అనుకుంటున్నారు చాలామంది తల్లిదండ్రులు. నిజానికి ఇంగ్లీషు ఒక భాషగా వేరు. మాధ్యమంగా వేరు. భాషగా దాన్ని ఎంతైనా నేర్చుకోవచ్చు. దానికి ఎవరూ వ్యతిరేకులు కాదు. వీటి మధ్య తేడా తెలుసుకోవాలి. సొంత భాషలో బలంగా ఉండే రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, మహారాష్ట్రలే ఇంగ్లీషు కంటే మాతృభాషకే ప్రాధాన్యతను ఇస్తున్నాయి. విద్యారంగంలో ముందంజలో ఉండే దేశాలైన చైనా, నార్వే, బ్రిటన్, శ్రీలంక, వియత్నాంలో ఎక్కడా ఇంగ్లీషు మాతృభాషే కాదు. ఇంగ్లీషును నేర్చుకోవటం ఐచ్ఛికమే.

– విఠపు బాలసుబ్రమణ్యం, ఎమ్మెల్సీ

సంపుటి : 4 సంచిక : 11
అమ్మనుడి
జనవరి 2019

సంపాదక హృదయం

మన ఆలోచన తీరుతెన్నులు మారనిదే ప్రభుత్వ వైఖరిని మార్చలేము.

2003లో ఆం.ప్ర. శాసనసభలో సభ్యునిగా మండలి బుద్ధప్రసాద్‌గారు ఒక ప్రయివేటు బిల్లును ప్రవేశపెట్టారు - ప్రాథమిక విద్యను మాతృభాషలో బోధించడాన్ని తప్పనిసరి చెయ్యాలని కోరుతూ. దానిపైన సుమారు రెండు రోజులు ఆసక్తికరమైన చర్చ జరిగింది. చివరకు విద్యాశాఖామంత్రి మండవ వెంకటేశ్వరరావుగారు ప్రభుత్వ అభిప్రాయాన్ని తేల్చి చెప్పారు. గౌరవ సభ్యుడు కోరినదాన్ని తాము ఆమోదించ జాలమని స్పష్టం చేశారు. 'కావాలంటే ఒక భాషగా తెలుగు బోధనను 1 నుంచి 10 వ తరగతి వరకు తప్పనిసరి చేస్తాం, ఒప్పుకొని బిల్లును ఉపసంహరించుకోండి' అని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయం అది. బిల్లును వెనక్కి తీసుకోకపోతే పాలక పార్టీ బలం ఎక్కువ గనుక మూజువాణీ ఓటింగులోనే ఓడిపోతుంది. పైగా - ప్రభుత్వం ఏదో ఒకటి చేస్తాం అంటున్నది గనుక - కనీసం ఒక సబ్జెక్టుగానైనా తెలుగు నిలబడుతుంది కదా అనే అభిప్రాయంతో బుద్ధప్రసాద్‌గారు అప్పటికి వెనక్కి తగ్గవలసి వచ్చింది. అప్పుడు పాలక పార్టీ తెలుగుదేశం పార్టీయే. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారే. ఇప్పటి వలెనే అప్పుడు కూడా ఆయన ఆ అంశం మీద నోరు విప్పలేదు. ఆ సందర్భంగా సమాఖ్యలో ఉన్న కొందరు పెద్దలు ప్రభుత్వంతో చర్చించి జి.ఒ. నెం. 86 రావడానికి దోహదపడ్డారు. జి.ఒ. ను విడుదల చేశారన్న వెంటనే సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు కీ.శే. సి. ధర్మారావు, సామల రమేష్‌బాబు విద్యాశాఖ కార్యదర్శి ఇలపావులూరి ...ప్రసాద్‌గార్ని కలిసినపుడు (గతంలో ధర్మారావుగారు ప్రభుత్వంలో సంయుక్త కార్యదర్శిగా పనిచేసి వున్నారు) ఆయన ఎంతో గౌరవంగా లేచి నిలబడి జి.ఒ. ప్రతిని ధర్మారావుగారి చేతికిస్తూ - దాన్ని ఇంగ్లీషులో ఇస్తున్నందుకు కొద్దిగా బాధను వెలిబుచ్చారు.

నాటి నుంచి నేటి వరకు - అంటే ఈ 15 ఏళ్లలో చంద్రబాబు గారేమీ మారలేదు. తెలుగును అధికారభాషగాగాని, బోధనారంగంలో వినియోగం గురించిగాని ఆయన అభిప్రాయాలు ఏమీ మారలేదు. ఇంకా బిగుసుకున్నాయి కూడా. ఎన్టీ రామారావుగారి హయాంలో పరిపాలనలో తెలుగు అమలు గురించి తీసుకొన్న చర్యలన్నీ కూడా చంద్రబాబుగారు అధికారం చేపట్టిన వెంటనే నీరుగారి పొయ్యాయి. ముఖ్యమంత్రిగారి ఆలోచనను పసిగట్టిన మన అధికారులు ఇంకా పట్టు బిగించి తమ ఆధిపత్య విధానాలకు మరింత పదునుబెట్టారు. ఫలితంగా మళ్ళీ ఎక్కడి గొంగళి అక్కడే అయింది. ముఖ్యమంత్రి స్థానంలో వున్న వ్యక్తినిబట్టే మన పరిపాలన చట్రం అంతా పనిచేయడం అనే ప్రజాస్వామ్య వ్యతిరేక విధానం వల్ల ప్రజలకు వ్యతిరేకమైన పాలనకై పరాయిభాషను వినియోగించుకోవడం పతాకస్థాయికి చేరింది. దానికి తగ్గట్టు ప్రపంచీకరణ విధానాలు, కార్పొరేట్ పలుకుబడి, ఆధిపత్యం విజృంభించి మొత్తం విద్యా వ్యవస్థను, పరిపాలనను ఇంగ్లీషుభాషతో చుట్టివేశారు. ఇంగ్లీషుతోనే బ్రతుకు, ఇంగ్లీషుతోనే అభివృద్ధి అనే ఆలోచనా ధోరణిని వ్యాప్తి చేశారు. చంద్రబాబుగారు పదేపదే చెప్పే అభివృద్ధి అనేదంతా ఇంగ్లీషుతోనే సాధ్యపడుతుందని, తెలుగుతో - మాతృభాషలతో అది వీలుగాదని, తెలుగుజాతి అంతా ప్రపంచీకరణలో మునిగి తేలి ఎదిగి అంబరాన్ని తాకాలంటే ఇంగ్లీషే దిక్కు అనే భావజాలాన్ని పెంపు చేశారు. మధ్యలో వచ్చిన కాంగ్రెసు ప్రభుత్వాలకు ఈ విషయంలో సొంత ఆలోచనే లేదు. అదంతా పి.వి.నరసింహా రావుగారితోనే చెల్లిపోయింది. ప్రపంచీకరణ సందర్భంలో ఆయన కూడా స్వదేశీభాషల రక్షణ, అభివృద్ధి విషయంలో సరైన మార్గదర్శనం చెయ్యలేకపొయ్యారు. ఈ విషయంలో మౌలికంగా ఆయనకు సరైన దృక్పథమే ఉన్నా, ఆయన కనుమరుగు

Unfiled Notes Page 7

కావడంతో ఏర్పడిన లోటు తీరలేదు.

2003 నాటికీ, మళ్ళీ 2014 నాటికీ నేటికీ చంద్రబాబుగారి ధోరణి ఏమీ మారలేదు అనడానికి ఎన్నయినా ఆధారాలున్నాయి. ఆయన ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న కాలంలో 2007 లోనూ, మళ్ళీ 2012 లోనూ సమాఖ్య నిరసన దీక్షలకు ఆయన వచ్చి సుదీర్ఘంగా ప్రసంగించి సమాఖ్య డిమాండ్లన్నిటినీ ఒప్పుకొన్నారు. 2014లో మళ్ళీ అధికారంలోకొచ్చిన తర్వాత కూడా సమాఖ్య డిమాండ్లను ఒప్పుకొని జి.ఒ.ల నైతే ఇచ్చారు. ప్రాధికార సంస్థ ఏర్పాటుకై జి.ఒ. ను ఇవ్వడం అలా జరిగిందే. అకాడమీల పునరుద్ధరణకై ఏడు జి.ఒ.లు అలా వచ్చినవే. ఏవీ సరిగ్గా అమలుకావు. ఎందుకంటే అన్నీ చేసేసినట్టే లెక్క. జి.ఒ.లు ఇవ్వడంతోనే సరిపెట్టే ధోరణి. ఈసారి అధికారంలోకి రాగానే నారాయణగారిని మంత్రిగానే ఆయన టీంలో చేర్చుకున్నారు. ఇక విద్యారంగంలో పూర్తి కార్పొటీకరణ చోటు చేసుకొంది. బోధనా భాషగా తెలుగుకు అంతిమ సంస్కారాలను క్రింది స్థాయి నుండీ పట్టుదలగా కొనసాగిస్తున్నారు. అదేమిటంటే తమ పార్టీ తెలుగు కోసమే అంకితమై వుందని, సుదీర్ఘ ప్రసంగం చేస్తారు. తెలుగు తోనే మన ఉనికి ఉందనీ, భాషను సాంస్కృతిక అంశాలతో, కళారంగంతో, హైందవ సంప్రదాయాల రక్షణతో, పండుగల నిర్వహణతో ముడిపెట్టి ఇదంతా తెలుగు రక్షణ కోసమే నంటారు. అందుకే సాంస్కృతిక శాఖకు భాష అనే రెండక్షరాలను మాత్రం జోడించి, ఇదంతా తెలుగుభాషా రక్షణకే అని ఆయనా, ఆయన పరివారమూ వక్కాణిస్తారు.

కీలకమైన పరిపాలన, బోధన రంగాల్లో తెలుగు వినియోగం సంగతి మాట్లాడరు. ఒక భాషగా తెలుగునూ, తెలుగు సాహిత్యాన్నీ చూడండని వాదిస్తారు. కవి గాయక బృందాలను ఆదరించడంతోటే తెలుగును ప్రోత్సహించినట్లని, మనకు నచ్చ జెప్ప జూస్తారు.

ఒకనాడు తెలుగంటే సాహిత్యమే. అప్పట్లో ఇంతగా విద్యారంగం విస్తరించలేదు. ఇంతగా పాలనా వ్యవస్థలు విస్తరించలేదు. ఆనాడు ప్రజల వృత్తులకు భాష వినియోగం పరిమితం. నేడట్లాగాదు. భాషా వినియోగం సాంకేతిక అభివృద్ధితో ముడిపడింది. ఆ విధంగా ఇప్పుడు ఆధునిక భాషగా తెలుగుకు విస్తరించగల శక్తి ఏమిటో నిరూపితమై వుంది. మనం వినియోగించుకోవడంలోనే భాషాభివృద్ధి ఆధారపడి వుంది. వినియోగించుకోకపోతే భాష ఎదుగుదల ఆగిపోయి, వాడిపోతుంది. ఏ భాషను వినియోగించుకొంటే ఆ భాషే ఆధునిక భాషగా ఎదుగుతుంది. ఆ విధంగా ఎదగాలా వద్దా అనేదంతా మనమీదనే – అంటే ఒక భాషాజాతిగా మన ఆలోచనల్నిబట్టే, సామర్థ్యాన్ని బట్టే ఉంటుంది. అట్లావున్న చైనా, జపాన్, ఇజ్రాయెల్ వంటి అనేక దేశాల, వారి భాషల ఎదుగుదల సమున్నతంగా ఉంది. మనం కూడా మన భాషను వినియోగించుకొంటే ఎంత ముందడుగు వేస్తే అంతగా ఎదుగుతాం. స్వాభిమానాన్ని, కోల్పోయి, స్వతంత్ర ఆలోచనలను పెంచుకోకపోతే ఇప్పుడనుకొనే అభివృద్ధి అంతా ఆర్థిక, సాంస్కృతిక ఆధిపత్య భావజాలానికి లొంగిపోవడమే అవుతుంది. జాతి నైతిక బలాన్ని కోల్పోవడమే అవుతుంది. చంద్రబాబుగారి నాయకత్వంలో గానీ, మరొకరి నేతృత్వంలోగాని జరుగుతున్నది అదే.

భాషోద్యమకారులే కాదు, తెలుగు ప్రజలంతా ఆలోచించాల్సిన సమయం ఇది. భాషాభిమానులం, భాషాప్రేమికులం అనే మాటలను మనకి మనం వాడుకోవడం తప్పు. మరొకభాషవారు తెలుగు భాషాభిమానులుగానో, ప్రేమికులుగానో తమను ప్రకటించుకోవచ్చు. మనం తెలుగు ప్రజలం. తెలుగు ప్రజలుగా మనకు కొన్ని హక్కులూ బాధ్యతలూ ఉన్నాయి. వాటి కోసం మనం పోరాడాలి, పాటుపడాలి. కనుక తెలుగుపట్ల మన చూపు మారాలి. తెలుగు భాషను రక్షించుకోవడం, అభివృద్ధి చేసుకోవడం అంటే అన్ని రంగాలలో తెలుగును పూర్తిగా వినియోగించుకోవడమే. అది మన హక్కు. తెలుగుతోనే మనం అందలం అందుకోవాలి. ఇంగ్లీషు వద్దు అనో, మరో భాష వద్దు అనో మనం అనడం లేదు. మనం తెలుగును ఆధునికంగా పూర్తిగా వినియోగించుకుంటూ ముందుకు పోతుంటే ఇంగ్లీషు మన పెంపుడు కుక్కలా మనతోనే వస్తుంది. అలాగాక మనమే దాని స్థానంలో వుంటే మనని గొలుసుకట్టి అదుపులో ఉంచుకొనే పనిని పరాయి వాళ్ళకు అప్పగించినట్లే. ఇప్పుడు జరుగుతున్నదదే. దురదృష్టవశాత్తు ఈ పనిని మన ప్రభుత్వాలు చేస్తున్నాయి. అంటే మన నాయకులు చేస్తున్నారు.

కనుక చివరగా చెప్పేదేమిటంటే – ఇవి మన తెలుగు రాష్ట్రాలు. తెలుగు ప్రజలు ఒక భాషాజాతి. ఇప్పుడు రెండు రాష్ట్రాలైనా, తర్వాత ఇవి మరో రెండుమూడు రాష్ట్రాలైనా – ఇవన్నీ తెలుగు రాష్ట్రాలే. భాషా రాష్ట్రాల్లో ఆ భాషే రాజ్యమేలుతుంది. ఆ భాషే జ్ఞాన సముపార్జనకు, పూర్తి వినియోగానికీ, జాతి ఎదుగుదలకూ కీలకం అవ్వాలి. ఇందుకు తెలుగు ప్రజలంతా నడుము బిగించాలి.

తేదీ : 31-12-2018

సామల రమేష్‌బాబు


వీవెన్
9963029061

తెలుగు భాషకు ఆధునిక హోదా-12

మనం ఏమి చేద్దాం!?

గతంలో ఇదే శీర్షికలో "ఆధునిక హోదా అంటే ఏమిటి?" అనే వ్యాసంలో సమాజం లోని వివిధ వ్యవస్థలు (ప్రభుత్వం, ముద్రణ/ప్రసార మాధ్యమాలు, ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలు) ఆధునిక హోదా దిశగా ఏమేం చేయాలో చూసాం. ప్రజల వైపు నుండి మనకు కావలసిన సమాచారం, మన వ్యవహారాలు, సంపాదన అవకాశాలు అన్నీ తెలుగులో ఉండాలని ఆకాంక్షలుగా చెప్పుకున్నాం. ఉద్యమాల ద్వారా లేదా ఇతరత్రా మార్గాల ద్వారా ప్రభుత్వాలను, ప్రభుత్వ సంస్థలు, వాటి విధానాలను సామూహికంగా మనం ప్రభావితం చెయ్యడం కాక, అంతకుమించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిస్తున్న సౌలభ్యాలను, అవకాశాలను వ్యక్తులుగా మనం ఎలా వాడుకోవచ్చో తెలియజేయడం, ఆ దిశగా అందరినీ ప్రేరేపించడం ఈ వ్యాస ఉద్దేశం.


నీటి బిందువులన్నీ కలిస్తేనే మహా సముద్రం అయినట్టు, మన స్థాయిలో పరిధిలో భాష నిలిచేలా మనం వ్యక్తులుగా సరికొత్తగా ఏమి చేయవచ్చో చూద్దాం.



ఎందుకు: భారతదేశంలో అంతర్జాల అందుబాటున్న వాడుకరులు దేశ జనాభాలో 30% నుండి 35% శాతం మాత్రమే. అదీ గత ఐదేళ్ళలో చవక స్మార్టుఫోన్లు, అంతర్జాల అంటుబాటు ఉధృతిలో పెరిగినదే. కొత్తగా చేరినవారు, రాబోయే రోజుల్లో కొత్తగా అంతర్జాలం వాడుకునే వారిలో దాదాపు 90% మంది ప్రాంతీయ భాషలలో మాత్రమే వినియోగిస్తారన్నది ఒక అంచనా (కేపీఎమ్‌జీ ఇండియా, గూగుల్ వారి సంయుక్త నివేదిక, ఏప్రిల్ 2017). అయితే వీరందరికీ తగ్గ సమాచారం (స్థానిక, ప్రాంతీయ విశేషాలతో కూడుకొని) వారి భాషలో అందుబాటులో లేదు అన్నది చేదునిజం. ఇది ఒక గొప్ప అవకాశం!

తెలుగు వరకూ చూస్తే, అంతర్జాలం అందుబాటులో ఉన్న తెలుగువారు 3 కోట్ల వరకూ ఉండవచ్చు. క్రియాశీల వాడుకరులు మాత్రం కోటి మందిని మించకపోవచ్చు. రానున్న ఐదేళ్ళలో ఈ సంఖ్య 5 కోట్ల తెలుగు అంతర్జాల వాడుకరులు (కనీసం 3 కోట్ల మంది క్రియాశీల వాడుకరులకు) చేరుకోవచ్చున్నది ఒక అంచనా.

వ్యాపార సంస్థలు ఎలాగూ ఈ అవకాశాన్ని వినియోగించుకుంటాయి. గూగుల్ వంటి సంస్థలు ఇప్పటికే తమ ఉత్పత్తులను



తెలుగులో(ఇతర ప్రాంతీయ భాషలలో కూడా) అందిస్తున్నాయి. స్థానిక భాషలలో అంతర్జాల సమాచారం కోసం అనేక ప్రాజెక్టులను కూడా చేపట్టాయి.

మనం కూడా విడి వ్యక్తులుగా చేయాల్సిన కృషి చాలా ఉంది.

ఎలా: తెలుగు వారికి కావలసిన వినోద, విజ్ఞాన, వికాస అవసరాలను తీర్చగలిగే సమాచారం అంతా తెలుగులో డిజిటల్ రూపంలో, వెతకగలిగేలా ఉంటే మేలు. అది అందరూ స్వేచ్ఛగా వినియోగించుకునేలా కాపీహక్కులు సడలించివుంటే మరీ మంచిది.

చాలా మంది తమ విలువైన సమాచారాన్ని ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి తాత్కాలిక మాధ్యమాల్లో పెడుతున్నారు. వీటితో చిక్కు ఏమిటంటే అవి నియంత్రిత మాధ్యమాలు. సమాచారాన్ని ఎవరు ఎప్పుడు చూడాలి అన్నది ఆయా కంపెనీల (అల్గారిథముల) చేతిలో ఉంటుంది. వీటిలో పాత విషయాల్ని వెతికిపట్టుకోవడం కష్టం. సమాచార ప్రచురణ బ్లాగులు, వెబ్‌సైట్లలో జరిగి సామాజిక మాధ్యమాలను కేవలం సమాచార/విషయ ప్రచారానికి వాడుకుంటే బాగుంటుంది.

అంతర్జాలం ప్రతీ ఒక్కరికీ ప్రచురణ వేదిక. సాంప్రదాయ మాధ్యమాలలో వలె మూసకు కట్టుబడాల్సిన పనిలేదు. నిడివి వంటి భౌతిక పరిమితులు అధిగమించవచ్చు. పాఠ్య, శ్రవణ, దృశ్య రూపాలన్నింటినీ వాడుకుంటూ మనం చెప్పాలనుకున్న విషయాన్ని ప్రభావవంతంగా చెప్పవచ్చు. పాఠకులు తక్షణం స్పందించే సౌలభ్యాన్ని వాడుకుంటూ సృజనాత్మక ప్రయోగాలూ చెయ్యవచ్చు.

ఏమిటి: విషయపరంగా చూస్తే, తెలుగు వారికి సంబంధించిన ప్రతి విషయమూ, తెలుగువారు తెలుసుకోవాలనుకున్న ప్రతి అంశమూ అందుబాటులో ఉండాలి. రాజకీయాలు, సినిమాలు, వాతావరణం వంటి రోజువారీ అంశాలు మరింత లోతుగా విశ్లేషించవచ్చు. ఇవి పల్లె స్థాయి నుండి ప్రపంచ స్థాయి వరకూ చర్చించబడుతూండాలి. వివిధ రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలు, పురోగతి వంటి అంశాలపై అవలోకనం స్థాయి నుండి వివరణాత్మక వ్యాసాల వరకూ సమాచారం ప్రచురించబడుతూండాలి. మన బాధలు, కష్టాలు, కన్నీళ్ళు, మన సంతోషాలు, సంబరాలు, మన సమస్యలు, వాటికి పరిష్కారాలు-వ్యక్తి స్థాయి నుండి జాతి స్థాయి వరకూ వ్యక్తమవుతూండాలి. ఇదంతా ఏ కొన్ని వ్యాపార సంస్థలో చెయ్యలేవు. మనందరం మనకున్న ఆసక్తులను బట్టి, మనకు వచ్చిన, నచ్చిన విషయాలపై రాస్తూంటేనే, మాట్లాడుతూంటేనే తెలుగులో సమాచారం వెల్లువెత్తుతుంది.

అంతర్జాలం ఆధారంగా మనమే మన స్వంత మ్యాగజైను, స్వంత రేడియో ఛానెలు, స్వంత టీవీ ఛానెలు కూడా నడుపుకోవచ్చు. ఇందుకు సాంకేతిక నైపుణ్యాల కంటే ఎక్కువగా విషయ పరిజ్ఞానం, సృజనాత్మకత, సామాజిక/మార్కెటింగ్ నైపుణ్యాలు కావాలి. అంతర్జాలంలో తెలుగు సమాచార పెంపుకి అందుబాటులో ఉన్న అవకాశాల గురించి, మనం తోడ్పడాల్సిన వాడుకోవాల్సిన అంశాల గురించి రాబోయే సంచికల్లో చూద్దాం. (అంతర్జాలం తెరిచిన అరచేయి కనుక, ఈ లోగా మీరు చూసి, చేసి వచ్చేయండి.)

బంగారయ్య బంగరు పలుకులు

ఏ తెలుగు మాట అయినా సముస్క్రుతములో కనిపిస్తూనే, అది సముస్క్రుతములో నుండి తెలుగులోకి ఒచ్చింది అని గాని, ఒచ్చి ఉంటుంది అని గాని, ఒచ్చి ఉండ ఒచ్చును. అనిగాని, అనే వారిని తెనుగులు అనగలమా? కాదు. వారు సముస్క్రుతీయులు. ఏ తెలుగు మాట అయినా ఇంగ్లీషులో కనిపిస్తూనే అది ఇంగ్లీషులో నుంచి తెలుగులోకి ఒచ్చింది, ఒచ్చి ఉంటుంది, ఒచ్చి ఉండ ఒచ్చును, అనే వారిని తెనుగులు అనగలమా? కాదు. వారు ఇంగ్లీషు వారు; లేదా తెలుగుకు అప్పగింతలు(ద్రోహులు). ఏ మాట అయినా ఉరుదులో, పార్సీలో మరి ఏ యితర నుడిలో – 'చయినా, జ'పాను నుడులు అయినా సరే – కనిపిస్తూనే, దానిలో నుంచి తెలుగులోకి ఒచ్చి ఉంటుంది అని తేలికగా అనే వాళ్లు, అనడములో ఒకతనవి, ఒక ఉవయోగము ఉంది అని అనుకొనేవారు మనలో చాలా మంది ఉన్నారు. వారే తెలుగు నుడిని పాడుచేసి, చంపుతున్నారు. వారే సముస్క్రుతీయులు. వారిని గురించి తెనుగులు జాగర్తగా ఉండాలి...

* * *

రచయిత కాలేనివాడే కవి అవుతాడు
రచనలు చెయ్యలేనివాడే కవితలు అల్లుతాడు
రచయితను కాలదన్ని కవిని కౌగిలించుకునే జాతి
రచనలను త్రోసిరాదు అని కవితను మీదికెత్తేజాతి
తలంచలేదు, అనుభవిస్తుంది.
నిలిచి సాధించలేదు
కలలో పలవరిస్తుంది!
ముందుపోక సాగించలేదు!
ఎక్కడి గొంగలి అక్కడే ఉంటుంది

* * *

ఏ నుడి నానుడులు(సాహిత్యం) అయినా
బతికి బట్ట కట్టాలి అంటే
అవి విరివి చదువుకు అనుకూలంగా ఉండాలి
నిలబడిపోయిన కన్నడిగులు
రాజరాజు చేత చెప్పించుకునే వరకు
తెలుగులో రాయాలి అని తోచని
నన్నయ తెనుగు ఎలాగ అవుతాడు?
నుడులు సరిగా పెంపు చెందని
మొరటు మట్టులో,
కారకాలు లేకుండా
రాయబడిందే సమాసము

– కీ.శే. బి.స బంగారయ్య

మళ్ళీ కేసీఆర్ కే పట్టం
ఇక-తెలంగాణాలో తెలుగు భాషావైభవమెప్పుడు?

సంకేపల్లి నాగేంద్రశర్మ
9441787650.



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి విడిపోయి, 2014,జూన్ 2 న ఏర్పాటైన ప్రత్యేక తెలంగాణా రాష్ట్రంలో నిర్ణీత వ్యవధికన్నా ఎనిమిది నెలల ముందు జరిగిన శాసనసభ ఎన్నికలలో రెండవ సారి ఉద్యమనేత కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణా రాష్ట్ర సమితి(తెరాస) ఘన విజయం సాధించింది. ఈ ఘనవిజయంతో రెండవసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన కేసీఆర్, మాతృభాషైన తెలుగు భాషాభివృద్ధికి పునరంకితం కావాలని, రాష్ట్రంలో సమగ్ర మాతృభాషాభివృద్ధికి తగిన విధానం రూపొందించాలని, తెలంగాణా, తెలుగు భాషాభిమానులు కోరుకుంటున్నారు. గతంలోగా కాకుండా, తెలుగు భాషాభివృద్ధికి సరైన ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని తెలుగు భాషాభిమానులు ప్రగాఢంగా కోరుకుంటున్నారు. మనమంతా తొమ్మిది కోట్ల మంది తెలుగువాళ్లం అని ఘనంగా, గొప్పగా చెప్పుకునే రోజులు రావాలని, సమగ్రమైన మాతృభాషా పరిరక్షణ విధానం రావాలని,ఉమ్మడి రాష్ట్రాలలోని తెలుగు ప్రజలు కోరుకుంటున్నారు. రాబోయే అయిదారు నెలల్లో ఆంధ్రాలో కూడా అసెంబ్లీ ఎన్నికలు జరుగబోతున్నాయి.

అక్కడ కూడా సరైన భాషావిధానం అమలు పరచాలని, అందుకు తమ మానిఫెస్టోను వివిధ రాజకీయ పక్షాలు రూపొందించే విషయమై వత్తిడి తేవాలని తెలుగు భాషోద్యమనేతలు కోరుతున్నారు. కేవలం రాజకీయ, ఆర్థిక, సామాజిక కోణాలనుండే కాక, భాషా, సాంస్కృతిక కోణాల నుండి ఈ ఎన్నికలను చూసినపుడే మాతృభాష బతికి బట్టకడుతుంది. తెరాస మాత్రం ఈసారి ఎన్నికలముందు ప్రకటించిన మ్యానిఫెస్టోలో గతంలో ఉన్నవి మాత్రమే మరింత మేలుగా అమలు చేసి చూపుతామని వాగ్దానం చేసింది. సమైక్య కూటమి మాత్రం, అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణా పాటను రాష్ట్రీయ గీతంగా అమలు పరుస్తామని తమ మ్యానిఫెస్టోలో వాగ్దానం చేసింది. తెలంగాణా యాస, భాషపై మాత్రం టీఆర్ఎస్ సరికొత్తగా ఎలాంటి వాగ్దానాలు చేయక పోవడం గమనించాల్సిన విషయం. మాతృభాష, సాంస్కృతిక విధానాల అనులులో పాలకులకు చిత్తశుద్ధి, తగిన కార్యాచరణ వుండాలని తెలుగు ప్రజ కోరుకుంటున్నది. కేవలం ఓట్ల నినాదంగా, ఎన్నికల వాగ్దానంగా చూడకుండా తెలుగు అమలుకు రాజకీయ చైతన్యం రావాల్సి వుందని తెలుగు ఉద్యమ నేతలు అంటున్నారు. మాతృభాషపై రాజకీయ కోణం వుండి తీరాలన్నది నేటి రాజకీయ, ప్రజాస్వామ్య విధానం కావాలి. దేశంలో రెండు నుండి నాలుగవ స్థానానికి పడిపోయిన తెలుగు భాష పరిస్థితులను చక్కదిద్దాల్సిన బాధ్యత మన తెలుగు వారందరిపై వుంది.

ఎంతో కష్టపడి ప్రాచీన హోదాను సాధించుకున్న తెలుగు విశ్వభాషల్లో ఒక ప్రియతమ భాషగా జెండా ఎగురవేయాల్సిన తరుణం కోసం మనమంతా సమైక్యంగా కృషి చేయాల్సి వుంది.

తెలంగాణాలో మాతృభాషా విధానం ఎలా అమలులో వుందో చూస్తే, దయనీయమైన పరిస్థితిలోనే వుంది. తెరాస ప్రభుత్వం కొంత వరకు ప్రయత్నాలు చేసినప్పటికినీ, ప్రయివేట్ విద్యాసంస్థల నుండి వస్తున్న లాబీల వత్తిడిలు తట్టుకోవడం సమస్యగా మారింది. తెలంగాణా భాషలో మంచి పట్టున్న ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో, బోధనలో ప్రభుత్వ భాషా విధానాన్ని పునఃసమీక్షించి, తెలుగు భాషాభివృద్ధికి సమగ్రంగా ప్రణాళికలు రూపొందించాలని తెలుగు భాషాభిమానులు కోరుతున్నారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పాటైనాక తొలిసారిగా 2017 డిసెంబర్ 15 నుండి 19 వరకు అయిదు రోజుల పాటు ప్రపంచ తెలుగు మహాసభలు ఘనంగా నిర్వహించి తన సత్తాను, తెలుగు భాషాభిమానాన్ని ముఖ్యమంత్రి కేసీ ఆర్ గారు చాటుకున్నారు. ఈ మహాసభలకు రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న తెలుగు పండితులను ప్రత్యేకంగా రప్పించారు. తెలుగు పండితులకు ప్రమోషన్ల విషయమై స్పష్టమైన ప్రకటన చేస్తారని అందరూ ఊహించినా, చివరి నిముషంలో ఎందులకో దాటవేశారు. రెండు సంవత్సరాల ఇంటర్మీడియట్ కోర్సులో తెలుగు సబ్జక్టును ప్రవేశ పెట్టాలన్న డిమాండ్‌పై ప్రకటన చేస్తారన్న విషయం అమలు లోకి నోచుకోలేకుండా పోయింది. ప్రాథమిక స్థాయి నుండి సెకండరీ స్థాయి వరకు తెలుగు సబ్జెక్టును తప్పనిసరిగా ప్రవేశ పెట్టడానికి అనుగుణంగా ప్రభుత్వం సరైన రీతిలోనే స్పందించింది. తొలుత ఆర్డినెన్స్‌ను తీసుకొని వచ్చిన ప్రభుత్వం తదుపరి మార్చి 2018 లో రాష్ట్ర అసెంబ్లీలో ఒక తీర్మానాన్ని, ఆమోదించింది. తెలంగాణా రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలల్లో, కేంద్ర ప్రభుత్వ యాజమాన్యంలోని సిబిఎస్ఇ సిలబస్‌తో నడుస్తున్న విద్యాసంస్థల్లో తెలుగును ఒక సబ్జెక్టుగా దశలవారిగా ప్రవేశ పెట్టడానికి వీలుగా 2018-19 ప్రస్తుతం నడుస్తున్న విద్యా సంవ త్సరం నుండి అమలులోకి తెచ్చింది. అయితే గతంలోని ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోనే జీవో 86 ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమం, తెలుగు సబ్జెక్టు బోధన అమలులో వుంది. ఈ విషయాల్ని అధికారులు ఎందులకో కప్పి పుచ్చారు. సిబిఎస్ఇ సిలబస్‌తో నడుస్తున్న కేంద్ర ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలల్లో దశల వారిగా తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా ప్రవేశ బెట్టారని అధికార

వర్గాలు తెలిపాయి. ఈసారి ఒకటో తరగతిలో, వచ్చే సంవత్సరం నుండి రెండో తరగతిలో దశలవారిగా ప్రవేశబెడుతారట. ఆంగ్ల మాధ్యమంలో నడిచే ప్రయివేట్ పాఠశాలల్లో సైతం ఇదే విధానం అమలులో వుంటుందని అధికార వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ పాఠ్యపుస్తకాలలో తెలంగాణా సిలబస్‌ను ప్రవేశపెట్టడానికి తగు చర్యలు గతంలోనే మొదలయ్యాయని అధికార వర్గాలు తెలిపాయి.

ప్రతి ఏటా పెద్దస్థాయిలో తెలుగు మహాసభలను నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ముగింపు సభల వేడుకల్లో ప్రకటించారు. ఇందులో భాగంగానే ఆగస్టు 2017లో తెలంగాణా సాహిత్య అకాడమి ఏర్పాటైంది. డా.నందిని సిధారెడ్డి గారిని చైర్మన్‌గా నియమించారు. గతంలో ఏన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రద్దయిన జానపద, సంగీత, నృత్య అకాడమీలను పునరుద్ధరిస్తామన్న వార్తలు వెలువడ్డాయి. తెలంగాణా రాష్ట్ర అధికార భాషా సంఘాన్ని ప్రాధికార సంస్థగా మార్చాలన్న ప్రతిపాదనను పరిశీలించాలని, దానికి చట్టబద్ధమైన అధికారాలు కల్పించాలని తెలుగు ఉద్యమ నేతలు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వచ్చే ప్రాచీన భాషా హోదా కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడానికి తగు చర్యలు తీసుకుంటారని కూడా వార్తలు వచ్చాయి.

రాష్ట్రంలోని ప్రయివేట్ జూనియర్ కళాశాలల్లో సంస్కృతం బదులు తప్పనిసరి సబ్జెక్టుగా తెలుగును ప్రవేశ పెడదామనుకున్న ప్రయత్నానికి ఆఖరి నిముషంలో గండి పడింది.ప్రయివేట్ యాజమాన్యాల నుండి వత్తిడి రావడంతో పాటుగా, సంస్కృత ఉపాధ్యాయుల నుండి వార్షిక పరీక్షా పత్రాలు దిద్దమన్న నిరసనలు వెల్లువెత్తడంతో ఈ విషయం ఆచరణలోకి రాకుండా పోయింది.

తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్వీ. సత్యనారాయణ ఆధ్వర్యంలోని ఒక నిపుణుల బృందం, పొరుగు రాష్ట్రాలే కాకుండా, పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాలలోని మాతృభాషా అమలు విధానాన్ని సాకల్యంగా పరిశీలించింధి.ప్రభుత్వ సలహాదారు డా.కెవి.రమణాచారి, డా.నందిని సిద్ధారెడ్డి, ఏనుగు నరింహారెడ్డి, దేశపతి శ్రీనివాస్, మామిడి హరికృష్ణ తదితరులే కాక, రాష్ట్ర విద్యాశాఖకు చెందిన అధికారుల బృందం కూడా వివిధ రాష్ట్రాలలో పర్యటించి, ఒక నివేదికను రూపొందించినట్లు తెలిసింది.

తెలంగాణా రాష్ట్రంలో బోనాలు, బతుకమ్మలను అధికారిక పండుగలుగా గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం, వివిధ సాహితీవేత్తల జయంతులను ఘనంగా నిర్వహిస్తోంది. కాళోజీ, దాశరథి, పివి, డా.సినారె వంటి తెలంగాణా ప్రముఖుల జయంతులను, వర్ధంతులను ఘనంగా నిర్వహిస్తోంది. వరంగల్ లో కాళోజీ భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. తెలుగు మాతృభాషా పరంగా ప్రాథమిక స్థాయి నుండి కనీసంగానైనా పదవ తరగతి వరకు తెలుగు మాధ్యమంలో కొనసాగించాలన్న డిమాండ్ చివరకు అమలుకు నోచుకోకుండా తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాలలో వున్న మాతృభాషాభిమానాన్ని పాలకులు ప్రదర్శించాలని, ప్రజాభిప్రాయానికి అనుగుణంగా తెలుగు అమలు ఉండాలని తెలుగు ఉద్యమ నేతలు కోరుతున్నారు. అంతేకాక తెలుగు అధికార భాషగా, ప్రభుత్వ భాషగా అమలు కేవలం ఇరవై శాతంగా వుందని, దీన్ని కనీసంగానైనా డెబ్బయి శాతంగా పెంచాలని తెలుగు ఉద్యమ నేతలు కోరుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో తెలుగు అమలుకు ఉద్యమరీతిగా చర్యలుండాలని, ఇందులకు ఉద్యోగులకు సరైన శిక్షణలను ప్రవేశ పెట్టాలని కోరుతున్నారు. తెలుగు భాషావిధానం సరైన దిశలో కొనసాగించినపుడే సరైన ఫలితాలు వస్తాయని తెలుగు ఉద్యమ నేతలు అభిప్రాయపడుతున్నారు. తెలుగులో యునికోడ్ ఫాంటులు రావడం వల్ల, కంప్యూటింగ్ కి ఏ మాత్రం సమస్యలు లేవని తెలుగు జాల నిపుణులు అంటున్నారు. 31 జిల్లాలున్న తెలంగాణా రాష్ట్రంలో ప్రభుత్వ పరిధిలో తెలుగు అమలు ఏ మాత్రం సమస్య కాదన్న అభిప్రాయాలు భాషోద్యమకారుల నుండి వ్యక్తమవుతున్నాయి. భాషోద్యమాల వల్ల, భావజాల వ్యాప్తి వల్ల తెలుగు బతికి తీరుతుందన్న వాదనలను కాదనలేం.

తెలంగాణలో ఒక అధికారి వివరణ

తెలంగాణ రాష్ట్రంలో విద్యాసంస్థలలో తెలుగు సబ్జెక్టు తప్పనిసరి చేయాలనే విషయమై జి.ఒ.15 ఉత్తర్వులు వెలువడ్డాయి. అంతేగాక యాక్ట్ సంఖ్య 10/2018న రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన చట్టం కూడా అమలులో ఉంది. యాక్ట్ ప్రతులు మార్చి 31, 2018 న విడుదలయ్యాయి. ప్రొఫెసర్ యస్వీ సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యాసంస్థలు తెలుగు సబ్జెక్ట్ అమలుపై ఒక కమిటీ పనిచేస్తుంది. ఇందులో తెలుగు సాహిత్య అకాడమీ ఛైర్మన్ సిధారెడ్డి, దేవులపల్లి ప్రభాకరరావు ఎస్ సి ఇ ఆర్ టి, తెలుగు అకాడెమీ సంచాలకుడు, దేశపతి శ్రీనివాస్ తదితరుల పనిచేస్తున్నారు. ఈ ఆధికారిక కమిటీ ప్రతి మూడు నెలలకొకసారి సమావేశమై విద్యా సంస్థలను తనిఖీ చేస్తుంది. సిబిఎస్ఇ సిలబస్ ఉన్న ప్రైవేట్, కేంద్ర ప్రభుత్వ పాఠశాలలోనే కాక, రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖలోని పాఠశాలలను తనిఖీ చేస్తుంది. జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు కావలసి ఉంది. 2018 - 19 విద్యా సంవత్సరం నుండి తెలుగు సబ్జెక్టు కంపల్సరీ అమలు మొదలయింది. తెలుగు సబ్జెక్టు అమలు చేయకుంటే మొదటిసారిగా నోటీసు రెండవసారి ఏభై వేల రూపాయల జరిమానా, మూడవ సారిగా రూ. ఒక లక్ష రూపాయల జరిమానా, నాల్గవసారి అయితే స్కూలు గుర్తింపును రద్దు చేస్తారు. 2019 - 20 విద్యా సంవత్సరం నుండి ఖచ్చితంగా అమలు చేయనున్నాము. ఎన్నికలు కావడం వల్ల కాస్త ఆలస్యమయింది అని తెలంగాణలో ఒక విద్యాధికారి వివరించారు.

తెలుగును ప్రభుత్వ భాషగా పాఠ్యపుస్తక విషయంగా బోధన మాధ్యమంగా కంపల్సరీ సబ్జెక్ట్‌గా అమలు చేయడానికి కెసిఆర్ నాయకత్వంలోని తెరాస ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలని అందరూ ఆశిస్తున్నారు. మాటలలో, వాగ్దానాలలో కాక అమలులో వాటిని నిరూపించుకుంటూనే ముఖ్యమంత్రిగారికి ప్రజల్లో గౌరవం పెరుగుతుంది. జాతి భాషా సంస్కృతులతో కూడినటువంటి సమగ్ర అవగాహన కెసిఆర్‌కు లేదనడానికి వీలులేదు. అయితే అభివృద్ధి అంశాలపైనే దృష్టిపెట్టి తెలంగాణ భాష వారసత్వం సంస్కృతి వంటి అంశాలను పట్టించుకోకపోతే ఉద్యమ ఆకాంక్షలు లక్ష్యాలు దెబ్బ తింటాయనే సంగతిని కెసిఆర్‌కు మళ్ళీ మళ్ళీ గుర్తుచేయాల్సిన అవసరం ఉండదని ఆశిస్తున్నాము.

డా॥శివరామకృష్ణ శక్తి
9441427977

తెలంగాణ గిరిజన సంస్కృతిలో...పాట-సాధికారత

అడవి మీద ఆధారపడి బతికే గిరిజనులు మన సమాజంలో అటవీ శాస్త్రవేత్తలు. అడవి వంటి ఉమ్మడి వనరులను వాడుకోవడంలో పాటించే కట్టుబాట్లు, నిత్య జీవితంలో కూడా వారి సమాజాన్ని అదుపాజ్ఞలలో ఉంచుతాయి. పరాయి పాలకులు అడవికి, భూమికి కొత్త హద్దులు గీసి, లెక్కలు ప్రవేశపెట్టి గిరిజనులను నానా బాధలు పెట్టారు. దీనివలన జరిగిన నష్టాలను సరిచేయడానికి, ఈ వనరులను తిరిగి వారికి అప్పచెప్పి, వారి కట్టుబాట్లను బలపరచడమే సరియైన పద్ధతి అని పాలకులు భావించి, ఇటీవల చట్టాలు చేయసాగారు.

(గిరిజన) షెడ్యూలు ప్రాంతాలకు వర్తించే పంచాయతీరాజ్ నిబంధనలు (1998) సంప్రదాయ మేథో సంపత్తి, జీవ వైవిధ్యం మీద హక్కులు (2002) అటవీ హక్కుల గుర్తింపు చట్టం (2006) ఈ కోవలోనివి. ఈ నేపధ్యంలో గిరిజనుల అస్మితను చాటి చెప్పే వీరి ఈ సాహిత్యంలో పండుగలు, పెళ్ళిళ్లలో పాడుకునే పాటలు అందరి నోట నానుతుంటాయి. కాబట్టి వాటిని ముందు తరం నెమరు వేయడం చాలా తేలిక.

అడవులు, బీళ్ళు భూములతో నిండిన దక్కన్ పీఠభూమిలో చిరకాలంగా సంతులనాత్మకమైన సంస్కృతి వర్ధిల్లింది. అడవులు, అక్కడి గిరిజనుల జీవన విధానం, సుస్థిర అభివృద్ధికి పునాదులు.

తెలంగాణ గిరిజన జీవన విధానాలలో వైవిధ్యం...

నల్లమల అడవులలో మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలలో ఆహారం సేకరించుకునే ఆదిమ తెగ చెంచులు, దక్షిణ తెలంగాణలో వరంగల్, ఖమ్మం జిల్లాల్లో వ్యవసాయంలోకి మళ్ళిన కోయలు, ఉత్తర తెలంగాణంలో ఆదిలాబాదులో రాజ్యమేలిన రాజగోండులు, వారి ఆశ్రితులు పరధానులు, ఆదిమ తెగలు తోటీలు, కొలాంలు, పాలకులకు సైనికులుగా పూజారులుగా పనిచేసిన పోడు వ్యవసాయదారులు నాయకపోడులు, వారి ఆశ్రితులు కొర్రాజులు, పశుపాలనతో పాటు, వ్యవసాయం స్థిరపడుతున్న బంజారాలు విస్తరించారు.

చెంచులు, నాయకపోడుల మాతృభాష తెలుగు కాగా, కోయ, గోండుల భాషలు ఒకే భాషా కుటుంబానికి చెందిన భిన్న మాండలికాలు బంజారాల మాతృభాష ఇండో ఆర్యన్ భాషా కుటుంబానికి చెందినది. మాతృభాష కాని పరిశోధకులకు మౌఖిక సాహిత్యం సేకరించడం, వాటిలో గిరిజన అస్మితకు అద్దం పట్టే వాటిని గమనించడం పెద్ద సవాలు. కొలాం, కోయల సాహిత్యం సేకరించవలసి ఉంది. ఆంగ్లంలో దొరుకుతున్న సాహిత్యానికి ఆయా భాషలలోగల ప్రక్రియలు కనుగొనాలి. సేకరించిన సాహిత్యాన్ని అవసరాలకు తగినట్లు వర్గీకరించాలి. ప్రయోగ సూచికలు తయారు చేయాలి. మా ఊళ్ళు మా రాజ్యం అనే నినాదానికి రూపమివ్వాలి. ప్రాణం పోయాలి.

నల్లమలలో చెంచులు ..

సరులు, సెలలు, గుండాలు, కురవలు, సారవలు, కట్టు వలు బరకలతో నిండిన నల్లమలలో చెంచులకు అనేక తావుల నుంచి తేనెను సేకరించడం కష్టమైన, ఇష్టమైనపని.. ఆ జీవ జీవన వైవిధ్యం మీద అల్లుకున్న వారి పాట ఇది.

గియ్ గియ్ గియ్ - పెరీగ

గియ్ గియ్ గియ్ - పెరీగ

గియ్ గియ్ గియ్ పెరయాగ - నీ వేడకు పోతావు పెరయాగ
గియ్ గియ్ గియ్ చెంచోడా -నేను యేపలకు పోతా చెంచోడ
ఏపిలతెనె తెచ్చి చెంచోడా-పిల్లల్ని బతికించుకుంటా చెంచోడ
గియ్ గియ్ గియ్ తెండీగ- నీ వేడకు పోతావు తెండీగ
నేను కుంకుళ్ళకు పోతా తెండీగ
కుంకుళ్ళ తేనె తెచ్చి తెండీగ-నే పిల్లల్ని పెంచుకుంటా తెండీగ
గియ్ గియ్ గియ్ జున్నీగ-నీ వేడకు పోతావు పెరయాగ
సర్లకు పోతా చెంచోడ-సర్లోని తేని తెచ్చి చెంచోడ,
పిల్లలను పెంచుతా చెంచోడ
గియ్ గియ్ గియ్ మొస్రీగ - నీ వేడకు పోతావు మొస్రీగ
గుమ్మళ్లకు పోతా చెంచోడ - గుమ్మల్ల తేనె తెచ్చి చెంచోడ
పిల్లలను పెంచుకుంట చెంచోడ
గియ్ గియ్ కన్నె గుల్లీగ - నీ వేడకు పోతావు కన్నీగ
పిల్పెర్ల మీదికి చెంచోడ -పిల్పెర్ల తేనె తెచ్చి చెంచోడ
పిల్పెర్ల తేనె తెచ్చి చెంచోడ - పిల్లలను పెంచుకుంట చెంచోడ

(గిలగింజ గిలమల్లెలు-17)

చెంచులకు తేనె ముఖ్యమైన జీవనాధారం. ఈ తేనెను సేకరించే తేనెటీగలు ఐదు రకాలు.

పరీగ(పెర-ఈగ) : ఇవి (చరి) కొండ చరియలలో వందల సంఖ్యలో పెరలు పెడతాయి. పెద్ద పెద్ద చెట్లపైన కూడా వందల సంఖ్యలో ఉంటాయి. ఇవి తేనెను ఎక్కువగా తొలకరి కాలంలో మాత్రమే పెడతాయి. సంచారం చేస్తాయి. కాబట్టి చెంచులు ఈ

తేనెటీగలను ఎక్కడికి పోతున్నావు పరీగా అని అడుగుతున్నారు.

తొందీగ(తొడిది-ఈగ) : కొంచెం చిన్నగా ఉండే ఈ ఈగ తొర్రలలో, బండ బొక్కలలో, పుట్టలలోని చీకటి ప్రదేశాలలో మాత్రమే ఉంటుంది. తేనె బాగా పెడుతుంది. పూత కాలం ఎక్కడ అయితే అక్కడికి పోతుంది. ఇది చెంచులాగా సంచారం చేస్తూ, తిరిగి మరల ఆ కాలానికి అదే చోటుకు వచ్చి, అదే చెట్టుకు తేనె పెడుతుంది.

జున్నీగ : ఇది అన్ని ప్రాంతాలలోను పెద్ద అడవిలో, చిన్న చిన్న కంప చెట్లలో ఉంటుంది. తక్కువ తేనె పెడుతుంది. ఎక్కడ పూలు పూస్తే అక్కడికి పోతుంది.

మొసరీగ : ఇది మనిషిని కరువదు. వేసవి కాలంలో చెంచులు అడవిలో తిరిగేటప్పుడు వారి శరీరంపైన ముసురుతుంది. కొండ రాళ్ళ చరికలు(పెద్ద పెద్ద రాళ్ళు) చెట్ల మీద ఉంటాయి. తేనె తక్కువగా పెడతాయి. సంచారి కాదు. కరువు కాలం అయినా, అదే చోట జీవనం సాగిస్తుంది. ఇది చెంచు కుటుంబాల ఆకలిని నిత్యం తీరుస్తుంది. వీటి తేనె, మైనం రెండూ వైద్యానికి ఉపయోగపడతాయి.

కన్నుగుల్లీగ : ఈగలన్నింటికన్నా చాలా చిన్నగా ఉంటుంది. ఇది పెద్ద పెద్ద చెట్ల చిన్న తొర్రలలో ఉంటుంది. తెల్లగా ఉంటుంది. తేనెపట్టులో తేనె 10 గ్రాముల నుంచి 30 గ్రాముల వరకు మాత్రమే ఉంటుంది. ఇది సంచారజీవి కాదు. ఈ విధంగా తేనెటీగలు సేకరించిన తేనెను అమ్మి సరుకులు తెచ్చుకొని చెంచులు సహజీవనం సాగిస్తారు.

తేనెటీగలు పట్టును తీసిన తరువాత ఒక చోట నుంచి వేరొక చోటకు పోయేటప్పుడు, మళ్ళీ ఈగల గుంపును ఇక్కడికే చేరమని చెంచులు పాట పాడుతారు. నీవు మా ఇండ్ల చుట్టూ ఉంటే నా పిల్లలను నేను బ్రతికించుకుంటా, నీవు ఇక్కడ లేకపోతే నీకోసం నేను అడవంతా తిరగాలి. అందువల్ల ఇక్కడనే ఉండు ఓ! పరీగా! అని ఇక్కడ తేనె ఉండే ఏపలు, కుంకుళ్ళు, గుమ్మడి, పుల్వెర, నేర ముర్కిళ్ళు, మంగలు, నిమ్మచెట్లు, కోరిందలు; ఈ పూలు పూచే చెట్లకు దగ్గరగా ఉండాలి అని చెంచులు తేనెటీగలను కోరుకుంటారు. అడవులలో తేనెలు ఎక్కువగా ఉండేది, యేవలు పూచేది, చెంచులందరికీ ఆనందం కలిగించేది తొలకరి కాలం. ఈ కాలంలో ప్రతి తేనెపట్టుకు తేనె ఉంటుంది. ఏ చెంచు ఆకలితో వస్తు ఉండరు. అవి తన చుట్టూ ఉంటే వారు అడవిలో ఎక్కువ దూరం పోయేపని ఉండదు.

కొత్త ఫలం ..

జానకయల్ మాగినయ్ - నల్లంగులు మాగినయ్
బుట్టతేరా-పెండ్లికొడకా పండ్లుకోద్దాం
చిటింకాయల్ మాగినయ్-తానికాయల్ మాగినయ్
బుట్టతేరా-పెండ్లికొడకా పండ్లుకోద్దాం

(గిలిగింజ గిలిమల్లెలు-9)

అడవిలో కాసే ప్రతి పండు సంవత్సరానికి ఒకేసారి పండుతుంది. కనుక మనం వచ్చే సంవత్సరం ఈ కాలం వరకు బతుకుతామో లేదో తిందువురా! "కొత్త ఫలం" అంటూ జానపండ్లు ఇంటింటికి పోయి ప్రతి ఒక్కరి చేతిలో కొత్త పండు పెడతారు. ఈ జాన పండ్లు తొలకరి వర్షాల తరువాత వచ్చే తొలి పంట. ఏ చెట్టు పండైనా, ఎంత ఎత్తులో ఉన్నా వాటిని చెట్లెక్కి కోస్తారే తప్ప చెట్టుకు ఎలాంటి హాని తలపెట్టారు. తెలియని పిల్లలు ఏ మాత్రం కొమ్మ నరికినా "వచ్చే సంవత్సరం ఎవ్వరి పియ్యి తింటావురా!" అని వెంటనే తిడతారు.

<u>అందరికీ సంక్రాంతి పంటలు - అరగని దుంపలతో చెంచు పిల్లల బాధలు...</u>

అడవిలో దుంపలు చెంచులకు ఆధారం. చుట్టు పట్ల రైతులందరూ పంటలు పండి సంక్రాంతి పండుగ రకరకాల పిండి వంటలతో చేసుకుంటుంటే, చెంచు పిల్లలు ఉడికి ఉడకని గడ్డలు(దుంపలు) తిని అవి అరగక బాధపడుతుంటారు.

సంక్రాంతి పండుగలంటే - చింతకాయ మొద్దులు
దావర్లకు పెడదామంటే - చింతకాయ మొద్దులు
పండగ రోజు మేము - చింతమొద్దులు తిని
గడ్డలకు పోతుండము గడ్డలకు పోతుండము
గడ్డలు తెచ్చుకొని-నూలగడ్డలు కుండలో పెట్టుకుని
వండుకుని తింటాము-వండుకుని తింటుంటె
ఉడకవు నూలగడ్డలు-ఉడకవు నూలగడ్డలు
కుండలో పెడుతుంటే - ఉడకని అట్టనన్న ఇట్టనన్న
కడుపులో గుంజుతావని -పిల్లలు చస్తారని
పిల్లలు చస్తారని -ఉడికిందో ఉడికిందో
నమలుక తిని-నీళ్ళు తాగి పండుంటిమి
తాత అవ్వా అమ్మా, అయ్యా
చిన్నపిల్లలప్పటి నుంచి సాకితిరి
మమ్మల్ని విడిచిపెట్టి పోతిరి - **(గిలిగింజ గిలిమల్లెలు-57)**

చలికాలంలో చింతమొద్దులు తప్పించి ఏమి దొరకవు. ఆ సమయంలో కేవలం దోరగా ఉన్న చింతకాయలు మాత్రమే అందుబాటులో ఉంటాయి. అప్పుడు చింతపండును బూడిదలో అద్దుకుని తిని ఆకలిని తీర్చుకునేవారు.

అడవిలో ఉన్న అన్ని గడ్డల కన్నా నూలగడ్డలలో పీచు ఎక్కువగా ఉంటుంది. అందువల్ల పిల్లలకు బాగా ఉడికిన నూలగడ్డలు అదీ మొగ్గ గడ్డలనే తినిపిస్తారు. ఈ గడ్డలు సంక్రాంతి పండుగ వచ్చేసరికి బాగా ముదిరిపోయి గట్టిగా ఉంటాయి. బాగా ముదిరిన గడ్డలు కుండలో పెడితే ఉడకవు. చప్పిడి గడ్డలు అయిపోతాయి. కుళ్ళిపోవడానికి సిద్ధంగా ఉన్న వాటిని చూస్తే తిందామనిపించదు. వట్టి పీచు పీచుగా ఉంటుంది.

ఈ నూల గడ్డలను చిన్న పిల్లలు తింటే వారికి వారం వరకు విరేచనాలు కాక చనిపోతారు. ముసలివాళ్ళు అరగక చనిపోతారు. పనులు ఉండవు, ఆహారం దొరకదు; అడివంతా గడ్డి దట్టంగా ఉండి ఏమీ కనిపించదు. అందువల్ల అడవికి పోరు. ఏదో దొరికింది తిని అందరూ ఇంట్లోనే ఉంటారు.

పెండ్లికొడుకును ఎంచుకున్న చిన్నలింగి :

ఇన్ని బాధలున్నా చెంచిత చెంచునే ఎందుకు ఇష్టపడుతుందో

తెలిపేది ఈ పాట.

ఒక కన్య తన వరుణ్ణి ఎంచుకుంటూ, ఒకొక కులానికి చెందిన వరుణ్ణి తిరస్కరించడానికి కారణాలు చెపుతూ- తాగినా, తన్నినా "కన్నెగుల్ల తేనె-మెట్ట తాబేలు మాంసం" తెచ్చి పెట్టే చెంచునే చివరికి వరిస్తుంది.

గిరిగింజ గిరిమల్లెలూ గిరిగింజ గిరిమల్లెలూ

చింతచెట్టు కింద నా చిన్నలింగి-నా చిన్న లింగిని ఇంకెవరికిత్తునో

మాదిగోని కిస్తను పోతావా బిడ్డ-చింత చెట్టు కింద నా చిన్నలింగి

చాకలోని కిస్తను పోతావా బిడ్డ-చాకలోని చాకిరి నేను చెయ్యలేను

కుమ్మరోనికుండలు నేను కొట్టలేను-ఉప్పరోనికిస్తను పోతావా బిడ్డ

ఉప్పరోని బావులు నేను తవ్వలేను- మాలోనికిస్తను పోతావా బిడ్డ

మాలోని తోలు నేనోల్ల లేను- శంకరయ్య కిస్తను పోతావా బిడ్డ

శంకరయ్య చాకిరి నేనుచేయ్యలేను-లంబడోనికిస్తను పోతావా బిడ్డ

లంబడోని కడాలు నేను తొడగలేను-చెంచోనికిస్తను పోతావా బిడ్డ

చెంచోనికైతే నేను పోతాను-చెంచోడు నీకేమి తెచ్చె

చెంచోడైతే తాంబేలు ఇరగలు తెచ్చి పెడతాడు- చెంచోడైతే కన్నెగుల్ల తేనెతెచ్చిపెడతాడు

సారాయి తాగితే కొడతాడె బిడ్డ - సారాయి తాగైనా నన్ను సాకుతాడయ్య ...గిరిగింజ...

(గిరిగింజ గిరిమల్లెలు-69)

తెలుగుదేశం మధ్య నున్న నల్లమల మీద పట్టు సాధించడానికి నాటి పాలకులు చెంచులతో వరసలు కలుపుకొని, భ్రమరాంబ, చెంచులక్ష్మిలను శివకేశవులకిచ్చి పెళ్లి చేశారు. వారు మన అందరి ఆదర్శాలలో భాగమైనారు.

ఉత్తర తెలంగాణలో గోండులు, పరధానులు, కొలాంలు

మధ్య భారతంలోని గోండ్వానా ప్రాంతంలో వ్యాపించిన గోండ్ తెగలో ఆదిలాబాద్ జిల్లాలో గల వారు రాజగోండ్‌లు, వారి ఆశ్రితులు పరధానులు, తోటీలు. వీరి కట్టుబాట్లను వారి పెద్దల సభలు(రాయ్ సెంటర్లు) అమలుచేస్తాయి. లోయపాటర్, పడక పాటర్, శివారం, కొరుమర, రాజుల్క్, దాట్వా, లొద్ది, ఘోంది, ఖోరీ, భయారి, ధడీ, ఉతార్ ఇవన్నీ వారు పరిసరాలను పిలుచుకునే పదాలు.

గిరిజనులందరూ నృత్య గానాలతో పాటు మద్య మాంస ప్రియులు, ఆ పిచ్చిలో పడి దేవతల పట్ల అమర్యాదగా ప్రవర్తించి గోండ్‌లు కష్టాలపాలవుతారు. పరధానులు దేవతలను కీర్తించి, ప్రసన్నం చేనుకొని గోండుల కష్టాలు తీరుస్తారు. వారు పాడే పురాగాథలు ఈ పరిణామాలను చిత్రిస్తాయి. వీటిలో అన్నలక్ష్మికథ గోండుల గర్వభంగాన్ని వివరిస్తుంది.

అన్నలక్ష్మి ..

ఒకప్పుడు గోండులు గడ్డిగింజల మీద బతికేవారట. అడవి దుంపలు, సారపప్పు తిని బతికే గోండుల ఆకలిబాధలు చూసి శంభుమహదేవ్ వారికి సాయం చేయాలని సంకల్పించాడు. అందరు దేవతలతో సభ ఏర్పాటు చేశారు. బీర్‌బిక్రం రాజుకు జంతుభాషలన్ని తెలుసుకాబట్టి, అతడికి అన్నరాణిని వెతికే బాధ్యత అప్పగించాలని శ్రీశేక్(సర్పరాజు) సలహాఇచ్చాడు. పక్షులు రాజుకు సహాయం చేసి జొన్న పంట చూపించాయి. ఇంటికి తీసుకువెళ్ళి దేవతలకు మొక్కి పంట నూర్చుకోమని చెప్పాయి. రాజుకు తొందర ఆగక, ముందే పంటకేసి చూశాడు. పంటలో ఆరు నెలల పాప అన్నరాణి కని పించింది.

పంటలు బాగా పండడంతో గోండులు విచ్చలవిడిగా వ్యవ హరించడం మొదలుపెట్టారు. పంటంతా దాచుకోవడానికి చోటు చాలడం లేదు. ఇంట్లో చోటు లేదని అన్నరాణిని బయటకు పంపించే శాడు.

అన్నరాణిని పిలుచుకుని వచ్చిన గోండురాజు విక్రమ్ దగ్గర ఆమె ఉన్నంతకాలం పంటలు బాగానే పండాయి. కాని ఆమెను బయటకు పంపడంతో కరువు వచ్చింది.

దేశాలు పట్టిన అన్నరాణిని మరాఠీలలో మాంగ్ కులస్థుడు హరిరామ్ ఆదరించాడు. అప్పటి నుంచి మాంగ్ కులస్థులు జొన్నపంటకు నాయకులైనారు.

చివరకు రాజావిక్రమ్, మరాఠీలలో "మాంగ్" వారి నుంచి రెట్టింపు ఇచ్చే షరతుమీద, విత్తనాలు తెచ్చుకుంటాడు. కానీ అప్పు తీర్చలేదు. సాక్షులైన సూర్యచంద్రులకు అతడు ఫిర్యాదు చేశాడు. ఎటూ చెప్పలేక సూర్యచంద్రులు మసకబారిపోయారు అంటే వారికి గ్రహణం పట్టింది. గ్రహణ సమయంలో ఇప్పుడు కూడా మాంగ్‌లు అందరి రైతుల దగ్గరకు వెళ్ళి తమ అప్పులు వసూలు చేసుకుంటారు.

అన్నపూర్ణ, చేతిలో గంటెతో అన్నం వడ్డిస్తున్న విగ్రహాలు గోండు ప్రాంతమంతా ఉన్నాయి. జొన్నపంట కోసేటప్పుడు అన్నలక్ష్మితో పాటు ఏడుగురు దేవతలకు మొక్కుతారు. గోండులలో కలిగినవారు ప్రధానుల చేత అన్నరాణిపాట పాడించుకుంటారు.

ఇటువంటి చాలా గోండుకథలు ఆంగ్లంలో దొరుకుతున్నాయి కాని వాటికి సరిపోయే గోండీ పాటలు అచ్చులో దొరకడం లేదు. గిరిజనులలో చాలా మంది ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. పాటలు పాడే వారిని పాఠశాలలకు రప్పించి, పిల్లలకు నేర్పించి వాటి విలువ తెలియజెప్పడం వారి బాధ్యత.

గోండుల ఆటపాటలు...

పరధాన్‌ల కథాగానాల ప్రకారం పహండి కుప్పార్ లింగో ఆదిగురువు. 'సోడా డెంసాంగ్' (16 వాద్యాలు), 'అట్రా వజగ్' (18 అడుగులు) అనే నృత్య గానాలను గోండుల బంధ విముక్తి కోసం గుహల ముందు ప్రదర్శించారు.

ఆషాడ పౌర్ణమి రోజున మగవారు దండారి నృత్యం చేస్తారు. స్త్రీ, పురుషుల కలిసి థెంసా నృత్యం పెళ్ళిళ్ళలో చేస్తారు. దండారి నృత్యం అయిదు రకాలు. గుసాడి, గుమ్మెల, పర్ర, టప్పల్, కొదల్-గుసాడి నృత్యాన్ని గోండులందరూ చేస్తారు.

గుమ్మెల నృత్యాన్ని నాల్వెన్ సగావాళ్ళు, సియ్‌వేన్ సగా వాళ్ళు, పర్ర నృత్యాన్ని సార్వెన్ సగావాళ్ళు, కొదల్ నృత్యాన్ని, టప్పల్ నృత్యాన్ని ఏడ్వెన్ సగావాళ్ళు చేస్తారు. (సగా-గోత్రం) ఒక చెట్టు, జంతువు గోత్ర చిహ్నంగా ఉంటాయి. వాటిని పోషించాలి, నాశనం

చేయకూడదు.

దండారి పాటలో ఋతువులు-కాలమానం ..

దెన దెన రేరేన -దేన దేన దేదేనా
ఒడి దిన వైన నచి దాదా-పెర్సా భావె దినం నవి దాద
టన్ వజి బడె దినం దాదా-సార్ మెట అకరి దినం దాదా
మెతామ్ మారట్ టిండ్‌కట్ నవి దాదా -టడ్ బాబున వాకుట్న
నిషన్ దాదా
నిషిన్ జార్ మానుట్ నావి దాదా -కొంక్ వాటంగ్ బక్రన
భోజన్ ఆట
డార్ బెలిత్ బాజున్ నావిదాదా- మేతమా భగత్ మారత్
వోకట్ నావి దాదా
మాకున్ బుదిటి జార్ వెహనా నావిదాదా-శ్రంబుల్ అండె
మంతోర్ నివ దాదా
అయినా మరత్ బాల డాకట్ నివ దాదా

(గిరిజన సాహిత్యం-79)

అయినా మరత్ బాల డాకట్ నివ దాదా

వచ్చే రోజు ఏమి రోజు? అదే పెర్సాభావె దినం అన్నా. ఆ తరువాత బుడ్ భావె. దాని మీద అకారి దినం. ఈ రోజుననే దేవతలు నృత్యం చేస్తారు. ఆడతారు, పాడతారు. సంవత్సరాని కొకసారి వచ్చే ఈ రోజున మనం మన దేవుళ్ళను పూజించాలి. ఈ సంస్కృతి, సంప్రదాయం ఎక్కడి నుంచి వచ్చింది అన్నా.? అయిదు గురు అన్నదమ్ముల దేవుళ్ళు అన్నా! వాళ్ళే దండారిని మొదలెట్టారు.

ఈ పాటలో వచ్చే భావి, బుడ్ భావి, అకాడి నోవోస్ మొదలై నవి వారి నెలల పేర్లు, గిరిజనుల కాలమానం ఋతువులను, మార్పులను తెలియజేస్తుంది. గోండులు ప్రతి నెలలో ఏదో ఒక పండుగ చేసుకుంటారు. 1.ధూరాడి(హోళి) ఫాల్గుణమాసం పూర్ణిమ, 2. మాండామస్ ఫాల్గుణమాసం అమావాస్య, 3. చైతమ్ నామర్మింగ్ (భీమదేవుని పూజ), 4. అవ్వల్‌పేన్ (గ్రామదేవత), 5. ఆకిపేన్, 6. ఆకడి (ఆషాఢమాసం), 7. జామూర్ ఆముస్ (ఆషాఢమాసం-అమావాస్య), 8. నాగపంచమి (శ్రావణమాసంలో పూర్ణిమ), 9. దివాడి (దీపావళి), 10. సట్టిపేన్ (దీపావళి తరువాత పూర్ణిమ), 11. పెర్సాపెన్ (పెద్ద దేవుడు), 12. దేవల్‌పునాక్ (దేవతల పూర్ణిమ).

'బతుకు, బతకనియ్యి' ..

ఈ గీతం, చుట్టపట్ల జీవరాశి పట్ల వారికి గల మన్ననను తెలియజేస్తుంది.

దేన దేన దేరేనా దాదరో- దేన దేన దేదేన దాదరో
చుచూ చుండి మెట్టతే- మల ఎందా లాత
తరా యంగే భాండే-మల్ పాయ దాకా
పాయ్‌మా కోకో పాయ్‌మా -మల్‌యా స్కున్ వాత
తరాయంగే బాండే- మల పాయ దాక

(గిరిజన సాహిత్యం-83)

"దట్టమైన అడవిలో కొండ పైన ఒక నెమలి నాట్యం చేస్తుంది. ఓ వదినా! బాణం ఇవ్వు ఆ నెమలిని కొట్టుకొని వస్తా, ఓ మరిది అది గుడ్లకు వచ్చిన నెమలి దాన్ని చంపకూడదు" అని వదిన మరిదిని వారిస్తుంది.

గోండుల మరో ఆశ్రితులు తోటీలు. వారు గోండులకు గోండు భాషలో, వారిలో దిగువ ప్రాంతాలలోగలవారు ముదిరాజు లకు తెలుగులో పాండవుల కథలు చెపుతారు. అందువల్ల వీరిని పాండవులోళ్లని పిలుస్తారు.

కర్ణుడి కల్యాణం ..

వచనం - పాట-వాయిద్యాలతో రక్తి కట్టిస్తూ ఆశువుగా సాగే వీరి కథాగానం పాండవుల చరిత్రలో చూపించే కొత్త మలుపుల కోసం కర్ణుడి కల్యాణం ఉదాహరణగా చెప్పవచ్చు.

దుర్యోధనుడు కర్ణుడిని రాజునైతే చేశాడు కాని క్షత్రియు లెవ్వరూ అతనికి పిల్లనివ్వడానికి ఇష్టపడరు. అదీకాక, బోలెడు జీతం ఇచ్చి, పైగా ఖర్చు కూడా మనమే పెట్టుకొని పెళ్ళి చేయాలా? అంటూ శకుని అడ్డుపుల్ల వేస్తాడు. "కర్ణుడు ఆస్తినంతా దానం చేస్తున్నాడు. పెళ్ళి చేస్తే రోగం కుదురుతుంది" అని ధర్మరాజు కర్ణుని పెళ్ళికి కావలసిన ధనాన్ని భీముణ్ని తీసుకొని రమ్మంటాడు. భీముడు ప్రజలను పన్నులు కట్టమని ఆదేశిస్తాడు. రాజులుగా ప్రజలక్షేమాన్ని పంటల బాగును చూడలేదు కాబట్టి పన్నులను కట్టబోమని ప్రజలు ఎదురి స్తారు. భీముడు తన తప్పిదాన్ని గ్రహించి, క్రూరమృగాలను చంపి, పంటలను రక్షించి పన్నులు వసూలు చేస్తాడు. ఆ ధనంలో పాండవులు కర్ణుని పెళ్ళి నందిగామరాజు కూతురితో జరిపిస్తారు. నందిగామ రాజు మొదట సూతపుత్రుడైన కర్ణునికి తన కూతురిని నివ్వనంటాడు. భీమార్జునులు అతనితో యుద్ధం చేసి ఓడించి కర్ణుని పెళ్ళి జరిపిస్తారు.

ధృతరాష్ట్రుడు పంచి యిచ్చిన ఇంద్రప్రస్థం భూముల్లో పాండ వులు వ్యవసాయం చేద్దామనుకుంటారు. ధర్మరాజు గాంధారి పెద్దమ్మ దగ్గరున్న మూడుసోల్ల విత్తనపు కొర్రలను అడిగి భీముణ్ని తెమ్మం టాడు. గాంధారి ఈర్ష్యతో కొర్రలను వేయించి ఇస్తుంది. వాటిని చూచి ధర్మరాజు మాలో సత్యముంటే పంటలు పండుతాయని, భూమి దున్ని విత్తనం వేయమని భీమునికి చెపుతాడు. భీముడు పెద్ద పులులు నాగసర్పాలతో నాగలి కట్టి, భూమిని ఐదుచాళ్లు (వరుసలు) దున్ని విత్తనాలు వేస్తాడు. 77 పుట్ల ధాన్యం పండుతుంది. ఒకటి చాకలి వారికి, రెండవది వడ్ల కమ్మర్లకు, మూడవది అతిథులకు, అనాథలకు, నాలుగవది పన్ను కట్టడానికి, ఐదవది తమకొరకు పాండవులు పంచుతారు.

"మా విత్తనాలతో దున్నినారు కాబట్టి ధాన్యమంతా మాదే" అని దుర్యోధనుడు యుద్ధానికి వస్తారు. యుద్ధంలో శ్రీకృష్ణుని సహా యంతో పాండవులు గెలుస్తారు. రక్తంతో తడిసిన ధాన్యం తమకొద్దని, అవి దుర్యోధనాదుల దినవారాలకే పనికివస్తాయని గోతులు త్రవ్వి భద్రపరుస్తారు. మైసమ్మ దేవతను ధాన్యానికి కాపలాగా పెడతారు.

రాజధర్మాన్ని వర్ణించే ఈ పాండవుల కథలను నాయకపోడుల ఆశ్రితుల కొర్రాజుల నుంచి త్యాగంగా స్వీకరించామని పాండవులోళ్ళు చెప్పుకుంటారు.

(ఇంకా ఉంది. వచ్చే సంచికలో చదవండి...)

Unfiled Notes Page 16

కీ.శే.కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు

తెలుగులోని విభక్తి ప్రత్యయములు

ఎంతో ప్రాచీనతనూ, తనదైన గొప్పదనాన్ని అనేక తీరులుగా సొంతం చేసుకొన్న ప్రజల భాష తెలుగు. వృత్తుల విజ్ఞానంలో తెలుగు వారికున్న ప్రతిభ, వారి భాషా సంపదలోనే కనిపిస్తుంది. కాని తొలుత సంస్కృతం నుండి ఇంగ్లీషు వరకు పలు భాషల పెత్తనం(ఆధిపత్య భావజాలంతో) నలిగిపోయింది. పరాయీకరణకు గురి అయింది, అవుతూనే ఉంది. ప్రతిభాషకు తనదైన భాషాతత్వం ఒకటి ఉంటుందనేదాన్ని విస్మరించి మన పండితులు ఆధిపత్య భావజాలాన్ని మోస్తూనే ఉన్నారు. వందేళ్లనాడే గిడుగు, గురజాడ, శ్రీపాద, తాపీ వంటివారు ఒక కోణం నుంచి భాషా సంస్కరణకు పూనుకోగా, భాషాతత్వం అనే అంశంపై చూపుపెట్టి, కొమఱ్ఱాజులాంటి పండితులు కొంత కృషి చేశారు. ఆ మహానుభావుడు రచించగా, అముద్రితంగా ఉండిపోయిన 'తెలుగు భాషా తత్వము' చాలా ఆలస్యంగా గ్రంథ రూపంలో వచ్చింది. దాని నుండి 'తెలుగులోని విభక్తి ప్రత్యయములు' అనే అధ్యాయాన్ని ఇక్కడ ప్రచురిస్తున్నాము. భాషాబోధనా రంగంలోని వారేగాక, తక్కిన ఎవరైనా తెలియదగిన అంశాలు యిందులో ఉన్నాయి **– సంపాదకుడు.**

ప్రథమ - ఁడు, ము, వు, లు, రు (యు,ను)
ద్వితీయ- న్, ని, ను,
తృతీయ - చేన్, చేతన్, తోన్, తోడన్.
చతుర్థి- కై, కొఱకు.
పంచమి - వలన, కంటె, పట్టి.
షష్ఠి - కిన్, కున్, యొక్క, లోన్.
సప్తమి - అందు, న.

వీనిలో ప్రథమ, ద్వితీయా, ప్రత్యయములును, షష్ఠి కి, కు, సప్తమి 'న' అను ప్రత్యయములును తప్ప మిగిలిన వన్నియు స్వతంత్ర శబ్దములు క్రమముగ ప్రత్యయములయినవి. ఇఁక వీని యుత్పత్తి విచారింతము.

"ఁడు" అను ప్రత్యయము అచ్చతెలుఁగు ప్రత్యయముగాఁ గానవచ్చు చున్నది. ఆర్యభాషలలోఁ గాని, ద్రావిడ భాషలలోఁ గాని యీ ప్రత్యయ మెచ్చటను గానరాదు. కావున పురుష వాచక మగు నీప్రత్యయము తెనుఁగునఁ బ్రత్యేకముగ నేర్పడినట్లు కానవచ్చుచున్నది. తెనుగునందయినను ఎట్లు ఏర్పడినదని విచారింపగా 'వాండు' అను ప్రథమ పురుష దర్శక సర్వనామము నందలి చివర యక్షరమే యిదియని తోఁచుచున్నది. పురాతనాంధ్రము నందుఁ బురుషత్వ మును విశిష్టముగ సూచింపవలసి వచ్చినప్పుడు 'వాండు' పదమును ప్రత్యయముగ తెలుఁగు పదమునకుఁ దగిలించుచుండిరి. ఇప్పటికిని విశేష్య విశేషణములకు మన మీ ప్రత్యయ మీ యర్థమునందే తగిలించుచున్నాము. ఉ :- వంటవాఁడు, చాకలివాఁడు, నల్లవాఁడు, మంచివాఁడు. పోనుపోను ఈ "వాండు" పదమందలి మొదటి యక్షరము, ఉచ్చారణ సౌకర్యార్థము తొందరగా నుచ్చరించుటలో, లోపించి చివరదియగు బిందు పూర్వక డకారము మిగిలిపోయి, కొన్ని దినములు పోఁగా నది పుంలింగ సూచక ప్రత్యయముగ నెంచఁబడెను. ఇందుకుఁప్రబలమైన దృష్టాంతముగ నచ్చ తెలుఁగు శబ్దంబులు కొన్ని ఉభయ రూపంబులు గలవి మన భాషలో నింకను కలవు. వానినిఁ బట్టి మనము 'ఁడు' ప్రత్యయము 'వాఁడు' లో నుండి వచ్చినదని నిశ్చయింపవచ్చును. ఉ : మగవాఁడు, మగఁడు;[10] పిల్లవాఁడు, పిల్లఁడు; గొల్లవాఁడు, గొల్లఁడు; అల్లువాఁడు, అల్లుఁడు;[11] బోయవాఁడు, బోయఁడు; మాలవాఁడు, మాలఁడు; ఏ వాడు, ఏఁడు; అట్టివాఁడు, అట్టిఁడు; ఇట్టివాఁడు, ఇట్టిఁడు; ఎట్టివాఁడు, ఎట్టిఁడు; బాపనవాఁడు, బాపనుఁడు, బాపఁడు; మొదలయినవి. ఇందలి మొదటి యుదాహరణముఁ దీసికొందము., 'మగవాఁడు, మగఁడు' ఇవి స్వతంత్ర శబ్దములు కావనుటయు, ఒకే శబ్దమునకు భిన్న, రూపములనుటయు స్పష్టము. 'మగవాండు' లోని 'వా' లోపించిఁ 'మగఁడు' అను మాట సిద్ధించినది. ఈ 'మగ' పద మన్ని భాషలలోను కలదు. అఱవము నందును, కన్నడము నందును 'మగ' పదమునకు సంతానమని యర్థము.[12] పురుష సంతానమనుటకు మగన్, మగను అందురు. స్త్రీ సంతానమనుటకు 'మగళ్', 'మగళ్' అందురు. మూల ద్రావిడ భాషలోని ఈ 'మగన్' పదము తెనుఁగులోనికి పురుష పదముగ వచ్చి, తరువాత దానికి భర్త యన్న యర్థము కూడఁ గలిసెను. పెక్కు భాషలలో పురుషపదములే భర్తపరమైన యర్థము నిచ్చును. సంస్కృత మందలి 'పురుష' పదమును ఇంగ్లీషులోని 'మ్యాన్' పదమును ఇట్టివియె. 'మ్యాన్&ఉమన్' అనగా 'భర్త, భార్య' అని యర్థము. ఇట్లితర ద్రావిడ భాషలలో సర్వలింగ సామాన్యమైన పదము తెలుగులోనికిఁ బురుష పరముగ మాత్రము రాఁగా, ఆ లింగమును సూచించుటకు 'వాండు' ప్రత్యయము పెట్టుట యావశ్యకమయ్యె. అదియే 'ండు'గ మారెను. ఇట్లే యితర పదములను గుఱించియు నెఱుఁగునది. పై పదములందు 'వాఁడు'తోఁ గూడిన పదములు భాషలో మొదటఁబుట్టినవి. రెండవ రూపములు తరువాతఁబుట్టినవి. క్రియాపద రూపంబులలోఁ గూడ 'వాండు' పదము నందలి 'వ' కారమునకు లోపంబు గల్గి 'ండు' ప్రత్యయము కల్గినట్టు దృష్టాంతములు కలవు.

'వచ్చిన వాఁడు,' 'వచ్చినాఁడు' (వచ్చాడు, వచ్చిండు, అను గ్రామ్య రూపములును గలవు), 'కలవాఁడు', 'కలఁడు', ఉన్న వాఁడు, ఉన్నాఁడు, (దీనికి 'ఉన్నడుఁ' 'ఉండు' అను గ్రామ్య రూపముఁ గలదు). ఇట్లు క్రియారూపములలో 'వాఁడు' లో వకారము మాత్రము లోపించి 'ఆండు' వర్ణములు మిగిలి యుండును. కానీ యిందలి 'ఆ' కారము పూర్వ హల్లునం దుఁ జేరియే యెప్పుడు వచ్చుచున్నందునను, గ్రామ్య రూపములలో నీ 'ఆ' కారముగూడ లోపించు

చున్నందునను, 'ఁడు' అనునది పురుష వాచక ప్రత్యయముగ భాషలోఁ బరిణ మించెను. ఇట్లు 'ఁడు' అనునది పుల్లింగ సూచక ప్రత్యయముగ విడిపోయిన తరువాత దానిని సంస్కృత సమ శబ్దముల యందు విచ్చలవిడిగ నుపయోగింప సాగిరి. ఈ 'ఁడు' ప్రత్యయము ఎక్కువ తెలుఁగు పదములకు రాదు. 'ఆచ్ఛిక శబ్దంబులెల్లం దఱచుగ స్త్రీ సమంబులుం గ్లీబసమంబు లయియుండు' (బాల, ఆచ్ఛి,') అన్న వ్యాకరణ సూత్రమునకు నిదియే కారణము.

ఈ 'ఁడు' ప్రత్యయము తెలుగులోనికెప్పుడు వచ్చినది? సంస్కృత భాషతో సంబంధము కలిసిన తరువాతనా ? అంతకుఁ బూర్వమా? సంస్కృత భాషతో సహవాసము కలుగక మునుపే ప్రత్యయము 'వాఁడు' నుండి విడిపోయి స్వతంత్రమయ్యెను. ఎందుకనగా 'వాఁడు', 'ఁడు' అను రెండు ప్రత్యయములతోఁ గూడిన పదములు దేశ్యములందే కలవు. తత్సమ తద్భవములందు లేవు. 'రాము వాడు' 'జము వాఁడు' అనురూపములవంటి రూపము లెచ్చటను కానరావు. అందుచే సంస్కృత పదములు మనవారు వాడుటకు బ్రారంభించుటకుఁ బూర్వమే పుంలింగసూచకమైన 'ఁడు' ప్రత్యయము తెలుగులోనికి వచ్చెను. ఆప్పటికే అఱవము, కన్నడముల నుండి తెనుఁగు విడిపోయినట్టును మనమూహింప వచ్చును. లేనియెడల ఈ ప్రత్యయ మాభాషలలోఁగూడ వచ్చియుండును.

ఇక నీ 'ఁడు', 'వాడు' అనుపదమందైనను ఎట్లు వచ్చెనని మనము కొంత విచారింతము. ఆందుకై మనము ద్రావిడ భాషలు చీలని పురాతన కాలమునకుఁ బోవలెను. 'వాండు, వీండు, ఎవండు, ఆనుపదములకు అఱవము నందును, కన్నడము నందును, అను క్రమముగా, అవన్ (అ), అవను (క), ఇవన్ (అ), ఇవను- (క), ఎవన్ (అ), ఎవను (క), అను పదములు కలవు. 'అవన్' అను పదమునందలి మొదటి 'అ' కారము 'వ' కారమునకుఁ బరమైనందున వాన్ ఆయెను. దానికి 'ఁడు' ప్రత్యయము తగిలి 'వాన్ డు', 'వాండు' ఆయెను అనియు, ఇట్లే 'ఇవన్' నుండి 'వీన్డు' 'ఎవన్' నుండి 'వేన్ డు' 'ఎవన్ డు', శబ్దములు పుట్టెనని శేషగిరి శాస్త్రిగారు వ్రాసియున్నారు. ఇందు కొంత నిజము లేకపోలేదు కాని యిది పూర్తిగ సరియైన వ్యుత్పత్తికాదు.'ఆవన్' 'ఇవన్' అను అఱవఁ పదములు స్వతంత్ర పదములు కావు. ఇందలి 'అ' 'ఇ' 'ఎ' అను వర్ణములు దర్శక సర్వనామములు. ఇవి ద్రవిడ భాషలకన్నింటికిని సామాన్యములు. కావున వీనిని అ+వన్ , ఇ+వన్, ఎ+వన్ అని విడదీయగా 'వన్' అనుమాట సామాన్యమైనది. ఇదియే మూలశబ్దమైయుండు. అన్ని ద్రావిడ భాషలకుఁ దల్లియైన మూలభాషలో, 'వన్డ్' అను ఒక పదముండెనని తోఁచెడిని. దీనికి మనుష్యుఁడని గాని 'వాఁడ'ని గాని ఆర్థ మైయుండనోపు. ఆ మూలపదములో నుండి చివర నున్న 'డ్' ను వదలి 'వన్' అనుపదమునే అఱవ కన్నడములు గ్రహిం చెను. దానికి అ, ఇ, ఎ, అను దర్శక సర్వనామములను తగిల్చి అవన్, ఇవన్, ఎవన్ అను పదముల నా భాషలు నిర్మించు కొనియె. తెలుగు మాత్రము 'వన్డ్ లేక 'వాన్డ్' అను పదమును పూర్తిగ గ్రహించి దానికి ఆ, ఈ, ఏ దర్శక సర్వనామములఁ దగిలించి 'వాఁడు' వీఁడు' 'ఎవడు' అను పదములను నిర్మించుకొనియె. 'ఎవండు' అను పదము మొదటిది. ఏవాఁడు, ఎవ్వాడు, ఏఁడు అను, పదములు 'వాఁడు' అను పదము పుట్టిన తరువాతఁబుట్టినవి. మూలపదము 'వన్' అగునా లేక 'వాన్' అగునా ? అనఁగా ఆఱవవారును, కన్నడ వారును మొదటి శబ్దమందలి 'డ్' కారమును జారవిడిచిరా? లేక తెలుగువారు 'డ్' అని క్రొత్తగా తెచ్చి పెట్టుకొనిరా ? ఇందును గుఱించి విచారింపగా, భిల్లి అను ద్రవి భాషలో 'వాఁడు' అను అర్థము నిచ్చు 'అవన్ద్' అనుపదము కలదు. ఇందుండి 'అ' కారమును తొలగించిన 'వన్ద్' అనుపదమును వచ్చును. ఈ భాషయు తెలుఁగువలెనే మూల పదమైన 'వన్ ద్' ను వదలలేదు. 'ద' కారము 'డ' కారముగాను. 'డ' కారము 'ద' కారముగాను మారినందునకు తెనుఁగునను, ఇతర భాషలలోను పెక్కు ఉదాహరణంబులు కలవు. కొలామీ : అమ్ద్ = ఆంద్ = వంద్ = వండ్ = పర్జీ; ఓద్ = ఓడ్ = వాడ్. మద్రాసు రాష్ట్రంలోని గోండీ ; ఓణ్ డు = వాన్డు. ఇట్లు మూలద్రావిడ శబ్దము 'వన్ డ్' లేక 'వన్ ద్' అనునది, అందుండి "వాండ్" "వాండు" "వాఁడు" పుట్టినవి అని మన మూహింపవచ్చును.

ఈ 'న్డు' ప్రత్యయము ఒకప్పుడు 'అన్డు' గను, ఒకప్పుడు 'ఉన్డు' గను ఉండును. అనఁగా ఈ ప్రత్యయ మొకానొక శబ్దమునకుఁ దగిలినపుడు ఒకప్పుడు ఆ శబ్దము యొక్క చివర నున్న అకారము ఉకారముగ మారుటయు, ఒకప్పుడు మారకుండుటయుఁ గలదు. సంస్కృతపదముల పై 'ఉండు' గను, ఆచ్ఛిక పదముల పై 'ఆండు' గను వచ్చును. కావున 'అండు' అను రూపమే మొదటిది. ఉ : మగఁడు, గండఁడు, బాపఁడు. ఈ ఆకారమే అచ్చాంధ్ర సంప్రదాయము. తెల్గు దేశమందలి కొన్ని పురుషనామములు కలవు. సుబ్బఁడు, ఆప్పఁడు, పుల్లఁడు, సింగఁడు, లింగఁడు, రంగఁడు. ఇందు లింగ శబ్దము సంస్కృత మైనను, నపుంసకము; పురుష వాచకముగ నెన్నఁడు వాడఁబడదు. ఇచ్చట దానిని పురుష వాచకముగ వాడినందున దానికి తెలుఁగు సంప్రదాయమే అన్వయించినది. దీనికి బల్లి దాదు లపవాదములు (బల్లిద, అక్క జ, కావల,...బెట్టిద,... బెడిద,...మిసిమింత, మొక్కల ఇత్యాదులు బల్లి దాదులు...దేశ్యములు, మిగిలినవి వైకృతములు).

తెలుగు సంప్రదాయ మిట్లుండ, సంస్కృత శబ్దములకుఁ దెలుఁగు 'ఁడు' ప్రత్యయము తగిలినంతమాత్రమున 'అ' కారము 'ఉ' కారముగ నేల మారవలయును? ఈ నియమము మనకు ద్రావిడ సంప్రదాయమునుండి వచ్చి యుండలేదు. ఏలయన అఱవములో రామశబ్ద ప్రథమైక వచనము 'రామన్' అందురేగాని "రామున్" అనరు. అట్లే కన్నడమున "రామను" అందురు.[13] ఈ ఉకారము మనకు ప్రాకృతములనుండియు, ముఖ్యముగ మహారాష్ట్రము నుండియు వచ్చినట్లు కనఁబడుచున్నది. సంస్కృతమున పుల్లింగ ప్రథమావిభక్తి 'స్'. ఇది విసర్గగా మారును. ఇది ప్రాకృతమందు 'ఓ' ఆగును. ఇది పురాతన మహారాష్ట్రమునందును, హిందీ భాషలోను 'ఉ' గా మారును. సంస్కృతము 'దేవః', ప్రాకృతము 'దేవో', పురాతన మహా రాష్ట్రము 'దేవు' లేక 'దేఉ'. ఇట్టి ప్రయోగములు జ్ఞానేశ్వరి అను పురాతన మహారాష్ట్ర గ్రంథమునందును, తులసీరా మాయణము నందును, పెక్కులు గలవు. క్రమముగా నా భాషలలో నీ రూపములు పోయి వ్రాతలో ఆకారాంత రూపములును, ఉచ్చారణలో హలంత రూపములును నిలిచినవి. కావునఁ దెనుఁగునందు సంస్కృత అకారాంత శబ్దములకు వచ్చెడి 'ఉ' కారా దేశము మహారాష్ట్రమునుండి వచ్చినదని యెంచవచ్చును. పురాతన మహారాష్ట్ర ప్రథమైక వచనమైన

Unfiled Notes Page 18

'దేవు' శబ్దమును తీసికొని దానిమీఁద 'డు' ప్రత్యయము తగిలించితిమి. ఉకారాంత శబ్దమునకుఁ జివర స్వయముగనే 'ఉ' కార ముండును గాన దాని మీఁద 'ఁడు' ప్రత్యయము వచ్చును. ఒక్క 'ఇ' కారాంతశబ్దములను తప్ప మిగిలిన అన్ని యంతముల సంస్కృత పుల్లింగ శబ్దములను తెలుగు ప్రత్యయములు తగిలించు నప్పుడు 'అ' కారాంతముగఁ గాని 'ఉ' కారాంతముగఁ గాని మార్చుకొనియెదరు. కావున వానికిఁ బై నియమమే చెల్లును.

ఉ : విధాతృ	విధాతృ[14]
హనుమత్	హనుమంత
చంద్రమస్	చంద్రమసు, స్సు
భగవన్	భగవంత, ఉఁడు

ఇక 'ఇ' కారాంత పదములకు నే ప్రత్యయమును తగలక యుండుటయు ప్రాకృత సంప్రదాయమే. ప్రాకృతమున, సంస్కృత 'ఇ' కారాంత శబ్దము మీఁది 'స్' ప్రత్యయమును తీసివేసి ప్రాతిపదికమునే ప్రథమైక వచనముగ నెంచెదరు. ఇప్పటి ఉత్తర హిందూదేశ మందలి అన్ని భాషలలోను ఇట్లే చేయుదురు.

(2) ఇఁక 'ము' ప్రత్యయమును గురించి విచారింతము. ఇది సంస్కృత మందలి నపుంసక ప్రథమైక వచన ప్రత్యయమైన 'అమ్' అనునదియే. ఇది శబ్దము చివర వచ్చిన యెడల అనుస్వార ముగను వ్రాసెదరు. అనఁగాఁ దెనుగున సంస్కృత మందలి నపుంసక ప్రథమైక రూపమునే ప్రాతిపదికముగఁ దీసికొనిరి. ఇతర ద్రావిడ భాషలలోను ఈ ప్రత్యయము కలదు. అఱవములో పద్మమ్ అందురు. కన్నడములోను పురాతనకాలమందు ఈ ప్రత్యయముండెగాని, క్రమ క్రమముగా నిది యందుండి పోయినది. మహారాష్ట్ర మందువలెనే అందును 'పద్మ' అందురు. ఆఱవమునందును ఆంధ్రమునందును మొదట ఈ 'మ్' కారమును ప్రత్యయముగ నెంచలేదు, ప్రాతిపదిక రూపముగనే యెంచుచు వచ్చిరి. ఇందుకు గుర్తు అనేక వచన ప్రత్యయములు తగులునప్పుడు ఈ 'ము' కారముండదు. దీనిమీదనే 'లు' ప్రత్యయాదులు తగులును. ఉః పద్మము, పద్మములు, పద్మము లన్, పద్మములచే. అఱవమునను ఇట్టే పద్మమ్, పద్మంగళ్ . కన్నడములో మాత్రమే 'మ' కారము ప్రత్యయముగనే యెంచబడినది. తెలుగులో పొల్లు 'మ' కారము, 'ఉ' అను అచ్చుతోఁ గలిసి 'ము' అయిన తరువాత నది ప్రత్యయమయ్యెను. అప్పుడు 'పద్మం' అనునది ప్రాతిపదిక యనియు, దానికి 'ము' ప్రత్యయము తగిలినఁ గాని ప్రథమకానేర దన్న భ్రాంతిచేఁదెనుఁగు 'పద్మము' (పద్మమ్ + ము) అను మాఱు రూపము కూడ సిద్ధించినది.

ఇది మొదట అకారాంత సంస్కృత నపుంసక లింగ విశేష్య ములను బట్టి వచ్చినను, క్రమముగ నిది సంస్కృతమునఁ బుల్లింగ శబ్దములుగ నుండి తెలుఁగున నపుంసకములుగ మాఱినదానికిని, తెనుఁగు నపుంసక శబ్దములకును ఉపయోగింపఁబడుచు వచ్చెను. సంస్కృతమున 'సింహ' శబ్దము పుల్లింగము, తెనుఁగున నపుంసక లింగము. కావున 'సింహము' అయ్యెను. గుఱ్ఱము, పొలము మొదలై నవి దేశ్యముల కుదాహరణములు. 'ఁడు' ప్రత్యయమువలెనే ఈ 'ము' ప్రత్యయము కూడ సంస్కృత పదములందే యెక్కువగఁ గాన వచ్చును. ఆచ్ఛికములందు దీని ప్రయోగము తక్కువ.

'పద్మంబు' అను మూడవరూపముకూడఁ గలదు. ఇందలి 'బు' అనునది 'ము' కుఁ బ్రతిగవచ్చినది. 'ము' కార 'బు' కార ములలోని అచ్చులు హల్లులు రెండును ఓష్ఠ్యములగుటచే బిందు పూర్వక 'ము' కారము యొక్కయు, బిందు పూర్వక 'బు' కారము యొక్కయు ఉచ్చారణ కొంతవఱకు సమానముగనె అగును గాన ఈ రూపము సిద్ధించెను. ఇతర భాషలలోను ఈ రూపము కాన వచ్చును. తెనుఁగు 'సున్నము', 'సున్నంబు'; ఆఱవము 'సున్నాంబు'. కాని యిట్టి రూపములా భాషలలోఁగొద్ది. తెలుఁగునందును మొదటఁ కొద్దిగనే యుండవచ్చును. ఇప్పుడు వ్యావహారిక భాషలో నిట్టి రూప ములు లేవనియే చెప్పవచ్చును. పండితులును, లక్షణ వేత్తలును, ప్రౌఢత కొఱకై వాఙ్మయమునందీ రూపమునకు విశేష వ్యాప్తి కలుగఁ జేసిరి.

ఈ 'ము' ప్రత్యయము సంస్కృతము నుండి పుట్టలేదనియు, ద్రావిడ భవమే యనియు, కాల్డ్‌వెల్ వ్రాసెను. కాని దానికిఁ దగిన కారణములు చూపనందున నంగీకరించుటకు వీలులేదు.

(3) మూఁడవది 'వు' ప్రత్యయము. ఇది 'ఉ' కారాంత సంస్కృత సమములకు మూడు లింగములందును వచ్చును. ఉ: గురువు, ధేనువు, పశువు. ఉకారాంత పుల్లింగ శబ్దమునకు 'ఁడు' ప్రత్యయము కూడ వచ్చును. కావున 'గురుఁడు', 'గురువు' అని యుభయ రూపములును సిద్ధించును. ఈ 'వు' ప్రత్యయ మెక్కడిది? ఇది ప్రాకృతమందలి 'ఉ' అను ప్రత్యయము యొక్క మాఱు రూపమైయున్నను ఉండవచ్చును. మహారాష్ట్రమునందు 'రా ఊ' 'రావూ', 'జ్ఞానదే ఊ' 'జ్ఞాన దేవూ' అను రూపములు గూఁడ గలవు. ఈ ప్రత్యయ మితర ద్రావిడ భాషలలో గానఁ బడును. అఱవ మునందుఁ గొన్ని శబ్దముల మీఁదను కన్నడమునందుఁ బెక్కు – శబ్దముల మీఁదను వచ్చును. కన్నడము నందు నీ ప్రత్యయము 'అ' కారాంత శబ్దముల మీదఁ గూడ వచ్చును. 'నిర్వాహవు', 'శలవు', 'గుణవు', 'కారణవు'.

ఈ ప్రత్యయము సర్వనామములందుఁ గానవచ్చును. తెనుఁ గున 'నీవు' ఏకవచనము; కన్నడమున 'నావు' (మేము), నీవు (మీరు); తోవు (తాము) అనునవి బహువచనములు. తెనుఁగునందలి 'ము' కు బదులుగఁ గన్నడమందు 'వు' వచ్చును.

ఇప్పుడు వాడుక లోను, గ్రంథములలోను ప్రథమైక వచనమున కై 'ఁడు, ము, వు' అను మూడు ప్రత్యయములు మాత్రము కలవు. కాని 'ను,యు' అనునవియుఁ బూర్వము ప్రథమా విభక్తులుగ నుండెనని యూహింపవచ్చును. ఇవి యిప్పుడు సముచ్చయార్థముగ నున్నవి. ఈ రెండును కన్నడమునందు ప్రథమైక వచన ప్రత్యయ ములు. తెలుఁగున నేను, తాను, అతను, ఇతను, ఎతను అను సర్వనామములందు నీ ప్రత్యయము కానవచ్చుచున్నది. అతను, ఇతను, ఎతను అను రూపములు మన వైయాకరణులు గ్రామ్యములని కొట్టివేసిరి. కాని యీ రూపములింకను సాధువులుగ గన్నడమందు నున్నవి. 'ఁడు' ప్రథమా ప్రత్యయమని బాగుగ వ్యవహారమున నున్న కాలమున వైయాకరణులు 'అతన్, ఇతన్, ఎతన్' శబ్దములకు 'ఁ డు' ప్రత్యయము పెట్టి అతఁడు మొదలయిన రూపములను కల్పించి యవి సరియైన రూపములని చెప్పసాగిరి. అఱవమున ఈ 'ను'

Unfiled Notes Page 19

అనునది 'న్' రూపముగ వచ్చును. రామన్ రంగన్, అనగా రామున్డు, రంగన్డు.

మీను, పేను, చేను మొదలయిన శబ్దములలోని చివరి యక్షరములు ప్రథమాప్రత్యయములే యని తోఁచెడిని. అందువలననే బహువచన మగునపుడు ఈ ప్రత్యయము పోయి మీలు, పేలు, చేలు అన్న రూపములు నిష్పన్నము లగుచున్నవి.

బహువచన ప్రత్యయములు

ఇక బహువచన ప్రత్యయమును గుఱించి విచారింతము. అన్ని వ్యాకరణములలోను 'లు' అనునది ఒకటి మాత్రము బహువచన ప్రత్యయముగా నీయఁ బడినది . ఇదియే నూటికిఁ దొంబది తొమ్మిది తెలుఁగు శబ్దంబుల మీఁద వచ్చును. అఱవమున 'గళ్' అనునదియుఁ, గన్నడమున 'గళు' అనియు బహువచన ప్రత్యయములు కలవు. దీని నుండియే తెలుగు 'లు' ప్రత్యయము పుట్టినదని పండితుల యభిప్రాయము. (కాల్డ్వెల్, శేషగిరి శాస్త్రి : 'గళ్', 'గళు' ప్రత్యయములు సాధారణముగా నపుంసక లింగ శబ్దములకు బహువచనమునందు వచ్చును. ఇతర లింగములకు విశేషముగ రావు). అఱవమునందు తొందరగా మాటాడునప్పుడు 'గళ్' లోని 'గ' కారము లోపించి 'అళ్' మిగులును. 'అవర్ గళ్' 'అవాళ్', 'పిరామనర్ గళ్' 'పిరామనాళ్' అగును. తెనుఁగులో మొదట నిట్లే అగుచుండెను. ఉ: ఆవాలు, చుట్టాలు, మీసాలు, గుఱ్ఱాలు, మొదలైన రూపములు వ్యావహారిక భాషయందుఁ బెక్కులు కలవు. కాలక్రమమున అకారము కూడ లోపించి 'ళ్' మాత్రము నిల్చెను. అదియే 'ల్' ఆయి భాషా చరిత్రలో హలంత ములకు ఉకారపదము సార్వత్రికమైన కాలమున 'లు' అయ్యెను. వారల్, వీరల్, మనుజుల్ మొదలయిన హలంత రూపము లిప్పటికిని గ్రాంథిక వ్యావహారిక భాషలలోఁ గానవచ్చుచున్నవి. ఇయ్యది మొదట ళకారాత్మకముగ నుండెననుటకు కాళ్లు, వ్రేళ్లు, రోకళ్లు, ఆను కొన్ని శబ్దముల బహువచనాంత రూపములు చాటుచున్నవి.

'కళ్' అను ప్రత్యయమే తెలుఁగు బహువచనమునకు మూలమనుటకుఁ దెనుఁగున మఱి కొన్ని శబ్దముల బహువచన రూపములు కలవు. మ్రాను, మ్రాఁకులు; కలను, కలంకులు; కొలను, కొలంకులు ఇత్యాది. ఈ బహువచన మందలి 'కుల్' ప్రత్యయము 'కళ్' ప్రత్యయమునకుఁ బిడ్డయే. మొదట 'కళ్' = కలు అయి యుండవలెను. తరువాత 'లు' లోని ఉత్వ స్నేహమున 'క' కారమునకుఁ గూడ ఉత్వము ప్రాప్తించి 'కులు' అయ్యెను. అఱవమున 'మ్రాన్' శబ్దము 'మరం' అయ్యెను; బహువచనము మరంగళ్. కలను శబ్దము 'కలం', బహువచనము కలంగళ్. కొలనును అరవమున 'కుళం' అందురు. బహువచనము కుళంగళ్. తెలుగు మాటల ఉత్వమును మాన్పి అఱవ పదములతోఁ బోల్చి చూడుఁడి:

కలన్	కలంకుల్	కలమ్	కలంగళ్
కొలన్	కొలంకుల్	కుళమ్	కుళంగళ్
మ్రాన్	మ్రాఁకుల్	మరమ్	మరంగళ్

తెనుఁగున "రు" అను ప్రత్యయమొకటి బహువచనము బోధించునది కలదు. ఉ: వారు, వీరు, బాలురు, అల్లురు. ఇది కన్నడమందును గలదు. ఉ: రామరు, కువరు, బాలరు. అఱవమున 'ర్' అను హలంత రూపమున గలదు. ఉ : అవర్, రామర్ ! దీనికి నన్ని ద్రావిడ భాషలలోఁ బుల్లింగమందే ప్రయోగము కలదు. కాని తెనుఁగునందు బహుస్వల్ప శబ్దములకే వచ్చును. వాఁడు, వీఁడు, ఎవఁడు అను సర్వనామములకు వచ్చును. అవి అఱవమందలి 'అవర్', ఇవర్, ఎవర్, పదములతోను పోల్చదగినవి. 'ఁడు' ప్రత్యయమునకు 'వాఁడు' లోని 'డు' కారణమైనట్లు 'రు' ప్రత్యయమునకు 'వారు' శబ్దమును, దానికిఁ బూర్వపుదియైన 'వర్' శబ్దమును మూలములని యెఱుంగునది.

విశేష్యములలోను చివర వచ్చు శబ్దములకు 'రు' ప్రత్యయము వచ్చును. లేక 'లు' వచ్చెడియెడల 'లులు' అని రెండుసారులుచ్చరింప వలసి వచ్చి వినుటకు నింపుగ నుండదు. 'బాలులు' 'అల్లులు' అనుట చెవులకు నింపుగలేమి బాలురు, అల్లురు అను రూపములే అంగీకరింపఁ బడెను. క్రియారూపములలో నీ ప్రత్యయము పెక్కు సారులు కానుపించును.

ఇట్లు సామాన్య బహువచనములను గుఱించి విచారించి యిఁక బహువచన సంబంధమైన విశేషరూపములను గుఱించి విచారింతము. వాఁడు శబ్దమునకు వాండ్రు, వారలు అను – బహువచన రూపములు కలవు. వాండు + రు = వాండ్రు. వాండు శబ్దము మీద బహువచన సంబంధమైన 'రు' ప్రత్యయము వాండ్రు అయ్యెను. ఈ బహువచన రూపము వలన 'వాండు' అను దాని లోని 'డు' అనునది ప్రత్యయముగాక శబ్దసిద్ధ మనియుఁగూడ మన మూహింప వచ్చును. 'వాండ్రు', అను రూపమును ఒప్పిన లాక్షణికులు 'వాండ్లు' అను రూపమును ఏల యొప్పరో? 'వారలు' అను రూపము ద్విరుక్త బహువచనము, 'వారు + లు' వారలు. ఇట్లే వీండ్రు, వీరలు అను రూపములను గుఱించి యెఱుఁగునది. ఆలు శబ్దమునకు 'ఆండ్రు' అనునది బహువచన రూపమని మన వ్యాకరణములలోఁ జెప్పఁ బడియున్నది. కాని 'ఆండ్రు' అనునది 'ఆండు' అను శబ్దమునకు బహువచనము. ఆండ్రు + రు ఆండ్రురు. ఆఁడుది, ఆఁడపడుచు అను శబ్దములు తెనుఁగునఁ గలవు. అది మొదట 'ఆండు' శబ్దము. ఆ శబ్దమిప్పుడు స్వతంత్ర విశేషముగ నేకవచన మందు దెనుఁగున లేదు. విశేషణముగనున్నది. దాని బహువచన రూపము మాత్రము నిల్చిపోయినది. దాని యర్థము నే యిచ్చు 'ఆలు' పద మేక వచనమున నున్నది. కావున ఒక శబ్దము యొక్క యేక వచనమునకును, ఇంకొక శబ్దము యొక్క బహువచనమునకు లంకె కల్పిరి; ఆలు శబ్దము అఱవ కన్నడ భాషలలోని 'అళ్' అను పదమునకు సజాతీయము. అది యిప్పుడా భాషలలో స్త్రీలింగ ప్రత్యయముగ నున్నది. 'ఆలు' పదము గూడ జవరాలు, పేదరాలు మొదలైన పదములలోఁ దెనుఁగున ప్రత్యయముగ నుపయోగింపఁ బడుచున్నది. 'ఆండ్రురు' అను ద్విత్వ బహువచన రూపము కూడ భారతమునఁ గానవచ్చుచున్నది. 'ఎవ్వరియాండ్రురింకఁ బరిభవంబునఁ బొందక బ్రతుకువారు' (భార. విరా. 2–140).

కోడలు, చెల్లెలు అను శబ్దముల బహువచనములు కోడండ్రు, చెల్లెండ్రు అని యగును. ఇదెట్లు? ఈ శబ్దముల మీఁద బహువచన మందున 'ఆండ్రు' పదము 'ఆండ్రు'గ మాఱి వచ్చినందున కోడ + ఆండ్రు = కోడండ్రు, చెల్లె + ఆండ్రు = చెల్లెండ్రు అన్న రూపములు సిద్ధించినవి.

Unfiled Notes Page 20

రేయి, వ్రాయి, వేయి, ఱాయి, పదముల యనేక వచనములు రేలు, వ్రాలు, వేలు, ఱ్రా లు అని యగును. ఏక వచన రూపము మీది 'య' కారము లోపించును. ఇందుకుఁ గారణము ఈ శబ్దముల బహువచనములు స్థిరపడక పూర్వము ఇవి రేయ్, వ్రాయ్, వేయ్, ఱ్రాయ్ అన్న హలంతములుగ నుచ్చరింపఁబడుచుండెను. యకారము మెత్తని హల్లు(లిక్విడ్ కన్సోనెంట్) సులభముగా జారిపోవును. కావున త్వరగా మాటలాడినపుడు రే, వ్రా, వే, ఱ్రా అనియే యనుచుండిరి. కావున వాని పైన 'లు" ప్రత్యయము వచ్చి బహువచన రూపంబులు సిద్ధించే. రే రేఁడు, వేనవేలు, ఱాపువ్వు, అను సామాసిక పదములలో మొదటి శబ్దముల 'యి' కారము కానరాకుండఁ బోవుటయు నీ సిద్ధాంతమునే బలపఱచును.

కోడి, సుడి, పాడు, కూడు, మూడు అను పదములకు సామాన్య నియమ ప్రకారము కోడులు, పాడులు, సుడులు, పోడులు, కూడులు, అను బహు వచన రూపములు కావలసిన దానికి కోళ్ళు, సుళ్ళు, పాళ్ళు, కూళ్ళు, మూళ్ళు అని యగును.[15] ఇందుకుఁ గారణము విచారింపగా మూల ద్రావిడ భాషా కాలమందున ఈ యేక వచన పదముల యంత వర్ణములు 'ళ' కార యుక్తములయి నట్టు కానవచ్చుచున్నవి. ఈ మాటలే అఱవమున 'ళ' కారముతోనూ, కన్నడములో ళ కారముతోను ఉన్నవి.

తెలుఁగు	అఱవము	కన్నడము	తెలుగు బహువచనము
కోడి	కోళి	కోళి	కోళ్ళు
సుడి	సుళి	సుళి	సుళ్ళు
పాడు	పాళ్	హాళు	పాళ్ళు
కూడు	కూళ్	కూళు	కూళ్ళు

కావున ఈ శబ్దములు అఱవదేశము నుండి కర్ణాట దేశ మార్గమునఁ దెనుఁగు దేశమునఁ జొరబడి నవనియు, వచ్చునప్పుడు తెచ్చుకొన్న బహువచన రూపముల మాత్రముంచుకొని యేకవచన రూపముల మార్చుకొనిన వనియుఁ దెలయుచున్నది. మూర అను నదియు నిట్టిదే. కాని యిది ప్రాత బహువచన రూపమును ఉంచు కొని కొత్త బహువచన రూపమున గూడ సంపాదించుకొనినది. ఉ : మూరలు, మూళ్ళు. మూర శబ్దము అఱవమున మొళ్గమ్, క. మొళ.

ఆవు శబ్దమునకు పురాతన బహువచనము ఆలు; ఇప్పటి బహువచనము ఆవులు. ఈ శబ్ద రూపమును గుఱించి విచారింపఁ గా మొదట నిది 'ఆ' అన్న రూపముననే యున్నట్లు కానవచ్చు చున్నది. వృత్తియందు నీ రూపమే కానవచ్చును. 'ఆఁబోతు'. ఈ శబ్దమునకు మొదట పశు జాతియన్న యర్థ ముండెను. పురాతన యఱవమున 'ఆ' శబ్దమీ యర్థ మందే యుండినట్లు కానవచ్చుచున్నది. కావున దీని యనేక వచనము 'ఆలు' అని యగుట సహజమే కదా? 'గోవు' శబ్ద సాహచర్య ముననో మఱి యే కారణముననో ఈ 'ఆ' శబ్దమునకు ప్రథమా విభక్తి రూపమైన 'వు' ప్రత్యయము తగిలి యిటీవలి తెనుఁ గున 'ఆవు' రూపము సిద్ధించెను. అదియే యిప్పుడు వాడుకలో ఉన్నది. దాని బహువచన రూపము ఆవులు.

ఇట్లే నాడు (దినము) అను శబ్దము అఱవమునందును, కన్నడము నందును నాళు, నాకు అను రూపమునను, నాడి (చేతినాడి) అనునది సంస్కృతమైనను కన్నడమున 'నాళి' అను రూపమునను, నాఁడు (దేశము) అనునది 'నాణ్', నాళ్ రూపములను అఱవము నందును కన్నడమునందును ఉన్నవి. కావున వీని బహు వచనములు 'నాళ్లు' అని యయ్యెను.

తాటి (చెట్టు యొక్క బహువచనము తాళ్ళు. దీని సంస్కృతైక వచనము 'తాళ'. అఱవము, కన్నడములలో 'తాళి', 'తాళ్గి'. కావున తాళ్లు బహు వచనమయ్యె. ఈ శబ్దము మొదట ద్రావిడ శబ్దమే యనియు, అందుండియే సంస్కృతములోనికిఁ దీసికొనఁ బడియె ననియు విద్వాంసుల యభిప్రాయము.

గుమ్మడి, గుమ్మళ్ళు. ఇందుకుఁ గారణము గుమ్మడిని కన్నడ మున 'కుంబళ' అందురు. కావున మన గుమ్మడి యొక్క పూర్వ రూపము; గుమ్మళి దాని బహువచనము గుమ్మళ్ళు. ఇట్లే తెనుఁ గునందు డ కారమంతయందుఁగల పెక్కు శబ్దములు మొదట శకారాంతముగనో ణ కారాంతముగానో ఉండెను. అప్పుడు వాని కేర్పడిన బహువచన రూపములు భాషలో నిల్చిపోయినవి. ఏక వచ నము యొక్క ఉచ్చారణ మాత్రము మారినది.

ఊరు. ఊళ్ళు; పేరు - పేళ్ళు; గోరు - గోళ్ళు; వేరు - వేళ్ళు; నీరు - నీళ్ళు; నోరు - నోళ్ళు; ఏఱు - ఏళ్ళు;

'ఊరు, పేరు' మొదలయిన శబ్దముల బహువచనములు ఊరులు, పేరులు అని యగుటకు మాఱుగా ఊళ్ళు, పేళ్ళు అని యగుచున్నవి. వీని వ్యుత్పత్తిని విచారింపగా ఊరు + ళు= ఊళ్లు, పేరు + ళు = పేళ్లు అని యేర్పడినట్లు కానవచ్చు చున్నది. అనగా నుపాంత్య 'ర' కారము అంత్యళకార సాహచర్యమువలన ళగ మారెను. ఈ నియమము కన్నడమునందుఁ గలదు. "మధ్యనున్న రకారము పరమందు ళకారమున్న యెడల ళ గా మారును అని అర్వాచీన కన్నడమున నియమము గలదు. ఉదా. అరళు, అళ్లు; ఉరళి, ఉళ్ళి; ఉరుళు, ఉళ్ళు; ఒరళు, ఒళ్ళు ఇత్యాది" (కిటెల్ కన్నడ వ్యాకరణము. పుట 194).

ఊరులు, ఊళులు, ఊళ్ళు; పేరులు, పేళులు, పేళ్ళు; ఏఱులు, ఏళులు, ఏళ్ళు అను మూడు రూపములును మన భాష యందుఁ గలవు.

ఇవి ఊళ్లు, ఏళ్లు అను రూపముల పూర్వ చరిత్రఁ దెల్పుచున్నవి. ఇట్లే యితర శబ్దముల గుఱించి యెరుంగునది.

కన్ను శబ్దమునకు కండ్లు అను బహువచన రూపము కలదు. ఇది మొదట కణ్ (అ) శబ్దము. కణ్ + లు = కణ్లు = కండ్లు. పల్, పల్లు, పండ్లు, మూల శబ్దము 'పణ్' అనియు నుండనోపు. ఏక వచనమున తెనుఁగున 'పన్ను' అను రూపము కూడఁ గలదు. కావున బహువచనము పండ్లు ఆయ్యెను. ఉచ్చారణ సాదృశ్యముచే కణ్లు పణ్లు అను పదము లను కండ్లు, పండ్లు అన్న రూపములతో వ్రాయఁ దొడఁగిరి. కొందఱు కవుల ప్రాసస్థలములో పడిపోయిన తరువాత ఈ రూపములే స్థిరములయ్యెను. ఇతర రూపములు గ్రామ్యము లయ్యెను (అఱవమున పల్ శబ్దమునకు 'పఱ్' అను రూపము కలదు. పల్ + ళు).

(1922లో కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావుగారు రచించిన 'తెలుగు భాషా తత్వము' అను పుస్తకము నుండి - 1989 తొలి ముద్రణ)

భాషోద్యమ కథానిక

స్పర్శ

డా॥సి. భవానీదేవి
9866847000

తెలుగుల సచివాలయానికి అనేక పనుల నిమిత్తం వచ్చే పోయే వారితో ప్రాంగణమంతా సందడిగా ఉంది. రెండు రాష్ట్రాలుగా తెలుగు ప్రజలు విడిపోక ముందు కాలం కాబట్టి ఇరవై మూడు జిల్లాల తెలుగు వాళ్ళు, వాళ్ళ సాంప్రదాయిక వేషభాషలతో మాండలికాలు వినబడుతున్నై. వీళ్ళందరి మధ్యలో స్వయం ఉపాధి కల్పనలాంటి తెలివి తేటలతో 'పైరవీ కారులు' అని పిలవబడే అతి తెలివి అవినీతి మధ్యవర్తులు 'ఎర'లు వేస్తూ దొరికే చేపల కోసం వేటాడుతున్నారు.

చుట్టూ బురద ఉన్నా అంటకుండా వికసించే పద్మాల్లాంటి వ్యక్తులు కూడా ఆ కార్యాలయంలో ఉన్నారు. ప్రభుత్వ సర్వీసు అంటే లంచాలు పట్టటానికి లైసెన్సుగా భావించే వాళ్ళే తొంభైశాతం దాకా ఉండే ఆ వాతావరణంలో పది శాతం మందయినా ప్రభుత్వ సర్వీసును 'సేవ'గా అంకిత భావంతో పనిచేసే వాళ్ళు కన్పిస్తారు. బహుశ అలాంటి వాళ్ళుండటం వల్లే ఇంకా ఈ ప్రభుత్వాలు కొంతయినా ప్రజలకోసం ఏమైనా చేయగల్గుతున్నాయనుకోవచ్చు.

సీరియస్‌గా ఫైల్స్ చదువుతూ మధ్య మధ్య కొన్ని పుస్తకాల్లోని అంశాలు చదువుకొని మళ్ళీ దస్త్రాల్లోకి దూరిపోతున్న అధికారి ముకుందరావుని చూసి నిట్టూర్చి లోపలి కెళ్ళాడు అటెండరు శివ. "అయ్యగార్కి ఆకలి కూడా గుర్తుండదు"-తనలో తాను అనుకుంటూ లోపలిగదిలో భోజనం బల్లమీద ముకుందరావు బ్యాగ్ తెరిచి భోజనం క్యారేజి తీసి ఉంచాడు. ఒక పింగాణీ ప్లేటు, మంచి నీళ్ళ గాజుగ్లాసు సిద్ధం చేసి మెల్లగా ముకుందరావు దగ్గరికి వెళ్ళాడు.

"సర్! భోజనం..." నసిగాడు.

"ఇవ్వాళ అర్జంటుగా ఒక దస్త్రం పంపేయాలి. పుష్పని పిలు" ముకుందరావు తలపైకెత్తకుండానే చెప్పాడు. శివ బయటికి వెళ్ళి వ్యక్తిగత సహాయకురాలు పుష్పని పిలిచాడు.

ఆమె లోపలికి చిన్న నోటింగ్ పుస్తకం



"అమ్మమ్మా! స్కూల్లో ఏం నేర్పినా నీ దగ్గర నేను తెలుగు నేర్చుకుంటాను. సరేనా"
వాడి ఆసక్తికి వనజ మనసు కరిగిపోయింది.
"రేపే మన 'తెలుగుబడి' మొదలవు తుంది నాన్నా.
మీ స్నేహితులకి కూడా చెప్పు" అంది.
శాంత చెల్లెలి భుజం మీద ప్రేమాభిమానాలతో తట్టింది.
తెలుగంత తియ్యగా ఆ స్పర్శ ఉంది.

తో వచ్చింది. పాతికేళ్ళుంటా యేమో! సన్నగా, తెల్లగా అధునాతనమైన వస్త్ర ధారణలో ఉంది.

"కూర్చోండి" దస్త్రంలోకే చూస్తూ చదువుతూనే చెప్పాడు ముకుందరావు.

ఆమె కూర్చుంది. ముకుందరావు చెప్పబోయే అంశాలను రానుకోటానికి సిద్ధంగా ఉంది.

"ఈ లేఖ రాసుకొని'. టైపు చేసుకొని తీసుకురండి" మళ్ళీ ముకుందరావే కొనసాగించాడు.

"వైద్యశాఖ సంచాలకులకు.."

"సర్..." ఆమె గొంతు విని తలెత్తి చూశాడు. అతని కళ్ళలోని ప్రశ్నార్థకం చూసి పుష్ప అపరాధ భావన ఏమీ లేకుండా ఉన్న స్వరంతో చెప్పింది.

"నేను తెలుగు రాయలేను సర్" ఆమె గొంతు కొద్దిగా వణికిందంతే! అది భాష రానందుకు మాత్రం కాదు.

"ఏమిటి ? నీకు తెలుగు రాదా" అతని గొంతులో కొద్దిగా ఆశ్చర్యం...కోపం కూడా ధ్వనించాయి.

"రాదు సర్..."

"మీరు తెలుగు వాళ్ళేనా?"

"అవునండి"

"మరి తెలుగు రాకుండా ఎలా..." అర్థోక్తిలో ఆగాడు.

''నేను ఇంగ్లీషు మీడియంలో చదువుకున్నాను.

రెండవ భాషగా సంస్కృతం చదివాను" తన మొహంలోని భావాలు దాచుకుంటూ పుష్ప తలవంచుకుంది.

అమ్మభాష నేర్చుకోనందుకు మొదటి సారిగా సిగ్గుపడిందేమో!

"మరి ఈ ఉద్యోగానికెలా వచ్చావు. సచివాలయంలో స్టెనోగా చేరాలంటే తెలుగు టైపు, షార్ట్‌హాండ్ వచ్చి తీరాలి కదా" అతని గొంతు శృతి పెరిగింది.

''తెలుగు టైపు, షార్ట్‌హాండ్ తెలిసినవాళ్ళు లేకపోతే ఇంగ్లీషు జ్ఞానం ఉన్నవాళ్ళని తీసుకోవచ్చనే మినహాయింపు ఆ నిబంధనకు ఉన్నదండి. అలా చేరాను" సంజాయిషీగా చెప్పింది.

''ఓహో! ఆ మినహాయింపు మీ అందరికీ వరమైందన్న మాట. తెలుగు వాళ్లై ఉండి తెలుగు చదవటం, రాయటం రాకపోగా మినహాయింపులున్నాయని తెలుసుకొని వాడుకోవటం...ఇక వెళ్ళొచ్చు..." ముకుందరావుకి కోపం కట్టలు తెంచుకుంటోంది.

పుష్ప మౌనంగా వెళ్లిపోయింది.

సచివాలయంలో స్టెనోలుగా, టైపిస్టుగా చేరాలంటే తెలుగులో ఆయా విద్యార్హతలు తప్పనిసరి అని నిబంధనలో ఉంది. తీరా తెలుగు విద్యార్హతలున్న వారు ఎంపిక అయి విధుల్లో చేరాక వాళ్ళని ఇంగ్లీషులోనే పనిచేయమంటారు. ఒక జాతికి సంబంధించిన భాష ఆ జాతి ప్రజల నిత్య జీవితానికి దగ్గరగా ఉండే పరిపాలనా యంత్రాంగంలో వాడకపోతే జాతికీ, భాషకూ మనుగడ ఏముంది? దానిలోని వైరుధ్యాలకు బాధ్యులెవరు?

తెలుగు భాషని గౌరవించి ప్రేమించే ముకుందరావు ఇలాంటి సంఘటనలను తన ఉద్యోగ జీవితంలో చాలానే చూశాడు. పోరాటం చేశాడు. భాషాభిమానం వల్ల ఎంతో మంది శత్రువుల్ని కూడా సంపాదించుకున్నాడు. వ్యక్తిగతంగా ఉద్యోగ జీవితంలో అతను భాష కోసం పోరాడి మిగుల్చుకుంది ఒక్క సంతకం మాత్రమే! ఏ దస్త్రమైనా, అతను సిద్ధం చేస్తే సంతకం మాత్రం తెలుగులోనే చేసేవాడు. ఆ సంతకాన్ని చూసు కొని తృప్తిపడేవాడు. తెలుగులోనే దస్త్రాలు రాయాలనీ, ఆంగ్లంలో రాసినవి అందితే తిప్పి పంపాలనీ...ఇలాంటి అనేక ప్రభుత్వ ఉత్తర్వులు కంటితుడుపు మాటలైనాయిగానీ అమలు కావు అని అర్థమైంది. క్రమంగా తెలుగు తెలియనితరం ఉద్యోగాల్లోకి రావటం మొదలైంది. విద్యారంగంలో ఆంగ్లాన్ని అనివార్యం చేసిన ప్రభుత్వ విధానమే దీనికి కారణమనీ, తెలుగుని దూరం చేసిన విద్యా విధానం వల్ల జాతి మూలాలు తెగిపోతున్నాయనీ బాధపడుతూనే ముకుందరావు పదవీ విరమణ స్థాయికి వచ్చాడు.

ఇప్పుడు అతడు పదవీ విరమణ చేసి పదేళ్ళయింది. మనవడు మనుమరాళ్ళు, అంతా అమెరికా, బ్రిటన్‌లో ఉన్నారు. కూతురు డాక్టర్‌గా బ్రిటన్‌లో స్థిరపడింది. కొడుకు సాఫ్ట్‌వేర్ రంగంలో అమెరికాలో పనిచేస్తున్నాడు. కూతురికి ఒక కొడుకు, కొడుక్కి ఇద్దరమ్మాయిలు...

ముకుందరావు మంచి సాహిత్య పుస్తకాలు చదువుకుంటూ హాయిగా గడిపేస్తున్నాడు. అతని భార్య శాంత పేరుకు తగిన ఇల్లాలు కావటాన ఇల్లు ప్రశాంతంగా ఉంది.

"ఏమండీ! రాత్రి శ్యామల చెప్పింది. వచ్చేనెల వస్తోందిట" శాంత చెప్తోంది.

భార్యగొంతులో సంతోషం చూసి ముకుందరావు కూడా ఆనందించాడు.

"అల్లుడు, మనుమడు కూడానా!"

"ఆ! అందరికీ సెలవులట. పదిహేను రోజులుంటారుట"

"ఇకనేం. పండగే కదా" నవ్వాడు.

అనుకున్న ఆ పండగ వచ్చేసింది.

శాంత హడావుడి చూసి తీరాలి. రకరకాల పిండివంటలు చేసింది. చేయించింది. ఇల్లంతా శుభ్రం చేయించి అలంకరించింది. అనుకున్న వేళకు కూతురు శ్యామల మనవడు ప్రణవ్. భర్త అజయ్‌తో వచ్చేసింది.

"అమ్మమ్మా! ఎలా ఉన్నావ్!" ప్రణవ్ తెలుగులో కొద్దిగా ఇంగ్లీషు యాసతో. అడుగుతుంటే ఆనందపడింది. అప్పుడప్పుడు స్కైప్‌లో వాడితో తెలుగులో మాట్లాడటం అలవాటే అయినా ఎనిమిదేళ్ళ మనవడు నట్టింట్లో కూడా తిరుగుతూ చక్కగా తెలుగులో మాట్లాడి అన్నీ తెలుసుకుంటుంటే వాడు విదేశాల్లో పుట్టిపెరుగుతున్న వాడిలా అన్పించటం లేదు. అలనట తీరి భోజనాలయినాక పక్కలోనే పడుకుని తల్లికి చాలా కబుర్లు చెప్పింది శ్యామల. మళ్లీ అమ్మ స్పర్శ, తెలుగు వాతావరణం శ్యామలలో కొత్త ఊపిరినింపుతోంది. మాటల మధ్య శాంతకి అర్థమైంది.

ప్రణవ్ యు.కె.లో పిల్లలకోసం నిర్వహించే తెలుగుబడిలో తెలుగుమాట, పాట, రాత, చదువు నేర్చుకుంటున్నాడనీ, తెలుగు నాటకాల్లో బాల పాత్రలు ధరిస్తాడని; శాంతకి చాలా ముచ్చటేసింది. ఇంతలోనే తన చెల్లెలి మనవడు గుర్తొచ్చి దిగులేసింది. వాళ్ళని మర్నాడు భోజనానికి ఆహ్వానించినట్లు

తెలుసుకొని శ్యామల సంబరపడింది. పిన్ని వాళ్ళ కుటుంబం కలుస్తారంటే ఆమెకి ఇష్టమైన సందర్భం! శాంత చెల్లెలు వనజ కుటుంబం మర్నాడు ఉదయాన్నే వచ్చేశారు. వనజ కొడుకు దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అందువల్ల మనవడు క్రాంతిని తల్లి దగ్గర హైద్రాబాద్‌లోనే ఉంచాడు.

క్రాంతి వస్తూనే శాంత దగ్గరికి పరుగున వచ్చాడు "హాయ్! గ్రానీ..హౌ...ఆర్ యు?"

ప్రణవ్ ఆశ్చర్యంగా చూశాడు. శ్యామలకి చిరాకేసింది.

"క్రాంతీ! ఇలారా! వీడు ప్రణవ్. నీకు అన్న. బ్రిటన్‌లో ఉంటాడు" ముకుందరావు క్రాంతికి ప్రణవ్‌ని పరిచయం చేశాడు.

"నువ్వు తమ్ముడు కదా! ఇలారా! నీ కోసం కొన్ని రంగు పెన్సిళ్ళు, పెన్నులు ఇస్తాను" ప్రణవ్ క్రాంతిని తన గదిలోకి తీసుకెళ్ళాడు.

పెద్దలంతా హాల్లో చేరారు. కబుర్లు సాగుతున్నాయి. శాంత వంటింటి పనిలో శ్యామల సాయం చేసింది. అన్నం తినేటప్పుడు క్రాంతి అన్నాన్ని రైస్ అనీ, కూరల్ని 'కర్రీస్' అనీ, ఇలా ప్రతి పదార్థాన్నీ ఇంగ్లీషులో అడిగాడు. అలాగే మాట్లాడు తున్నాడు. ప్రణవ్ మాత్రం అన్నీ తెలుగులోనే మాట్లాడటం చూసి ముకుంద రావు నిట్టూర్చి శ్యామలతో అన్నాడు. "చూశావా శ్యామూ! బ్రిటీషు వాళ్ళు, ముఖ్యం గా మెకాలే చేసిన పని భాషా దాస్యానికి మనల్ని దాసోహం చేయటం... ఎంత బాగా విజయం సాధిం చిందో! క్రాంతి లాంటి తరం ఇప్పటికే తయారయింది. నేను ఉద్యోగంలో ఉన్న ప్పుడే మళ్ళీ ఆంగ్లేయుల కాలం నాటి ఆంగ్ల గుమాస్తాలు వచ్చేశారు. 'మన'భాష అనే ప్రేమ, గౌరవం ఇప్పుడు తెలుగు వాళ్ళల్లో మచ్చుకైనా లేదు చూడు"

"కొన్నాళ్ళకు మళ్ళీ తెల్సుకుంటారులే నాన్నా! బ్రిటన్‌లో కూడా మా ముందు తరాలు ఇంగ్లీషే గొప్పనుకునే వాళ్ళు. ఒక దశాబ్దం నుంచి మార్పువచ్చింది" అనునయించింది శ్యామల.

"ఆ దేశంలో నివసించే తెలుగు వాళ్లయినా...ఇంకా...ఎవరైనా ఆ దేశభాషని గౌరవించాలి. తన భాషని మాత్రం వదలకూడదు...ఇక్కడ ఆంగ్లం అనివార్యంగా ఎందుకు భావిస్తారో అర్థంకాని విషయం. ప్రజలు ప్రభుత్వాల తీరు భాషా ద్వేషమే" ముకుందరావు కళ్ళల్లో నీటిపొర చూసి శ్యామల కరిగిపోయింది.

"బాధపడకండి నాన్నా! క్రాంతిని తెలుగు నేర్చుకోమని అర్థమయ్యేలా చెపుదాం. మనచేతుల్లో ఉన్నది మనం చేద్దాం. లేదంటే మరో ఇరవయ్యేళ్ళకి ఇక్కడి పిల్లలు అంటే అప్పటికి యువత అమెరికా బ్రిటన్ వంటి దేశాలకు వచ్చి తెలుగు నేర్చుకుంటారు. ఫారిన్‌లో నేర్చుకుంటే విలువ ఎక్కువ కదా! అంతా నవ్వేశారు.

''ఇవ్వాళ రవీంద్ర భారతిలో 'తెలుగుతల్లి' సంగీత నృత్య రూపకం ప్రదర్శింపబడుతున్నది. అంతా వెళదాం" శాంత చెప్పింది.

"ఎన్నాళ్ళయిందో! రవీంద్రభారతి చూసి. తప్పక అంతా వెళదాం" శ్యామల చిన్నపిల్లయిపోయింది. భర్త అజయ్ కూడా ఎంతో ఆనందించాడు.

రవీంద్రభారతిలో నృత్యరూపకం చూస్తున్నంతసేపు క్రాంతి బుర్రనిండా ప్రశ్నలే! భాషకి ఒక దేవత కూడా! ఓ మై తెలుగు గాడ్! అనుకున్నాడు.

పదిహేను రోజులు ప్రణవ్ స్నేహంలో కొంత తెలుగు నేర్చుకున్నాడు క్రాంతి.

వీడ్కోలిస్తున్నప్పుడు ప్రణవ్ క్రాంతికి నవ్వుతూ చెప్పాడు కాస్త గర్వంగానే!

"ఈసారి సెలవులకి బ్రిటన్‌కి రా! తెలుగు నేర్పిస్తాం"

అంతా హాయిగా నవ్వేశారు. క్రాంతి ఉడుక్కున్నాడు. తిరిగి వస్తుంటే క్రాంతి అమ్మమ్మతో అన్నాడు.

"అమ్మమ్మా! స్కూల్లో ఏం నేర్పినా నీ దగ్గర నేను తెలుగు నేర్చుకుంటాను. సరేనా" వాడి ఆసక్తికి వనజ మనసు కరిగిపోయింది.

"రేపే మన 'తెలుగుబడి' మొదలవుతుంది నాన్నా. మీ స్నేహితులకి కూడా చెప్పు" అంది. శాంత చెల్లెలి భుజం మీద ప్రేమాభిమానాలతో తట్టింది. తెలుగంత తియ్యగా ఆ స్పర్శ ఉంది.

కవిత

ఎవరికి !?

బాల్యపు మధురిమలు
ఆప్యాయతానురాగాలు
దక్కకుండా చేసి
భవిష్యత్ నిరుద్యోగ బరువును
ఎత్తడానికై ఇప్పట్నించే
నీపై గాడిద బరువును
ఎత్తిన నన్నెట్లా క్షమిస్తావు!?
అమ్మా! మా స్కూల్లో తెలుగు
మాట్లాడితే కొడుతున్నారు
ఫైను వేస్తున్నారు...అంటే మురిసిపోవాలా
ముగిసిపోతున్నందుకు బాధపడాలా!!
తెలుగుతప్ప ఏమీరాని విద్యా వ్యాపారులు
మాతృభాషను పాతరవేస్తుంటే
వీళ్ళకు కందుకూరి గురజాడలకు
వచ్చిన ఇంగ్లీషులో పదోవంతు కూడా
రాదని తెలిసిన నేను నవ్వాలా? ఏడవాలా?
నీ బాల్యాన్ని అమాయకత్వాన్ని
హోం వర్క్ ల బట్టీల దెబ్బలకు
చిదిమి వేసిన నేను
నా వృద్ధాప్యపు బాల్యంలో
నీ ప్రతీకారానికి ఎదురు చూడాలా!
చందమామ కథలు
రామోజయ రామరామలు
సింధుభాగోతాలు సీమచింతకాయలు
సిగ్రగోనెలు ఇవేవీ లేకుండా
కాన్వెంట్ కుంపటిలో నిన్ను మగ్గబెట్టి
అమాయకంతో అలసిన నిన్ను
వేధించే మేం! ఎవరం!
పరికిణీ చెమ్మ చెక్కల హాయి
బాపూ బొమ్మలోనో పాత సిన్మాల్లోనో...
స్కర్ట్ గౌనులో ఉక్కబోతకు
నీ నాజూకు లేతదనం అలమటిస్తుంటే
ఆ పాత మధురిమలిక లేవే ! లేవే!
జపాన్ జర్మనీ ఫ్రాన్స్ అమెరికా
చైనా రష్యా గుణపాఠాలు
మాతృభాషలోస్వావలంబనలు.
నీ ప్రతిభా సామర్థ్యాల్ని
భాష ఒత్తిడి మింగేస్తే
చదువే వదిలేసిన చందంగా (డ్రాపవుట్‌గా)
తల్లిదండ్రుల ఆశలను మూసేస్తే (డ్రా చేస్తే)
ఆ పాపం ఎవరిది? ఆ శోకం ఎవరికి?


– డా॥ కాసర్ల రంగారావు
9866837741

పరిచయం

ప్రజల భాషలో విద్య, పరిపాలన కావాలంటూ 20 ఏళ్ళనాడే గొంతెత్తిన 'జనసాహితి'

2018 నవంబరు 30 గురజాడ 103వ వర్థంది సందర్భంగా - 'జనసాహితి' తన 128వ ప్రచురణగా 450 పుటల పెద్ద గ్రంథాన్ని ఎ4 సైజులో వెలువరించింది. దాని పేరు "ప్రజలభాషలో విద్య పరిపాలన కోసం ప్రజా సాహితి" ఇందులో అవగాహనా పత్రాలు, సంపాదకీయాలు, ప్రసంగ వ్యాసాలు, ఆచూకీ పత్రాలు, కరపత్రాలు, వ్యాసాలు అనే 6 విభాగాలున్నాయి. ఇందులో జనసాహితి సంస్థ 1997 నుండి తాము ప్రచురిస్తున్న 'ప్రజాసాహితి' మాసపత్రిక ద్వారా, తన వార్షిక సదస్సుల తీర్మానాల ద్వారా శాస్త్రీయ దృక్పథంతో స్పష్టమైన లక్ష్యాలతో విశిష్టమైన కృషి చేస్తూ ఉంది. తాము చేసిన కృషినంతా శాశ్వతంగా ఒక రికార్డుగా క్రోడిచేసి అందించే ప్రయత్నంలో విజయవంతంగా ఈ పుస్తకాన్ని వెలువరించడం ఎంతో ప్రశంసించాల్సిన విషయం. నూతన తెలుగు భాషోద్యమానికి దారి దీపాలుగా నిలిచిన ఆద్యుల్లో మాతృభాషా చైతన్య సమితివంటి సంఘాలు భూపతి నారాయణమూర్తి గారి వంటి కొందరు వ్యక్తులతో పాటు ఒక సాహిత్య సంస్థ 'జనసాహితి' చేసిన విశిష్ఠ కృషి చరిత్రాత్మకంగా, ప్రత్యేకంగా నిలిచిపోతుంది. 41 ఏళ్లుగా నిరంతరాయంగా నడుస్తున్న ఏకైక సాహిత్య పత్రికగా 'జనసాహితి' ప్రత్యేకతను, నిబద్ధతను ప్రశ్నించగల అవకాశం లేనేలేదు. ఈ సంగతినే - ప్రత్యేకంగా 'విద్య, పరిపాలన ప్రజలభాషలో' ఉండాలన్న స్పష్టమైన అంశాన్నెంచుకొని ఉద్యమ మార్గదర్శనం చేసిన సంగతినే చరిత్రలో నమోదు చేస్తున్న ఈ బృహత్ గ్రంథ ప్రచురణ ఎంతో అవసరమైనది. అందుకే దీన్నొక 'దారిదీపం' అనవచ్చు. దీనికి ప్రచురణ కర్తలు ఇచ్చిన విస్తృతమైన 'ముందుమాట'లో కొంత భాగాన్ని మాత్రం ఇక్కడ ఇవ్వగలుగుతున్నాము.

\- సంపాదకులు



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1960వ దశకం దాకా మాతృభాషా మాధ్యమంలోనే ఉన్నత పాఠశాల విద్య వుండేది. తెలుగు అకాడమి ఏర్పడిన తర్వాత 70వ దశకం నుండి ఇంటర్మీడియట్ విద్యతో మొదలయి డిగ్రీదాకా, కొన్ని విశ్వవిద్యాలయాలలో ఎం.ఎ. సామాజిక శాస్త్రాలు కూడా తెలుగు మాధ్యమంలో బోధన సాగింది. అయితే సామాజిక అంతరాలు పెరగడం వేగవంతమవుతున్న కొద్దీ, సంపన్నుల, ఉన్నతాధికారుల, రాజకీయ నాయకుల సంతానం ప్రభుత్వ బడులలో చదవకుండా, ప్రత్యేకమయిన ఇంగ్లీషు మాధ్యమపు పబ్లిక్ స్కూళ్ళ విద్యకు మొగ్గుచూపారు. ఇంతలో 1986లో రాజీవ్ గాంధీ 'నూతనవిద్యావిధానం -21వ శతాబ్దపు సవాళ్ళు' అమలుచేశారు. దాని వెంటనే సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు లొంగుబాటు, విద్యారంగంతో సహా ప్రైవేటీకరణ విధానాలూ అనుసరించటంతో తెలుగులో చదువు కూడు పెట్టలేదనే భావం సమాజాన్ని కమ్మేసింది. ఉపాధికి కరువు పెరగటంతో మార్కుల, ర్యాంకుల పోటీ హెచ్చి, ప్రభుత్వ విద్యావ్యవస్థను కుప్పకూల్చగా, తెలుగు మాధ్యమంలో చదువు 'దిక్కుమొక్కు' లేనివారదయింది. రెండు గ్లాసుల విద్యావిధానం అనే విషపు విత్తనం వటవృక్షమై పోయింది.

జనసాహితి, ఆంగ్లభాషా వ్యామోహాన్ని సామ్రాజ్యవాద సంస్కృతీ లక్షణాలలో వొకటిగా మొదటి నుండీ పరిగణిస్తూ వస్తోంది. ఇది మేధావులలో, ఆలోచనాపరులలో ఆందోళన కలిగించే దశకు చేరినపుడు 'ప్రజాసాహితి' స్పందించి 'ఇంగ్లీషు భాషా బానిసత్వానికి వ్యతిరేకంగా మళ్ళీ ఉద్యమించాలి' (సంపాదకీయాలు : ప్రకరణం - 2 : పుట : 57) అనే ఒక విస్పష్టమయిన సంపాదకీయం (1997 ఫిబ్రవరి) వెలువరించింది. మూడు నెలలకు 1997 ఏప్రియల్‌లో తెనాలిలో జరిగిన జనసాహితి 8వ రాష్ట్రమహాసభలో "కాన్వెంటు చదువుల ఇంగ్లీషు భాషాబానిసత్వం" అనే అంశాన్ని కూడా నివేదికలో చేర్చి "ఇంగ్లీషును ఒక భాషగా నేర్పుతూ, సకల విద్యాబోధనా మాతృభాషల్లోనే జరగాలని మనం ఆందోళన చేయవలసి వుంది" (అవగాహనావత్రాలు : ప్రకరణం-1 : వుట : 11) అని ప్రకటించాము. పరిస్థితుల తీవ్రతను గమనించి 1999 ఆగస్టులో, హైదరాబాదులో జరిగిన జనసాహితి 9వ రాష్ట్ర మహాసభను "ప్రజలభాషలో విద్య -పరిపాలన" అనే అంశంపైనే రెండు రోజులు నిర్వహించాము. అప్పుడు రూపొందినదే కీలకపత్రం. (అవగాహనా పత్రాలు : ప్రకరణం - 1 : పుట : 12)

'ప్రజలభాషలో విద్య - పరిపాలన' గురించిన మౌలిక అవగాహననూ, శాస్త్రీయదృక్పథాన్నీ అందించే పత్రమది. ఇక్కడ గమనించవలసిన అతి ముఖ్య విషయమేమంటే, అప్పటికి యునెస్కో ప్రపంచ మాతృభాషల దినోత్సవాన్ని(ఫిబ్రవరి 21) ఇంకా ప్రకటించలేదు. జనసాహితి 9వ రాష్ట్ర మహాసభ అయిన 3 నెలల తర్వాత 17 నవంబరు 1999న, ఆ తర్వాత సంవత్సరపు(2000) ఫిబ్రవరి 21 నుండి, ఆ తేదీని మాతృభాషల ఆవశ్యకతను చాటిచెప్పే, మాతృభాషలను పరిరక్షించుకునే దినోత్సవంగా నిర్వహించమని ప్రపంచదేశాలకు ప్రజలకు యునెస్కో పిలుపు

నిచ్చింది. ఈ సందర్భంలో స్పష్టం చేసేదేమంటే, జనసాహితి, ప్రపంచ దేశీయ సాంస్కృతిక పరిణామాలలో ఒక కీలక అంశమైన ప్రజల భాషలలో విద్య - పరిపాలన గురించి ముందుచూపుతో వ్యవహరించి తగు విధమైన భావ విప్లవరంగాన్ని సంసిద్ధపరచగలిగింది.

* * *

ఉపాధికి విద్య, నైపుణ్యం కావాలి. అందుకొక ప్రామాణిక గుర్తింపు (సర్టిఫికేట్) కావాలి. వివిధ దొంతరల స్థాయిలో పరీక్షలు నిర్వహించి, అందులో కృతకృత్యులయినవారిని క్రమబద్ధీకరించి (గ్రేడింగ్) వారికి ఉత్తీర్ణత గుర్తింపులను ప్రభుత్వాల నేతృత్వంలోని విశ్వవిద్యాలయాలు, వివిధ బోర్డులు మంజూరు చేస్తుంటాయి. వారు నిర్వహించే పరీక్షలు ఏ భాషా మాధ్యమంలో వుంటే ఆ మాధ్యమంలోనే విద్యార్థులు చదువుకుంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే విద్యార్థులు ఏ మాధ్యమంలో విద్యార్జన చేయాలో నిర్ణయించేది ప్రభుత్వాలు. రాచరిక, వలస కాలాలలో ఆయా ప్రభుత్వాలు పాలకుల భాషనే విద్య, పరిపాలనా భాషగా నిర్దేశించాయి. ఉదాహరణకు బ్రిటీషువారు ఇంగ్లీషును, అంతకు ముందు మొగలాయి పర్షియన్ భాషనూ, కొందరు 'హిందూ' మత పాలకులు సంస్కృతాన్నీ, నిజాం నవాబు ఉర్దూను అవి రాని ప్రజలపై రుద్దారు. ప్రపంచ దేశాలన్నిటా పూర్వం యిలాగే జరిగింది.

ప్రజాస్వామికయుగంలో ప్రజలభాషే బోధనాభాషగా, పాలనాభాషగా నిజమైన స్వతంత్ర దేశాలన్నిటా అమలు జరుగుతోంది. ఇక్కడ దానికి భిన్నంగా బ్రిటీషు వలసపాలన కొనసాగింపుగా ఇంగ్లీషు మాధ్యమంలోనే చదువుకోవాలనే వేలంవెర్రిని పాలకులే పెంచి పోషిస్తున్నారు. ఇంగ్లీషులోనే పాలన కొనసాగిస్తున్నారు. దీని వెనకాల వారి ఆర్థిక - రాజకీయ విధానాలు వాటి వైఫల్యాలు ఉన్నాయి. నిరుద్యోగం పెరగటానికి కారకులు వారే. ప్రైవేటు విద్యా వ్యాపారుల ఇంగ్లీషు మాధ్యమం వ్యాపారానికి ప్రోత్సాహకులు వారే. బొట్లరు ఇంగ్లీషు వెంకటేశాల్ని లక్షల సంఖ్యలో ఉత్పత్తి చేసిందీ వారే! అవన్నీ అలా వుంచి మన పిల్లలను ఇంగ్లీషుభాషలో ప్రవీణులు చేయటం ఎలా అని ఆలోచించినా "ఏ పరాయి భాషయినా మాతృభాష ద్వారానే సులువుగా, బాగా నేర్వవచ్చు" అనే శాస్త్రీయమైన జవాబు లభిస్తుంది. కానీ ప్రభుత్వాలే ఇంగ్లీషు మాధ్యమం చదువుల వేలంవెర్రిని ప్రోత్సహిస్తూ, కొనసాగిస్తూ, పెంపొందిస్తూ వస్తున్నాయి. అయితే నెపాన్ని ప్రజలపైకి నెడుతున్నాయి. ప్రభుత్వాలతో అంటకాగే కొందరు మేధావులు, రచయితలూ, వారి సంఘాలూ ప్రజలలో ప్రబలిన చౌకబారు ఆశల వల్ల యిది జరుగుతోందనీ, తప్పు పట్టవలసినది ప్రభుత్వాలను కాదనీ సన్నాయి నొక్కుల వాదనలు చేస్తూ పాలకుల రక్షకభటుల్లా, వందిమాగధుల్లా వ్యవహరిస్తున్నారు.

ఇంకొందరు ఇంగ్లీషు - తెలుగు, అగ్రకులాల- నిమ్న కులాలకు కేటాయింపబడిన భాషగా ప్రకటించి, తెలుగును తన్ని తగలేయటం ద్వారా, ఇంగ్లీషు మాధ్యమం చదువు ద్వారా అగ్రకులాల గుత్తాధిపత్యాన్ని బద్దలు కొట్టవచ్చునంటూ మాట్లాడుతున్నారు.

ఇంగ్లీషు మాధ్యమంలో చదువుకున్నవారందరికీ ఉద్యోగాలు, ఉపాధి లభిస్తున్నాయా అంటే జవాబుండదు. పోనీ గడిచిన 30 ఏళ్ళుగా ఇంగ్లీషు మాధ్యమంలో చదువుకున్నవారికి ఎంత సాంకేతిక జ్ఞానం లేక ఇంగ్లీషు భాషా, సాహిత్యాల పరిజ్ఞానం అలవడిందో వివిధ నివేదికల వాస్తవాల నుండి చర్చించరు. టెక్ మహీంద్రా కంపెనీ సి.ఇ.ఓ. గుర్నానీ యిటీవల ప్రకటించిన దాని ప్రకారం నూటికి 94 మంది ఇంజనీరింగు పట్టభద్రులు వారి కంపెనీలో పనిచేయడానికి అనర్హులు. వెరసి అటు ఇంగ్లీషూ రాని, ఇటు తెలుగూ రాని "ఇంటికూటికీ, బంతికూటికీ చెడిన" తరాలను నేటి విద్యావ్యవస్థ సృష్టిస్తోంది. నిజంగా పాలకులకు నేడు కావలసింది యిదే. యువతరంలో స్వతంత్ర పరిజ్ఞానం, తెలియనిదాన్ని ప్రశ్నించే వ్యక్తిత్వం, ప్రజాజీవితంపట్ల వాస్తవిక దృష్టి అలవడకుండా వుండాలన్నదే వారి విధానం. ఇంగ్లీషు మాధ్యమం చదువుల ద్వారా మానవ జీవన సంఘర్షణనూ, సామాజిక వివేచననూ వారికి కలిగించరు. మార్కులూ, ర్యాంకులే జీవన లక్ష్యంగా చేశారు. మాతృభాషలలో విద్య వల్ల సామాజిక జీవిత మూలాలతో బంధం బలోపేతమయే ప్రమాదం వుంటుందని పాలకులకు భయం.

తెలుగు పిల్లలకు తెలుగు సరిగా అలవడటంలేదనే ఆందోళన మధ్యతరగతివర్గంలో పెరిగింది. దానికి పరిష్కారంగా చిన్నతనం నుండి శతక సాహిత్యాన్నీ లేక పద్య సాహిత్యాన్నీ వారికి అలవరచటమెలా అనే ప్రయత్నాలు చాలా రూపాల్లో దేశ, విదేశాల్లో జరిగాయి. వీరి ప్రయత్నాలలో నిజాయితీని మనం శంకించకుండా హర్షం ప్రకటిస్తూనే, అందులోని కొరవను - ముఖ్యంగా నేటి దురవస్థకు మూలకారణమైన సామ్రాజ్యవాద ప్రపంచీకరణలకు లొంగిపోయిన ప్రభుత్వాల 'విద్యా-బోధనా విధానాలు' అనే అంశాన్ని వారికి గుర్తు చేయాల్సి వుంటుంది.

* * *

పదిహేనో, పద్దెనిమిదో కోట్లమంది మాట్లాడగలిగిన తెలుగు భాష అంతరించిపోతోందని చెప్పటం హాస్యాస్పదం అంటూ, నేటి వాస్తవ ప్రమాదాన్ని పక్కదారి పట్టించేవారు కూడా మనకున్నారు. యునెస్కో ప్రమాణాల ప్రకారం చదువుకుంటున్న తరంలో నూటికి ముప్ఫైమంది తమ మాతృభాషలను తప్పు లేకుండా చదవనూ, రాయనూ చేయలేకపోతే ఆ భాష అంతరించే క్రమం ఆరంభమయినట్లు అని స్పష్టంగా వుంది. ఇన్ని కోట్లమంది తెలుగువారు ఈ ప్రమాదాన్ని ఎదుర్కొని తమ మాతృభాషలను నిలబెట్టుకునే పోరాటం చేస్తారనే దాంట్లో మనకు సందేహం లేదు. అయితే ఇపుడు కొత్తతరాలలో తెలుగు మౌఖిక భాషగా మారుతున్న నేటి ప్రమాద క్రమాన్ని అడ్డుకునే మన ప్రయత్నాన్ని నిరోధించడానికి పైవారి వాదనలు తోడ్పడుతాయి. ఈ వాదనలు మన కృషిని హాస్యాస్పదం కిందకు మార్చి, పాలకుల దౌర్జన్యపూరిత అణచివేతకు మార్గాన్ని సుగమం చేస్తుంది.

ప్రసార సాధనాలకు కూడా ఒక స్పష్టమైన వైఖరి లేకుండా,

బడిలో-గుడిలో-ఏలుబడిలో తెలుగుకు సాధికారత కావాలి

Unfiled Notes Page 26

ముఖ్యంగా శాస్త్రీయదృక్పథం లేకుండా, భాషాసమస్యలను భావోద్వేగాల సమస్యగా మాత్రమే చూపుతున్నారు. దీనిని భాషల అణచివేత జాతుల అణచివేత విధానాల్లో భాగంగా వీరు చూడటంలేదు.

తెలుగునాట వున్న రాజకీయపార్టీల ఆత్మవంచనలను, పరవంచనలను బట్టబయలు చేయవలసిన అవసరం వుంది. ప్రతి పార్టీ రాజకీయ అధికార స్థాపనల కొరకే, అంటే పరిపాలన సాగించటానికే వున్నాయన్నది స్పష్టం. వాటికి అంటూ ఒక భాషావిధానం వుండి తీరాలి. తమ వైఖరిని ప్రజల ముందు చర్చలకు పెట్టాలి. భాషాభిమానుందరూ రాజకీయ పార్టీలను నిగ్గదీసి వారి అవగాహనలను బహిర్గతపడేట్టు చేయాలి. వాటికంటూ భాషామాధ్యమం విషయంలో ఒక అవగాహనే లేకపోతే ప్రజలను ఓట్లు అడిగే అర్హత ఆ రాజకీయపార్టీలకు లేదని భాషాభిమానులు ప్రకటించాలి.

36 ఏళ్ళ క్రితం (మే 1982లో) తిరుపతిలో తెలుగు దేశం పార్టీ ప్రకటించిన సరియైన, స్పష్టమైన భాషావిధానం (కరపత్రాలు ప్రకరణంలో.... పుట : 103) పట్ల తెలుగుదేశంతో సహా నేటి రాజకీయ పార్టీలకు ఏకీభావం ఎక్కడ వుందో, ఎక్కడ లేదో ప్రకటించమని కోరినా, వారివారి బండారం బయట పడుతుంది. 70 ఏళ్ళు గడిచినా దేశంలో సగంమంది నిరక్షరాస్యులుగా వుండటంపట్ల ఏలికలకు సిగ్గులేదు. ప్రతిపక్షాలకు ఈ కీలకమైన అంశంపై ఒక విధానంలేదు.

ఇన్ని వందల పేజీల పుస్తక సారాంశాన్ని రెండే వాక్యాలలోకి మనం కుదించుకోవచ్చు.

1. సమస్త ఆధునిక జీవనరంగాలలో మాతృభాషా వినిమయం విస్తృతం కావాలి.

2. ఏ పరాయిభాషయినా మాతృభాషల ద్వారానే సులువుగా, బాగా నేర్వగలుగుతాము.

ఈ రెండు అంశాలనూ జనసాహితి తన కరపత్రాల ద్వారా, 'ప్రజాసాహితి'లో వ్యాసాల ద్వారా, బహిరంగసభలలో ఉపన్యాసాల ద్వారా ప్రకటిస్తూ వచ్చింది.

స్పందన

డిసెంబరు 2018 'అమ్మనుడి' సంచికలో వచ్చిన 'చంఘిజ్‌ఖాన్' నవల పరిచయం చదివి చాలా ఆనందించాను. నా జ్ఞాపకాలు 60 ఏళ్ళు వెనక్కి వెళ్లాయి. అయితే ఆ నవల సీరియల్‌గా ఆంధ్ర పత్రిక సారస్వతానుబంధంలో రాలేదు– ఆంధ్రపత్రిక వార పత్రికలో వచ్చిందని నేను అభిప్రాయపడుతున్నాను.

తెన్నేటి సూరి అనువాద నవల "రెండు మహా నగరాలు" మమ్ములను ఆకట్టుకున్నట్లు ఈ నవల మమ్మ ఆకట్టుకోలేదు. దానికి ముఖ్యకారణం చదువుకున్న చరిత్ర పాఠాల ద్వారా చంఘిజ్‌ఖాన్ మహా క్రూరుడనే అభిప్రాయం మాలో స్థిరపడి పోవడం వల్ల ఆ నవల పట్ల మాకు అంత ఆసక్తి లేకపోయింది. రెండు మహానగరాలు. 'నవల ఆంగ్లమూలం విద్యార్థులకు ఉప పాఠ్య గ్రంథంగా ఉండడం, ఆ నవల పాఠకాభిమానానికి ముఖ్యకారణం. అయినా తెన్నేటి సూరి మంచి రచయిత అనే అభిప్రాయం ఆనాటి పాఠకులలో ఉంది. అతడు చిన్న వయస్సులోనే చనిపోవడం అప్పటి పాఠకలోకాన్ని ఎంతో దుఃఖానికి గురిచేసింది.

చంఘిజ్‌ఖాన్ నవలను పరిచయం చేసినందుకు మధురాంతకం నరేంద్రగారికి మీకూ నా ధన్యవాదాలు.

కనుగుల వేంకటరావు, శ్రీకాకుళం –8330 949562

అంతేకాదు, నూతన ప్రజాస్వామిక సాంస్కృతికోద్యమ కర్తవ్యాలకు "ప్రజలభాషలో విద్య – పరిపాలన" అనే కోణాన్ని, బాణాన్ని సమకూర్చింది కూడా జనసాహితేనని ఖచ్చితంగా చెప్పవచ్చు. ఈ పుస్తకంలో సుప్రీంకోర్టు తీర్పుని, (పుట : 70) భారత రాష్ట్రపతి ప్రసంగ ధోరణిలో తప్పుల్నీ(పుట : 312) ఎత్తిచూపిన జనసాహితి శాస్త్రీయ స్వరాలన్నీ మీరు వినవచ్చు.

***.

ధర : రు. 500/– ప్రతులకు : మైత్రిబుక్ హౌస్, జలీల్‌వీధి, కార్ల్‌మార్క్స్ రోడ్డు, విజయవాడ – 2. ఫోన్ నెం. 9177979622




26. 11. 2018న
తెలుగు విశ్వవిద్యాలయం
విమర్శలో ప్రతిభా పురస్కారాన్ని
ద్వా.నా.శాస్త్రికి అందజేసిన దృశ్యం.
ఎడమ నుంచి : ఎం.వి.ఆర్ శాస్త్రి.
కె.బి. వరప్రసాద్ రెడ్డి, ఎస్వీ
సత్యనారాయణ, అలేఖ్య పుంజల
తదితరులు

పొరుగు తెలుగు

కన్నడతోటలో విరిసిన తెలుగుపాట

బుర్రకథ ఈరమ్మ-సంచారి ఆత్మకథ



కన్నడ మూలం
డా. నింగప్ప ముదేనూరు

అనువాదం
రంగనాథ రామచంద్రరావు

(డిసెంబరు సంచిక తరువాయి...)

కలవరపడిన కన్నెవయసు

ఈరమ్మకు పదహారేళ్ళు వచ్చాయి.

వయస్సు తెచ్చిన అందం ఒళ్లంతా ప్రాకింది.

మనిషి బుద్ధిమంతురాలని పేరు తెచ్చుకుంది.

పైగా బుర్రకథలు, పాటలు పాడి గ్రామగ్రామాల్లో పేరు తెచ్చుకుంది.

ఇప్పుడు గ్రామస్థులు ఆమెను బుర్రకథ ఈరమ్మగా గుర్తించడం మొదలుపెట్టారు.

ఖాళీ సమయాల్లో ఇంటి పనులతోపాటు, పొలం పనులూ చేసేది.

ఇంట్లో మగపిల్లలకు ఎవ్వరికీ అబ్బని విద్య ఆమెకు అబ్బినా ఎలాంటి గర్వం చూపించక ఒద్దికగా మసలుకునేది.

ఇలాంటి ఈరమ్మను చూసి పెళ్ళి చేసుకోవాలని ఎవరైనా ఆశపడుతారు.

అలాంటివారిలో రామచంద్రప్ప ఒకడు.

రామచంద్రప్ప ఈరమ్మ మేనమామ శివలింగప్ప కుమారుడు. 'వేషాలు' వేయటం అతని వృత్తి. అతనికి ఈరమ్మ నచ్చింది. దాంతో అతను ఆమె మనసు తెలుసుకోకుండా, ఆమె ఇష్టాయిష్టాలు గమనించకుండా ఆమె ముందు పెళ్ళి ప్రస్తావన తెచ్చాడు. అది విని ఆమె మనస్సు గాయపడింది. ఈ బుర్రకథలతో, పాటలతో జనాన్ని ఆనందపరుస్తూ తాను సంతోషం అనుభవిస్తున్న ఈరమ్మకీ ఎదురుచూడని పరిస్థితి వల్ల మనస్సుకు చాలా వ్యథ కలిగింది. తన తల్లితండ్రులు ఉన్నప్పటికీ వారికి గౌరవం ఇవ్వకుండా, పెళ్ళి విషయం వారి ముందు ప్రస్తావించకుండా తన ముందు, తన చేయి పట్టుకుని అడిగినందుకు ఆమె భయపడిపోయింది. కులకట్టుబాట్లు గుర్తుకు తెచ్చుకుని వణికిపోయింది. తనను పెళ్ళి చేసుకోవాల్సిందేననే అతని ఒత్తిడి, బెదిరింపులు ఈరమ్మను విచారానికి గురిచేసింది. ఒక్కొక్కసారి బుర్రకథలు చెబుతున్నప్పుడో, లేదా ఏదైనా కావ్యాన్ని గానం చేస్తున్నప్పుడో ఈ జ్ఞాపకాలు పదే పదే మనస్సులోకి వచ్చి వేధించినా వాటిని అధిగమించి తన కావ్యగానంలో లీనమై తన కావ్యానికి జీవం పోయటంలో మునిగిపోయేది.

రాను రాను రామచంద్రప్ప వేధింపులు ఎక్కువ కావటంతో ఒకసారి అతని ముఖం మీదే కొట్టినట్టు "నాకు నా కథలు, పాటలు ఊపిరి అయినపుడు నాకు ఈ పెళ్ళిగిళ్ళి ఇష్టం లేదు" అని కరాకండిగా చెప్పింది.

అయితే రామచంద్రప్ప వెనుకడుగు వేయలేదు.

చక్కగా ఉన్న ఈరమ్మనుపెళ్ళి చేసుకుని ఎలాగైనా తన భార్యగా ఇంటికి తెచ్చుకోవాలని మొండితనంతో పట్టుబట్టి కూర్చున్నాడు.

ఈరమ్మ పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది.

తల్లితండ్రుల ముందు రామచంద్రప్ప విషయం చెప్పటానికి ఆమెకు ధైర్యం చాల్లేదు.

రామచంద్రప్ప వేధింపుల నుంచి తప్పించుకోవటం సాధ్యం కాలేదు.


తమ కూతురు పాటలు, కథలతో చాలా ఆనందంగా ఉందని భావించిన ఆమె తల్లితండ్రులు ఈరమ్మ లోలోపల అనుభవిస్తున్న హింసను అర్థం చేసుకోలేకపోయారు.

తన జీవితంలోకి వచ్చిన ఇలాంటి చేదు ఘడియలను ఈరమ్మ ఎదుర్కోవలసి వచ్చింది.

ఒకసారి దారిలో ఎదురుపడినపుడు "నిన్ను బలవంతంగా ఎత్తుకునిపోయి మనువాడుతాను" అని రామచంద్రప్ప చెప్పినపుడు, ఈరమ్మ కఠినంగా, "అదెట్లా మనువాడుతావో నేను చూస్తాను. ఒకవేళ నువ్వు బలవంతంగా మనువాడితే తాళి తెంపి పత్తి చెట్టుకు కడతాను" అని నిక్కచ్చిగా చెప్పి అక్కడి నుంచి వచ్చేసింది.

రామచంద్రప్ప ముఖం అవమానంతో మాడిపోయింది. ఆమె మాటలకు కోపంతో మండిపడ్డాడు. తనను కాదని ఆమె అవమానించిందని అవమానంతో లోలోపల రగిలిపోయాడు. ఆ అవమానానికి ప్రతీకారంగా ఆమెను పెళ్ళి చేసుకోవడం ద్వారా తీర్చుకోవాలనుకున్నాడు. తగిన సమయం కోసం కాచుకుని కూర్చున్నాడు.

అదే సమయంలో రామచంద్రప్పకు మరో ఆడపిల్లతో పెళ్ళి



కన్నడ రచయిత
డా. నింగప్ప ముదేనూరు

అనువాదకుడు
రంగనాథ రామచంద్రరావు

నిశ్చయమైంది.

నాణాపురకు చెందిన కమలమ్మ అనే ఆడపిల్లతో రామచంద్రప్ప పెళ్ళి నిశ్చయించారు అతని తల్లితండ్రులు.

చివరికి అతని పెళ్ళి జరిగిపోయింది.

భార్య సంసారానికి వచ్చింది.

అయినా అతను ఈరమ్మను మరిచిపోలేదు.

ఆమె తనను కాదన్నదనే అవమానాన్ని మరిచిపోలేదు.

ఆమెను ఎప్పటికైనా రెండవ భార్యగానైనా తెచ్చుకుని, ఆమెను పొందాలని మనస్సులో మరింత ధృడపరుచుకున్నాడు.

సమయం కోసం ఎదురుచూస్తూ ఉన్నాడు.

* * *

కాలచక్రంలో కొన్ని సంవత్సరాలు గిర్రున తిరిగిపోయాయి.

రామచంద్రప్ప అయిదుమంది పిల్లల తండ్రి అయ్యాడు.

వృత్తిరీత్యా అతను పగటివేషగాడే. అతను తన కాయకం కోసం 'హందెహాళ' గ్రామానికి కుటుంబంతో సహా వచ్చాడు.

ఊరి బయట గుడారం వేసుకుని కుటుంబంతో మకాం పెట్టాడు.

ఆ సమయానికే ...

ఈరమ్మ 'బుర్రకథ'లు చెబుతూ ఊరూరు తిరుగుతూ 'బుర్రకథ ఈరమ్మ'గా పేరు తెచ్చుకుంది.

ఆమె ఇలా కథలు చెబుతూ గ్రామాలు తిరుగుతూవుంటే ఆమె సముదాయంలోని కొందరు వేషాలు వేస్తూ, కథలు చెప్పేవారు.

అలా కొద్దిరోజులు ఊళ్లూళ్లు తిరిగి ఇక తమ ఊరికి తిరిగి వెళ్లాలనుకున్నారు.

అదే సమయంలో 'గుళ్లెవ్వ' జాతర జరిగే రోజు దగ్గర పడింది.

దానికోసం 'హందెహాళ' ఊరి బయటి గుడారంలో ఆగిపోయారు.

అదే సమయంలో నిండు గర్భవతి అయిన ఈరమ్మ తమ్ముడి భార్య అక్కడే ప్రసవించింది.

బాలింత అయిన తమ్ముడి భార్యకు సేవలు చేయడానికి ఈరమ్మ తమ్ముడి గుడారంలో ఆగిపోతుంది.

ఇలా అక్కడ ఉండిపోయిన ఈరమ్మ అక్కడి దగ్గర్లోనే మరో గుడారంలో ఉన్న రామచంద్రప్ప కంట పడింది.

వెదకబోయిన తీగ మళ్లీ కాలికి తగిలిందన్నట్టు అతను సంతోషంతో పొంగిపోయాడు.

ఆమెతో మాటలు కలపడానికి సమయం కోసం కాచుకుని కూర్చున్నాడు.

పగటిపూట మగవాళ్ళంతా తమ కాయకపు పనుల మీద బయటికి వెళ్ళేవారు.

గుడారంలో ఈరమ్మ బాలింత దగ్గర ఇంటరిగా ఉండేది.

ఒక రోజు 'గుళ్లెవ్వ'కు అర్ధమైలు దూరంలోని చెరువు నుంచి నీళ్ళు తీసుకుని రావటానికి ఈరమ్మ బయలుదేరింది.

సదా ఈరమ్మ మీద దృష్టి పెట్టి కూర్చున్న రామచంద్రప్ప మెల్లగా ఆమెను అనుసరిస్తూపోయాడు.

ఈరమ్మ చెరువులో కడవ ముంచి నీళ్ళు నింపుకుంటూవుంది.

చుట్టుపక్కల ఎవరూ లేకపోవటం గమనించిన రామచంద్రప్ప హఠాత్తుగా ఆమె ముందు వెళ్ళి నిలబడ్డాడు.

ఆకస్మాత్తుగా వచ్చి ముందు నిలబడ్డ అతడిని చూసిన ఈరమ్మ బిత్తరపోయింది.

రామచంద్రప్ప గబుక్కున ఆమె చేయి పట్టుకున్నాడు.

ఈరమ్మ చప్పున చేతిని లాక్కుంది.

అయినా అతను, మళ్ళీ "నువ్వు నన్ను మనువాడకపోతే నీ శీలభంగం చేస్తాను" అని బెదిరించాడు.

ఇన్నేళ్ళు ఎంతో ధైర్యంతో అతడిని తిరస్కరిస్తూ వచ్చిన ఈరమ్మ ఒక్కసారిగా అధైర్యపడింది.

తన కుల కట్టుబాట్లు తలుచుకుని భయపడిపోయింది.

ఇన్నేళ్ళు నైతిక ధైర్యాన్ని చూపించిన, తాళికడితే తెంచి పత్తి చెట్టుకు కట్టేస్తానని బెదిరించిన ఈరమ్మ మాటలురాని మూగదానిలా నిస్సహాయంగా అతడి ముందు నిలుచుండిపోయింది.

దాంతో రామచంద్రప్ప గంగతో ఉన్న నిండు కడవను ఆమె చేత పట్టించాడు.

'తననే మనువాడేలా' బలవంతంగా, ఆమె చేత ప్రమాణం చేయించుకున్నాడు.

అదే విధంగా 'ఇంటి దేవుళ్ళ' మీద కూడా ప్రమాణం చేయించుకున్నాడు.

విధిలేక ఈరమ్మ అతను చెప్పినట్టు చేసింది.

రామచంద్రప్ప సంతృప్తితో ఆమెను వదిలిపెట్టాడు.

ఒకసారి తమ కులస్థులు మాట ఇస్తే తప్పరని అతనికి తెలుసు.

అందులోనూ 'గంగమ్మ తల్లి' మీద ప్రమాణం. పైగా ఇంటి దేవుళ్ళ మీద ప్రమాణం.

చచ్చినా ఈరమ్మ మాట తప్పదని అతడికి తెలుసు.

మాట తీసుకుని అతను సంతోషంగా వెళ్ళిపోయాడు.

ఈరమ్మ తమ గుడారానికి తిరిగి వచ్చింది.

తమ మధ్య జరిగిన విషయాన్ని బయటికి చెప్పుకోలేక పోయింది.

తన మనస్సులోని కలవరాన్ని, భయాన్ని, దుఃఖాన్ని ఆప్తులతో ఎవరితోనూ పంచుకోలేక తన లోలోపలే సతమతమవ సాగింది.

గుళ్లెవ్వ జాతర ముగిసింది.

ఈరమ్మ, తమ్ముడు, తమ్ముడి భార్య, పిల్లలతో మిగిలిన వేషగాళ్లతో కలిసి ఊరికి వెనుతిరిగి వచ్చింది.

కొన్నాళ్లు గడిచాయి.

ఈరమ్మ తన కాయకం కారణంగా ఊళ్లు పట్టుకుని తిరుగుతూ వుంది.

అటు తరువాత ఈరమ్మ ఇంటి పెద్దల ముందు పెళ్ళి ప్రస్తావన ముందుకొచ్చింది.

అయితే కుటుంబంలోని వారందరూ ఆ పెళ్ళి ప్రస్తావనను వ్యతిరేకించారు. అప్పటికే పెళ్ళయి అయిదుమంది పిల్లలున్న మనిషికి తమ పిల్లను ఇవ్వడానికి కుటుంబ సభ్యులు ఎవరూ ఒప్పుకోలేదు.

రెండవ భార్యగా అతడింటికి ఆమె వెళ్ళడం మంచిది కాదని రకరకాలుగా నచ్చజెప్పారు. ఇరుగుపొరుగున ఉన్న బంధుబలగానికి చెందినవాళ్లు వచ్చి ఆ పెళ్ళి వల్ల ఆమె సుఖపడదని చెప్పారు.

అయితే ఈరమ్మ వాళ్ల మాటలు వినలేదు.

తాను అతని దగ్గర చేసిన ప్రమాణాలు ఆమెను భయపెడుతూ ఉన్నాయి. ఇచ్చిన మాట తప్పితే ఎలాంటి కష్టాలు భరించాల్సి వస్తుందో నని భయపడసాగింది.

అతడినే పెళ్ళి చేసుకుంటానని మొండిపట్టు పట్టింది.

ఎన్నడూ తల్లితండ్రి మాటలు జవదాటని కూతురు ఇలా మొండికేయడం చూసి తల్లితండ్రులు విచారానికి గురయ్యారు.

తమ బిడ్డకు ఏదో మంత్ర తంత్రాలు చేశారేమోనని ఈరమ్మ కుటుంబీకులు అనుకున్నారు.

సంచార జీవులలో ఇలాంటి నమ్మకాలు ఉన్నాయి.

సరిగ్గా అదే సమయంలో రామచంద్రప్ప భార్య కమలమ్మ మళ్ళీ ఓ బిడ్డను ప్రసవించింది.

ఆ సమయంలో ఈరమ్మ ఆ కుటుంబానికి సహాయంగా నిలబడింది.

వాళ్ళింటికి వెళ్ళి బాలింతరాలికి సేవలు చేయసాగింది.

వేడినీళ్ళు కాచి కమలమ్మకు స్నానం చేయడంలో సహాయం చేసేది.

గంజి కాచి, వంట చేసి పెట్టేది. ఇంటి కసువు, ముసురులాంటి పనులు చేసేది. దాంతోపాటు బాలింత బట్టలు కూడా ఉతకడం చేయ సాగింది. ఇదంతా గమనించిన ఈరమ్మ అన్న, వదినలు ఆమెను వెంటబెట్టుకుని హాళెదరోజికి వచ్చారు.

కొద్దిరోజులు గడిచాయి.

ఈరమ్మ తాను రామచంద్రప్పను మనువాడతానని తల్లితో చెప్పింది.

"వద్దమ్మా, ఈ మనువు చేసుకుంటే నువ్వు సుఖపడవు బిడ్డా ! వద్దు తల్లీ. నా మాటిను నీ కాల్మొక్కుతానే బిడ్డా" అంది.

ఈరమ్మ తల్లి మాటలకు మండిపడుతూ–

ఊళ్లోని జనం "ఎన్నాళ్లని ఇట్లా ఒంటరిగా ఉంటావు. నువ్వు పెళ్ళి చేసుకోకపోతే నీకు మోక్షం దొరకదు. నువ్వు చనిపోతే నీ శవాన్ని బోర్లా పడుకోబెడతారు' అని అంటున్నారు. నేను ఈయప్పనే చేసుకుంటాను. మీరు చేస్తారా లేదా?" అని కరాకండిగా తన నిర్ణయాన్ని తెలియజేసింది.

అయినా తల్లితండ్రులు అతడితో కూతురు పెళ్ళికి అంగీకారం తెలపలేదు.

చివరికి కుటుంబసభ్యులకు వ్యతిరేకంగా ఈరమ్మ తన అన్న నాగభూషణం, వదిన అశ్వి పార్వతమ్మ సహకారంతో రామచంద్రప్పను పెళ్ళి చేసుకుంది.

పెళ్ళి జరిగిపోయింది...

కలవర పడుతున్న మనస్సుతో...

తరువాత ఈరమ్మ రామచంద్రప్ప రెండవ భార్యగా అతని గుడారంలో అడుగు పెట్టింది.

విఫలమైన వివాహం

ఈరమ్మ రామచంద్రప్పకు రెండవ భార్యగా అతని గుడారంలో కాలుపెట్టింది.

గుండెలో కోటి కోర్కెలను నింపుకుని అడుగు పెట్టింది..

మనస్సులో ఎన్నో ఆశలు.

పట్టుబట్టి తనను మనువాడిన భర్త తనను ఎంత మురిపెంగా చూసుకుంటాడోనని బంగారు కలలుకంటూ భర్త దగ్గరికి వచ్చింది.

అయితే అతడి మనసు తన మీద కాదని అర్థం చేసుకోవడానికి ఆమెకు ఎక్కువ కాలం పట్టలేదు.

అతని దృష్టంతా తన సంపాదన మీదని ఆమెకు తొందరలోనే అర్థమైంది.

ఒక్కసారిగా తనను కొండ శిఖరం మీదికి తీసుకెళ్ళి అక్కడి నుంచి కిందికి తోసేసినట్టు అనిపించింది.

అతని మొదటి భార్య కమలమ్మ సిరుగుప్ప తాలూకాలోని హొసహళ్ళికి చెందింది.

కమలమ్మ తన భర్తకు రెండవ భార్యగా వచ్చిన ఈరమ్మను ఓర్చేది కాదు.

తెలుగును బోధించడం కాదు ; తెలుగులోనే అన్నీ బోధించాలి

ఎప్పుడూ ఏదో ఒక తగాదా పెట్టుకుని ఈరమ్మ గొడవ పడేది.

రామచంద్రప్ప ఇద్దరు భార్యల గొడవలను నివారించలేక చింతతో తాగుడుకు అలవాటుపడ్డాడు.

కొద్ది కాలంలోనే సంసారం నిభాయించడం అతనికి సాధ్యం కాదని ఈరమ్మ గ్రహించింది. అయినా సంసారంలో సంభవిస్తున్న చిన్నాచితకా గొడవలను భరించింది. సవతి పరుషమైన మాటలను, తిట్లను సహించింది. కాలం గడుస్తున్న కొద్దీ సవితి కమలమ్మ తీరు మరింత భయంకరంగా మారింది. ఆమె ఈరమ్మపట్ల క్రూరంగా ప్రవర్తించసాగింది. ఈరమ్మపై చేయి చేసుకోసాగింది. ఈరమ్మ సవితి చేతి దెబ్బలనూ భరించింది.

ఇదంతా కళ్లారా చూస్తున్నా, రామచంద్రప్ప ఏమీ అనేవాడు కాడు. ఈ ఇద్దరి భార్యలలో ఎవరికీ నచ్చజెప్పేస్థితిలో రామచంద్రప్ప ఉండలేదు.

అప్పటికే ఈరమ్మ నాలుగైదు పల్లెల్లో బుర్రకథలు చెప్పి పేరు తెచ్చుకుంది.

గ్రామస్థుల ఎవరి నోట విన్నా బుర్రకథ ఈరమ్మ పేరు వినిపించేది. ఊళ్ళోని జనం ఆమెను బుర్రకథ ఈరమ్మగా పిలవటం మొదలుపెట్టారు.

ఈరమ్మ ఉన్న చోటికే తాంబూలంతో వచ్చి కథలు చెప్పమని అడిగేవారు పెరగసాగారు.

ఈరమ్మ నాలుగు రూకలూ సంపాదించే స్థాయికి ఎదిగింది.

ఈరమ్మకు ఉన్న ఈ డిమాండ్ చూసి సవితి కమలమ్మ మరింత ఈర్ష్యతో రగిలిపోయేది.

వాస్తవానికి ఈరమ్మ పెళ్లి చేసుకుని ఆ ఇంటికి వచ్చిన మూడు నెలల వరకు సవితి కమలమ్మ ఈరమ్మతో కలిసి ఇంటింటికి వెళ్లి 'గంగమ్మ- గౌరమ్మ పాటలు పాడి భిక్షమెత్తి, ప్రజల చేత ధనధాన్యాలు పొంది వచ్చేవారు.

ఇలా ఇద్దరూ పాటలు పాడి వచ్చిన సొమ్ముతో బంగారం, వెండి కొన్నారు. ఇద్దరూ అక్కా -చెల్లెళ్ల మాదిరి ఉండటానికి ప్రయత్నించారు.

ప్రారంభంలో కమలమ్మ ఈరమ్మ పాటకు నేపథ్య వాయిద్యంగా దమ్మిడి (ఒక విధమైన తాళ వాయిద్యం) వాయిస్తూ గొంతు కలిపేది. అయితే రాను రాను కమలమ్మకు ఈరమ్మ పట్ల ద్వేషం, అసూయ ఏర్పడ్డాయి.

దానికి కారణం ఈరమ్మకు దొరికే ప్రజాభిమానం.

అలాంటి ప్రజాభిమానం కమలమ్మకు ఎన్నడూ దొరకలేదు.

ఈరమ్మ కంఠం కంచుకంఠంలా వినిపించేది.

ఆమె చాలా చక్కగా పాడేది.

ఆ కారణంగా ఆమెను ప్రజలు అభిమానించేవాళ్లు.

అది చూసి కమలమ్మ మనస్సు అసూయతో రగిలిపోయింది.

తాను ఈరమ్మలా బుర్రకథలు చెప్పకపోయినప్పటికీ ఈ గంగమ్మ-గౌరమ్మ పాటలు పాడుతూవుంది. అయినా ఎందుకు ఈ జనం నన్ను మెచ్చుకోరు? ఆమెకు ఇచ్చినట్టు నాకెందుకు ధాన్యం గింజలు, బట్టలు, డబ్బుదస్కం ఇవ్వరు. ఆమెకు పశువులను, దూడలను ఇచ్చినట్టుగా నాకు ఎందుకు ఇవ్వరు? అని లోలోపల అసూయతో మండిపడేది.

కమలమ్మ తన కోపాన్ని భర్త ఎదుటే ఈరమ్మ మీద ప్రదర్శించేది.

తన వృత్తికి ఇది అవమానంగా భావించడంవల్లనో, లేదా ఒక వేళ భర్త ఈరమ్మ పాటను, ఆమె సంపాదనను ఎక్కువగా పట్టించుకోవడం మొదలుపెడితే తరువాత తన గతి ఏమిటి? తన పిల్లల గతి ఏమిటి? అని భయపడిందో ?

కాలం గడుస్తున్న కొద్దీ ఈరమ్మను రకరకాలుగా వేధించసాగింది.

సూటిపోటీ మాటలతో ఈరమ్మ మనస్సును నొప్పించసాగింది.

ఈరమ్మ చేసే ప్రతీ పనిలోనూ ఏదో ఒక తప్పును వెదకటం, ఆమెను తిట్టడం కమలమ్మ నిత్య కృత్యమైంది.

కాలం గడుస్తున్న కొద్ది ఈరమ్మ గురించి లేనిపోని చాడీలు చెప్పసాగింది.

ఈరమ్మకు ఇతరులతో అనైతిక సంబంధాలు అంటగడుతూ భర్త మనస్సులో అనుమానపు విత్తనాలు నాటసాగింది.

రాను రాను భర్తకు ఈ సంసారం భారమైంది.

అప్పటిదాకా ఇద్దరు భార్యలను బాగా చూసుకునేవాడు.

రానురానూ మారిపోసాగాడు.

ఈరమ్మ దృష్టిలో భర్త మంచివాడే. మొదట్లో వ్యక్తిగతంగా అతని నుంచి ఆమెకు బాధ కలగలేదు.

అయితే కమలమ్మలా తను సంసారంలో సమాన భాగస్థురాలైన తనను భర్త ఎదుటే తిట్టడం, నానా మాటలు అనడం, ఎవరెవరితోనో అనైతిక సంబంధాలు అంటగట్టడం, చివరికి కొట్టడమూ చూసి కూడా భర్త మౌనంగా ఉండటం చూసి ఈరమ్మ భరించలేకపోయింది.

తనకు అవమానం కలిగినా భరించింది.

అతడి నిస్సహాయమైన ముఖాన్ని ఇక చూడకూడదనుకుంది.

ఒక్కొక్కసారి అతడు కట్టిన తాళి తెంచి పత్తి చెట్టుకు కట్టి ఇల్లు విడిచి వెళ్ళిపోవాలని అనుకునేది.

అయితే ఎంతైనా ఆడప్రాణం.

తను అలా తాళి తీసేస్తే, సమాజం ఊరుకుంటుందా?

స్వయంగా తన కులస్థులే భర్త ఉండగానే ఈమె తాళి తెంచుకుని వితంతువుగా మారితే ఊరుకుంటారా?

తనను, తనను కన్న కన్న తల్లితండ్రులను తిడితే, ఇంకేదైనా

కన్నవారినీ తోడబుట్టినవారినీ తెలుగులో పిలువలేని బ్రతుకెందుకు?!

చేస్తే ఏం చేయగలదు?

భర్త వదిలేసిన ఆడదని నుదుట పట్టి కట్టుకుని బతకడమెలా అని మనస్సును గట్టి చేసుకుని మళ్లీ అతడి దగ్గరే ఉండిపోయేది.

సంపాదించినదంతా సవితికి, సవితి పిల్లలకు పెడుతున్నా సవితి మనస్సు కరగలేదు.

ఆడదానికి ఆడదే శత్రువు అన్నట్టు తన మునుపటి స్వరూపాన్నే చూపించసాగింది.

ఈరమ్మ తల్లితండ్రులు కూతురిని బాగా చూసుకోమని కమలమ్మ దగ్గర, రామచంద్రప్ప దగ్గర ఎంతగానో మొత్తుకున్నారు.

అయినా వాళ్లు వినే ప్రయత్నాలు చేయలేదు.

పైగా కమలమ్మ మరింతగా హింసించసాగింది.

ఈరమ్మ సంపాదనతో సంసారం సాగిపోతోంది.

అయితే ఆమె జీవితంలో ఒక్క రోజు కూడా సుఖం, నెమ్మది అన్నవి లేకుండా పోయాయి.

కొన్నిసార్లు మొదటి భార్య మాటలు విని రామచంద్రప్ప ఈరమ్మను వివస్త్రగా చేసి కొట్టడం జరిగింది.

అది తెలిసిన ఊరి పెద్దలు రామచంద్రప్పను, కమలమ్మను హెచ్చరించారు.

రామచంద్రప్ప ఈరమ్మకు తగిన భర్త కాకపోవటమేకాక, ఆమె పాటల ద్వారా సంపాదించిన సొమ్ము పీక్కుని తినే రాక్షసు డయ్యాడు.

ఇలాంటి కష్టాల, హింసల మధ్య ఈరమ్మ గర్భవతి అయ్యింది.

ఆమె మూడు నెలల గర్భవతి అని తెలిసి సవితి కమలమ్మకు లోలోపల భయం మొదలైంది.

ఇక భర్త బాగా సంపాదించే ఈరమ్మను, ఆమె పిల్లలను చూసుకుని తనను పట్టించుకోడేమోనని అనుమానించింది.

దాంతో భర్తకు లేనిపోని చాడీలు చెప్పి, ఈరమ్మ మీద అనైతిక సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు చేసింది.

దాంతో రామచంద్రప్ప ఈరమ్మను మానసికంగా, శారీరకంగా హింసించడం మొదలుపెట్టాడు.

ఆ కారణంగాఈరమ్మ జీవితం మరింత దుర్భరంగా మారు తోంది.

అప్పటిదాకా వారి హింసలు భరించిన ఈరమ్మకు ఈ అవమా నాన్ని భరించలేకపోయింది.

భర్తను వదిలి పుట్టింటికి వచ్చేసింది.

ఇక భర్త ఇంటికి వెళ్లకూడదని నిర్ణయించుకుంది.

రామచంద్రప్ప సంసారం తాళం తప్పిన పాట అయింది.

అప్పటికే అతను తాగుడుకు మరింత బానిస అయ్యాడు.

ఈరమ్మ ఉన్నంత వరకూ తాగుడుకు డబ్బులు సులభంగా దొరికేవి. ఇప్పుడు డబ్బులకు కటకటలాడవలసి వచ్చింది.

దాంతో ఈరమ్మ ఊరికి వచ్చి తన వెంట రమ్మని పిలిచాడు.

అయితే ఈరమ్మ తనను రమ్మని ఒత్తిడి పెట్టవద్దని, తాను ఇంక ఆ ఇంటికి రానని కరాకండిగా చెప్పింది.

రామచంద్రప్ప నిరాశతో ఊరికి తిరిగి వెళ్లిపోయాడు.

అతనికి ఏం చేయాలో తోచలేదు.

చేతిలో చిల్లర కాసు లేదు.

కమలమ్మ దగ్గర అతని పప్పులు ఉడకవు.

దాంతో అతను ఊరి పెద్దల దగ్గరికి పోయి తను తప్పు తెలుసుకున్నాని ఎలాగైనా తన సంసారాన్ని నిలపాలని తను ఆమెను కొట్టడని, తిట్టడని, ఆమెను బాగా చూసుకుంటాడని మాటయిచ్చి బతిమిలాడుకున్నాడు.

ఊరి పెద్దలకు అతని పట్ల గౌరవం, కనికరంలేకపోయినా, ఈరమ్మ జీవితం బాగుపడుతుందేమోనని ఆశతో ఈరమ్మ దగ్గరికి వచ్చి ఆమెకు నచ్చజెప్పారు.

ఊరి పెద్దల మాటకు గౌరవమిచ్చి, ఇష్టం లేని మనస్సుతోనే ఈరమ్మ భర్త ఇంటికి వెళ్లింది.

రామచంద్రప్ప కొద్ది రోజులపాటు ఈరమ్మను బాగా చూసు కున్నాడు.

ఆమెతో ప్రేమగా ఉండసాగాడు.

భర్త ఈరమ్మతో బాగుండటం చూసిన కమలమ్మ ఓర్వలేక పోయింది. ఎలాగైనా చేసి ఈరమ్మను ఆమె పుట్టింటికి తరిమేయాలని ఆలోచించింది.

మళ్లీ భర్త తాగి ఉన్న సమయంలో, ఈరమ్మ కథలు చెప్పటానికి మరో ఊరికి వెళ్లిన సమయంలో అతడికి లేనిపోని చాడీలు చెప్పి అతడి మనస్సును విరిచేసింది.

సంసారం ఒక దారికి వచ్చిందని ఈరమ్మ సంతోషపడుతున్న సమయంలో కమలమ్మ మళ్లీ హింసించటం మొదలుపెట్టింది.

కమలమ్మ మాటలు విని రామచంద్రప్ప కూడా కడుపుతో ఉన్న భార్య అనికూడా చూడకుండా ఈరమ్మను హింసించసాగాడు.

ఈరమ్మలోని సహనం నశించింది. ఇక్కడ ఉంటే కష్టాలు తప్పవని అనుకుంది. భర్తకు తన అవసరంలేదు, తన డబ్బు మాత్రమే కావాలి. అలాంటి భర్త తనకు అక్కర్లేదని అనుకుంది. ఇక ఎన్నడూ భర్త ఇంటిగడప తొక్కకూడదనుకుంది.

అప్పటికి ఈరమ్మ అయిదునెలల గర్భిణి.

చివరికి ఈరమ్మ కుటుంబం విషయంలో ఒక గట్టి నిర్ణయా నికి రావాల్సి వచ్చింది.

తాగుడుకు బానిస అయిన భర్త మాట వినే పరిస్థితిలో లేదు.

సవితి ఆగడాలు ఆగేలా కనిపించలేదు.

పైగా ఆమె తిట్లు, దెబ్బలు, నిందలు భరించే శక్తి నశించిపోయింది.

దాంతో మనస్సు దృఢపరుచుకుని అయిదు నెలల గర్భిణి అయిన ఈరమ్మ పుట్టింటి వైపు అడుగులు వేసింది.

* * *

(వచ్చే నెలలో- **ఒంటరి పోరాటం**)

కీ.శే. దుర్గానంద్

శబ్దగాండీవి వేమన-6



(డిసెంబరు సంచిక తరువాయి)

వేమన పాఠకులు ఎవరు? ఆయన ఎవరిని గురించి చెప్పాడు. ఆయన మాటలు ఎవరు విన్నారు. పాఠకుడి అంతస్థు కవి వినిపించే అంతస్థుని బట్టే ఉంటుంది. రవీంద్రుని అంతస్థు ఉన్నత పాఠకులు అని తేలిపోతుంది. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారిది తెలుగు పద్య శ్రోతలు అని తేలిపోతుంది. కొంత మంది కవులది పిల్లల అంతస్థు, కొందరిది స్త్రీల అంతస్థ, కొందరిది యువకుల అంతస్థు. భాష ఎప్పుడూ ఒకరితో ఒకరికి చెప్పబడుతూ ఉండేది. ఉత్తరం మొదలు కొని కథలూ కావ్యాల వరకూ అన్నీ ఇలా చెప్పబడుతూండేవే. ఇది ఇద్దరి మధ్య ఆట. ఇద్దరి నాలుకల మధ్య ఆట. ఇద్దరి హృదయాల మధ్య ఆట. మనం ఎదురుబొదురుగా మాట్లాడుకుంటాం. ఫోనుల్లో మాట్లాడుకుంటాం. ఇక్కడ క్షణం క్షణం ఇద్దరూ కనపడుతుంటారు, వినపడుతుంటారు. ఇది క్షణిక వస్త్వాశ్రయి. ఒక మిత్రుడు ఇంకొకనికి ఉత్తరం వ్రాస్తాడు. మళ్లీ ఇతను రాస్తే అతడు నాలు గైదు రోజులకు వింటాడు. మొదటి దానిలో భార్య ఫోను చేస్తూ ఇవ్వాళ కూర ఏమివం డేదండీ అని అడగవచ్చు. భర్త బంగాళాదుంప వండమని చెప్పవచ్చు. కూర విషయం ఆ క్షణానికి అయిపోయింది. ఈ మిత్రుడి ఉత్త రంలో మాత్రం అంత క్షణభంగురమైన విషయం ఉండదు. అతడు పరీక్షలకు బాగా చదువుతున్నావా అని అడగవచ్చు. ఇతడు చదువుతున్నానని చెప్పవచ్చు. ఇది ఆ రోజుక్కా కుండా నాలుగైదు మాసాలు నిలవుండే విషయం. అలాగే ఒక కవి కవిత్వం వ్రాస్తాడు. పొట్ల తీగె మీద పిండార బోసినట్లు వెన్నెల వుంది, నా మనస్సు విందారగించినట్లు ఉల్లా సంగా ఉంది. ఇక్కడ కవి బారుగా వంద పేజీల పుస్తకం వ్రాసుకుంటూ వెళుతున్నాడు. వినేవాడు ఎవ్వరూ లేరు అని మనం అనుకుంటాము. కవి ముందు పాఠకుడు వస్తున్నాడు. ఆ కవి రెండు సంవత్సరాలకు రెండో పుస్తకం వ్రాశాడు అంటే రెండు సంవత్సరాలకు పాఠకుడు సమాధానం ఇచ్చాడు అని. ఇన్ని రోజులకు పాఠకుల నుండి సమాధానం అందుతుంది గాబట్టి అన్ని రోజుల వరకు నిలవ ఉండే విషయం అతడు ఇవ్వవలసి ఉంటుంది. అందువల్లే కూరా, పరీక్షలకంటే పిండారబోసిన వెన్నెల సబ్జెక్టు ఎక్కువ శాశ్వతమైంది అవుతుంది. కవి తనకై తాను వ్రానుకుంటున్నట్టు కనిపించినా ఎవరో తనను అడిగితే వ్రాస్తున్నట్టే వ్రాస్తాడు. అతడు ఆ ప్రశ్నను ఊహించుకుని ఆ సమాధానం ఇస్తాడు. వేమనను ఎవరు ఏమని అడిగుంటారు....

చంపదగిన యట్టి శత్రువు తనచేత
జిక్కెనేని కీడు సేయరాదు
పొసగ మేలు చేసి పొమ్మనుటే చాలు

చంపదగిన శత్రువు చేతికి చిక్కితే ఏమి చేయాలి అని ఎవరో అడిగినట్టు దానికి సమాధానం చెబుతున్నట్టు పై పద్యం వ్రాశాడు. ఒక జ్ఞానపరుడు ఈ ప్రశ్న తన ముందు వేసినట్టు తాను నీతి బోధకుడిగా సమాధానం చెప్పినట్టూ చెప్పాడు.

తప్పులెన్ను వారిని గురించి ఒకరు ప్రశ్న వేయవచ్చు. అప్పుడు

తప్పులెన్నువారు తండోపతండంబు
లుర్విజనులకెల్ల నుండు తప్పు
తప్పులెన్నువారు తమ తప్పునెఱుగరు

ఈమాట ఆయన చూస్తూ ఏమీ తోచక అన్నాడా! తప్పుల సమాజం ఆయన మీద పడనెట్టుకుంటూ వచ్చింది. అప్పుడు ఆయన ఆగండి అంటూ ఈ పద్యం అన్నాడు. తప్పులతో హోరెత్తుతున్న సమాజం, దానిని చేత్తో అడ్డుతున్న వేమన్నా మనకు కనిపించుతున్నారు.

క్రీస్తు దగ్గరకు ఒక వ్యభిచారిణి తీసుకు రాబడ్డది. రాళ్లతో కొట్టి చంపమని ఆవిడకు శిక్ష విధింపబడివుంది. మీలో తప్పులేమీ లేని వాళ్ళు ఆమెను కొట్టండని ఏసు అన్నాడు. అందరూ వెనక్కు తగ్గారు. ఈ విశేష కథనమే పై పద్యంలో సామాన్య కథనమైంది, ఎంతో చక్కని తెలుగు పద్యంలో.

మళ్లీ ఇక్కడ జ్ఞాని హోదాలో వేమన. ముముక్షువు రూపంలో పాఠకుడు. వేమన ఇంత తీవ్రమైన దూషణ కవిత్వం వ్రాసినా పరమ యోగినీ పరమాత్మను గురించి చెప్పేటప్పుడు ఎన్నో అందమైన ఉపమానాలు పదజాలం ఆయన కవిత్వాన్ని అల్లిబిల్లిగొని అలరించుతాయి. పరమ యోగి గుర్తేమిటి, ఆయన్ను ఎలా కనుక్కోవడం అన్నప్పుడు వేమన అంటాడు...

తేనె తెరల జాడ తేనె తీగ యెఱుంగు
సమరసంబు జాడ భ్రమరమెఱుగు
పరమయోగి జాడ భక్తు డెఱుంగును.

తేనెటీగకు ఎవరైనా చెప్పాలా తేనెతుట్టె ఇక్కడ ఉందని! అలాగే పరమ యోగిని భక్తులు కనుక్కుంటారు. అతని జ్ఞాన దీధితులు నలు మూలలా వ్యాపిస్తాయి. ఎవరూ చెప్పనక్కర్లేదు.

అలాగే ప్రియురాలు ప్రియుణ్ణి గురించి చెప్పేటప్పుడు కూడా తియ్యని తేనె పెరల వంటి పదాలు అతని కవిత్వంలో జాలువారుతుంటాయి.

పనసతొనలకన్న పంచదారలకన్న
జుంటి తేనెకన్న జున్నుకన్న
చెఱకు రసముకన్న చెలుల మాటలు తీపి

ఏ భావాన్ని వేమన ఏ శబ్దంతో గురిపెట్టి కొట్ట దలచాడో ఆ శబ్దానికి ఆ భావం గిర్రున తెగి పడుతుంది. పండు పడటం

గురికి లక్ష్యం. గురితప్పి బాణాలు వేసే చాలా పండితుల బాణి విద్య ఎంత గొప్పదయినా నిష్ఫలం. ఒక్కొక్క పద్యం ఒక్కొక్క సామెతనూ, సిద్ధాంతాన్ని నిర్మిస్తున్నప్పుడు ఆయనకు పాండిత్యం తక్కువేమిటి! ఆయన భాషను నిర్మిస్తున్నాడు.

కవి యొక్క ఒక్కొక్క మానసిక స్థితే ఒక్కొక్క పాఠకుడు. కవి తన మనస్సులో ఎన్నో దశాంతరాలు పొందుతాడు. అన్ని దశలకూ అంతమంది పాఠకులూ, అన్ని పాఠ్యాంశాలు. కవిలో సందర్భాలు బయటినుంచి రావు- తన జీవితం ఒత్తిడుల నుంచి వస్తాయి. తాటాకు మీద వ్రాతను గురించి మీ అభిప్రాయమే మిటి వేమన్నగారూ! అని ఎవరో అడిగారు.

'ఆకుమీది వ్రాత అందరికి తెలియును' అన్నాడు.

మరి చేతిలో వ్రాతో 'చేతిలోని వ్రాత చెప్పవచ్చు...' మరి తెలియని వ్రాత ఏమి ఉంది *'తోలు క్రింది వ్రాత దొడ్డ వాడెఱుగును'* ఇలా కవి యొక్క ప్రతి సమాధానాన్ని ముక్కలు ముక్కలు చేసుకుంటూ పోతే అక్కడ ఎన్నో ప్రశ్నలు దొరుకుతాయి. జీవితాలు దొరుకుతాయి, సంఘాలు దొరుకుతాయి ప్రపంచాలు దొరుకుతాయి.

వేమన అప్పటి గ్రంథాలయాల్ను పరమ దారుణంగా తిట్టాడు. అప్పటి పరమ పవిత్రమైన గ్రంథాలు వేదాలు. ఆ గ్రంథాలకు ఆలయాలు ఛాందసుల నోళ్లు. వాటిని వేమన ఏమన్నాడో చూడండి.

వేనవేలు చేరి వెర్రి కుక్కల వోలె
అర్థహీన వేద మఱచు చుంద్రు
పరముగనని వాడు బాపడు గాదురా!

వేమన వేదాలను అర్థహీనమన్నాడు. అవి చదివే వాళ్లను కుక్కలన్నాడు. ఈ గ్రంథాలయాలూ అంతే. వీటిని మనం విజ్ఞాన కేంద్రాలు అంటాము. ఇవి విజ్ఞాన కేంద్రాలు గాదు, అజ్ఞాన కేంద్రాలు. వేదం వినే శూద్రుడి కర్ణ శూలాల్లో సీసం కరిగించి పోసే ఆ రోజుల్లో వేదం చదివే వాళ్ళను కుక్కలనడానికి ఎంత గుండె ధైర్యం కావాలి. వేదాల సంగతి ఆయనకు ఆమూలాగ్రంగా తెలుసు కాబట్టే అంత ఘాటుగా అనగలిగాడు. అంత లాలాజలం ఊరేటట్టు అంగలారుస్తూ చదివే ఈ వేదాల్ను నిజంగా తరచి చూస్తే వాటిల్లో ఏ మహత్తర విద్య ఉంది? సామాన్య మానవులు ఓ ఇంద్రుడా! నా గొడ్డూ గోదా కాపాడు, ఓ చంద్రుడా! నా పిల్లా జెల్లాను కాపాడు అని విలాప ప్రలాపాలు చేయడం తప్ప ఏ ఘన విజయమూ లేదు. కాకపోతే అప్పటి కవులు (ఋషులు) వ్రాశారుగాబట్టి కొన్ని కవిత్వాలు లేకపోలేదు. ఏమీ లేని దాన్ని ఎందుకు అంత పదిలంగా భద్రపరచుకున్నారు. అది మన దేశంలో అతి ప్రాచీనమైన రికార్డు కావడం వల్ల. మహమ్మదు కేశంలా, బుద్ధుని వెన్నెముకలా దాన్ని దాచుకుంటే చూచే జనానికి వింతగా ఉంటుంది. గాంధీగారి చెప్పులే కాదు, గాడ్సే చొక్కా గుండీ దొరికినా మనకు దాచుకోబుద్ధి పుడుతుంది. ఎందుకంటే అక్కడ గొప్పతనం కాదు ప్రజలు చూచేది, ఒక చారిత్రక సత్యం. అప్పుడు వేమన్న దృష్టిలో వేదాలే అర్థహీనమైనప్పుడు ఇప్పుడు టన్నుల కొద్దీ వస్తున్న ఈ వ్యర్థ పుస్తకాలతో నిండిన గ్రంథాలయాలు అర్థహీనం ఎందుకు కావు. నేను డ్రీమ్స్ కాలనీ అని ఒక చిన్న ఇంగ్లీషు పుస్తకం వ్రాసి దాంట్లో ప్రపంచంలో గ్రంథాలయాల్లో ఉన్న సమస్తమైన పుస్తకాల్లో ఉన్న సమస్త విజ్ఞాన మంతా పది పేజీల కంటే ఎక్కువ కాదన్నాను. దానికి ఢిల్లీ నించి ఒకతను ఉత్తరం వ్రాస్తూ మీరు పవిత్రమైన గ్రంథాలయాల్ను కించ పరుస్తున్నారు అన్నాడు. విజ్ఞానమనేది ఇన్నిపెద్ద పేజీల్లో ఇంత పెద్ద పుస్తకాల్లో ఉండదు. ఒక్క మాటలో ఒక్క వాక్యంలో ఉంటుంది. బుద్ధుడు తన జీవితమంతా ఏమి చెప్పాడు. బుద్ధ సాహిత్యాన్నంతా పిండితే ఏమి దొరుకు తుంది! క్రీస్తు బోధలన్నీ సారాంశంగా పిండితే ఏమి దొరుకుతుంది. 'ఒక చెంపను కొడితే రెండో చెంప ఇవ్వు' అని ఉంటుంది. శంకరాచార్యుడు చెప్పిన వేదాంత సారమేమిటి? 'జగత్తు మిథ్య, కల' అని. న్యూటను చెప్పిందే మిటి 'భూమికి గురుత్వాకర్షణ శక్తి ఉంది' అని. రామాయణం చెప్పిందేమిటి 'తండ్రి మాట జవదాటగూడదు' అని. ఈ వాక్యాలన్నీ పోగు చేస్తే 10 పేజీలకంటే ఎక్కువ వస్తుం దా! మరి ఇన్ని పేజీలు ఇంత పెద్ద గ్రంథాలు ఎలా వచ్చినాయి. మన జిహ్వా చాపల్యం వల్ల. ఒక పిల్లను ముగ్గువేయడం అనే దాన్ని వ్రాసి ఇవ్వమనండి. ముగ్గు అసలు ఎలా ఉండాలి. ముగ్గు వేయడానికి ఎలాంటి భూమి కావాలి. ముగ్గును వ్రేలితో ఎట్లా పట్టుకోవాలి. కర్ర లాగేటప్పుడు కాళ్లు ఎలా పెట్టాలి నడుం ఎంత వంచాలి. ఇలా వ్రాసుకుంటూ పోతుంటే ఆ రికార్డంతా కొన్ని వందల పేజీల సంపుటాలు అవుతాయి. అవన్నీ గ్రంథాలయాల్లో పెడితే ఎన్ని గ్రంథాలయాలూ చాలవు. విద్యార్థుల రికార్డులుగా తయారుచేసే బుక్కులన్నీ ఇవేగా పిల్లలు, కాంపోజిషన్ల బుక్కులు, నోట్సులూ గైడులూ చదివిన తరువాత పారవేస్తున్నారు గాబట్టి సరిపోతుందిగాని అవన్నీ అచ్చువేసి గ్రంథాలయాల్లో పెడితే మనకూ ఇన్ని వేల గ్రంథాలయాలు ఉన్నవని ఘనంగా చెప్పుకోవడానికి పనికి వచ్చేవి. మనముందు ఒకడు పనికిరాని వాగుడంతా వాగుతాడు. అది మనం వినము. వాడిని వాగవద్దు అంటాము. నా వాగుడు ఎవరూ వినడం లేదు దీన్ని అచ్చు వేసుక వస్తే వాళ్లే అఘోరిస్తూ చదువుకుంటారు అని అతడు వెళ్లి తెల్ల కాగితాల మీద నల్ల అక్షరాలతో ప్రింటు చేసి అదంతా పుస్తకంగా చేసి గ్రంథాలయాల్లో పెడతాడు. దాన్ని పరమ పవిత్రమైన విజ్ఞానంగా భావించి మనం చదువుతాము. అందుకే ఇవి విజ్ఞాన కేంద్రాలు గాదు, అజ్ఞాన కేంద్రాలు అనడం. మనం మనకు మక్కువ ఉన్న వస్తువులన్నీ భద్రపరచుకుంటూ పోతుంటే ఈ ప్రపంచమే సరిపోదు. మృతులైన మన బంధువుల శవాలన్నీ యాసిడ్లో ఉంచి భద్ర పరచుకుంటూ పోతుంటే ఈ భూమ్మీద సజీవులకు తావుండదు. గతించిన మన ప్రియుల పటాలన్నీ గోడలకు కట్టుకుంటూ పోతుంటే గోడలు చాలవు. ఇది అనంత మానవ సందోహం. దానికి ఎన్ని నోర్లున్నాయి. ఎన్ని మాటలున్నాయి అవన్నీ టేపు రికార్డులు చేస్తే వెయ్యి సముద్రాల ఘోష కూడా చాలదు. ఈ లక్షల కోట్ల వేల మాటల్లో కొన్ని మాటలే మనం దాచుకుంటాము. కోట్ల కోట్ల మాటలు ఈ అనంతాకాశంలో మునిగి

Unfiled Notes Page 34

పోతాయి. కాని అందులో కాలాన్నీ ఆకాశాన్నీ స్థానాన్నీ అధిగమించి ఎవ్వరో కాళిదాసు షేక్స్పియర్లో, వేమనో, పోతనలాంటి వారివి కొన్ని మాటలే చరిత్ర మిగుల్చుకో గలిగింది. కాలం కబంధ హస్తాలతో సర్వ శబ్ద సంచయాన్నీ సర్వభావ సందోహాన్నీ కబళించి వేస్తుంటే ఆ అలల ఆఘాతంలో ఆ జలావర్త సంఘాతంలో ఒరుగుతూ తొణుకుతూ ప్రవాహం మథనలో వేమన శబ్దాలు అలాగే కొట్టుకుంటూ వస్తున్నాయి.

నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు
తళుకు బెళుకురాళ్లు తట్టెడేల
చదువ పద్యమరయ చాలదా ఒక్కటి
విశ్వదాభిరామ వినుర వేమ

మన పుట్టిన తారీఖు మనకే తెలియదు, మన పేరు మన ప్రక్క వాళ్లకే తెలియదు. వేమన పుట్టిన రోజు ప్రపంచానికి తెలుసు. ఆయన పేరు సమస్త విశ్వానికి తెలుసు. ఆయన విశ్వాత్మ. విశ్వమానవుడు. విశ్వదీధితి. కొందరు భౌతిక వాదులూ మార్క్సిస్టులు వేమన అస్తిత్వాన్ని గతి తార్కిక భౌతికవాదంతో ముక్కలు చేసి చూడాలనుకుంటారు. సమస్త చరిత్రా కూడూ గుడ్డా అనే భక్తి మీద నుంచే వికసించిందంటారు. అలెగ్జాండరు తిండిలేక ప్రపంచం మీద దాడి చేశాడా! బుద్ధుడు అన్నానికి లేక బౌద్ధమతం కనిపెట్టాడా! నలందా విశ్వవిద్యాలయం ఆకలి అన్వేషణతో ప్రారంభమైందా! రాముడు తిండికోసం అడవులకు వెళ్లాడా! ఆకలియెంతో యుద్ధకాంక్ష అంతే. కీర్తి కాంక్ష, జ్ఞాన పిపాసా, అన్నిటితో ఈ చరిత్ర తయారైంది. పుత్ర కాంక్షతో వారసత్వపు చట్టాలూ, స్త్రీ కాంక్షతో పెళ్లి చట్టాలు, వైరాగ్యంతో విడాకుల చట్టాలూ తయారయినాయి. మానవుడంటే కూడూగుడ్డా, ఇహమూ పరమూ, ఆశలూ, అభిలాషలూ అన్నీను!

ఆధ్యాత్మ విద్యను కవిత్వంలో అందునా సాంకేతికంగా చెప్పడాన్ని మిస్టిసిజం రహస్యవాద కవిత అంటారు. రహస్యోక్తులూ ప్రతీపోక్తులు అప్రస్తుత ప్రశంస, దృష్టాంతాలతో జీవ పరిమాణాత్మలా ప్రకృతి సంబంధాలను కవిత్వంలో చెప్పే ఈ పద్ధతికి ఈ జ్ఞాన కవిత్వంలో ఉన్నంత కావ్యక్షేత్రం లౌకిక సాహిత్యానికి కూడా లేదేమోననిపిస్తుంది. ఈ కావ్య జగత్తులో రహస్య గర్భంగా నర్మగర్భంగా ఎంతో చెప్పవచ్చు. పుట్ట మీదా చెట్టు మొలిచే అని 'నవద్వారాల మేడ' అని అంతా విషయ నిగరణం చేసి చెప్పడంలో ఈ కవితా ప్రక్రియ ఎంతో పరిణ తిని సాధించింది. కుంజర యోథంబు దోమ కుత్తుక జొచ్చెన్ అన్నట్టు పిల్లిని ఎలుక తినేసిందనీ, ఆవగింజలో పర్వతం దూరిందనీ ప్రతీపోక్తులో చాలా చమత్కారవంతాలైన కవి తల్లారు తాత్వికులు. ఇలాంటి ఉక్తుల్లో పద్య కవితలో చాలా సమగ్రంగా చెప్పిన వాడు వేమనే. తరువాత బ్రహ్మంగారు, ఎడ్ల రామదాసు మొదలైన వారిద్వారా అవి తత్వాలుగా ప్రసిద్ధికెక్కాయి. ఆత్మ, శూన్యంలోనూ బయలులోనే ఉంటుంది. దాన్ని వేమన 'అందరాని పండు అడవి వెన్నెల నుండు' అని చెప్పాడు. ఈ జీవాత్మ; జ్ఞానంతో పండిపోతుంది. అప్పుడు ఆ పండు తెగిపోతుంది. జీవాత్మకు బంధన విముక్తి కలుగుతుంది. బంధన విముక్తి కలిగిన జీవుని ఆనందం పట్ట శక్యం కాదు. 'పండు పడిన జెట్టు పట్టంగ లేరయా!' అని ఈ స్థితినే వేమన చక్కగా వర్ణించాడు. ఈ అచింత్య ఆత్మతత్వాన్ని అర్థం చేసుకోవడమే కష్టం, అర్థం చేసుకోవడం అటుంచి దాన్ని కడుపారా జుర్రి ఆరగించి త్రేన్చి, మళ్లీ దాన్నంతా అరటి పండు ఒలిచినట్టు ఒలిచి చేతికిచ్చి అందమైన పద్యాలుగా వెలయించాడంటే వేమన ఎంత దుర్ఘటమైన కార్యం సాధించాడో మనం వేరే చెప్పనక్కర లేదు.

సత్వరజస్తమో గుణాలని మూడు గుణాలు మానవుణ్ణి అంటి ఉన్నాయి. జీవుడు, ఆత్మను తెలుసుకున్న తరువాత అవన్నీ ఏకాకార మవుతాయి. ఒకే రంగు, ఒకే ఆత్మ.

ఆకు వక్క సున్నమవి మూడు వన్నెలు
నేకమైన చోట దాకు నెఱవుసోకి
త్రిగుణ మట్టు శోభించు పరమాత్మ.

ఇక్కడ ఈ మూడు త్రిగుణాలూ తాంబూలం వేసుకున్నట్టు ఎర్రగా పండి ఒకే వన్నెకు వస్తాయి. అవి మళ్లీ 'సోకి త్రిగుణ మట్టు శోభించు పరమాత్మ' అంటున్నాడు. ఒకే ఎరుపైన పరమాత్మలో మళ్లీ త్రిగుణాలు ఏమిటి? అవే సత్యం, శివం, సుందరం, అనే మూడు గుణాలు పోయి శుద్ధ చైతన్య తత్వాలుగా రూపొందుతాయి. ఐహిక దేహంలో ఉంటూ ముక్తి సుఖాన్ని పొందడానికి యోగులు యోగాభ్యాసం సాధన చేస్తూ ఉంటారు. దీని ఉద్దేశ్యం ఇంద్రి యాల్ని తద్విషయాల మీదకు పోకుండా అరి కట్టడం. ఇంద్రియాలను అరికట్టా లంటే మన స్సును బంధించాలి. మనస్సు ప్రాణాధీ నమై ఉంది. ప్రాణవాయువును యోగి తన స్వాధీ నంలో ఉంచుకుంటాడు. అప్పుడు మనస్సు తదేక బద్ధమై నిబిడానందాన్ని పొందుతుంది. ఇళా పింగళ సుషుమ్నా నాడుల ద్వారా కుండలినీ శక్తి రెచ్చగొట్టబడుతుంది. అప్పుడు జీవుడు ఊర్ధ్వ గామియై సహస్రారంలో ఉన్న బ్రహ్మలో నమవసించి ముక్తి సుఖంలో చొక్కి సోలిపోతాడు. ఈ పద్ధతికి కూడా ఉపనిషత్తులే మూలం. ఉపనిషత్తుల్లో ఇది సూక్ష్మంగా చెప్పబడింది. కఠోప నిషత్తు యిలా అంటుంది.

ఊర్ధ్వం ప్రాణమున్నయత్యపానం
ప్రత్యగస్యతి, మధ్యేవామన మాసీనం
విశ్వే దేవా ఉపాసతే

ప్రాణ వాయువును పైకి తీసుకు వెళుతుంది. అపాన వాయువును, పొట్టలోకి విసరు తుంది. మధ్యే అంటే నాభి గళానికి మధ్య పరిశుద్ధ మైన జీవుడు ఉన్నాడు. విశ్వేదేవులు (ఇంద్రి యాలు) అతణ్ణి ఉపాసిస్తున్నాయి. ఈ ప్రాణాన్ని నిరోధించి ఊర్ధ్వ ముఖం చేయడంలోనే ఇది సిద్ధి స్తుంది. 'యోగశ్చిత్త వృత్తి నిరోధః' ప్రాణాయామాదుల చేత చిత్త వ్యాపారాన్ని నిరోధించాలి. రేచక పూరక కుంభకాదుల చేత జీవుణ్ణి సహస్రా రంలోకి పంపివేయాలి. అప్పుడు నాదబిందు కళతో చెలువొందే ఆ బ్రహ్మానందాన్ని ధ్యాన బద్ధు డైన యోగి పొందుతాడు.

బిందు వందు పుట్టె పెంపైన నాదము
నాదమందు పుట్టె నాదిశివుడు
శివునిమధ్యమందు జెలగును

వినియోగించే కొద్దీ భాష వికసిస్తుంది. వాడని భాష వాడిపోతుంది

సూక్ష్మంబు'

ఇదీ ఆయన యోగ సిద్ధిలోని అనుభవం.

ఇడా పింగళ నాడుల గురించి ఎంత చక్కని సంకేతాన్ని ఏర్పరిచాడో చూడండి వేమన.

గంగా యమునల నడుమన
బంగారవు బొమ్మవోలె బాలిక యుండున్
సంగతిని జెలిమి చేసిన
భంగము లేకుండ ముక్తి పరమగువేమా!

గంగా యమునలు అంటే ఇడా పింగళ నాడులు. బాలిక అంటే ముక్తి. అరిషడ్వర్గాలు. కామక్రోధలోభ, మోహ, మద, మాత్సర్యాలు. ఈ ఆరింటి మీదా వేమన ఒక ఇల్లు కడుతున్నాడు.

ఆఱు దూలములకు నాధారమైనట్టి
యొంటి కంబమంటి నొనర నిల్పి
యింటికొకడు కర్త యేపారుచుండును

అరిషడ్వర్గాలు అనే ఆరు చిన్న దూలాలకు ఆధార స్తంభంగా ఉన్నదే మహత్తు లేక మనస్సు. వీటితో కట్టబడింది ఈ దేహం. ఈ దేహంలో ఇంటి కర్తగా జీవుడు ఉంటున్నాడు. ఒక్కొక్క దేహంలో ఒక్కొక్క జీవుడు.

ప్రాసానుప్రాస ఛేక యమక గమకాలతో కూడా ఈ కవులు ఎన్నో శబ్దాలంకార రచ్చటల కవిత్వాలు అల్లారు. వేమన అంటున్నాడు....

ఎఱుక యుండువాని కెఱుకయే యుండును
యెఱుక లేనివాని కెఱుక లేదు
ఎఱుక లేని యెఱుక నెఱుగుట తత్త్వము.

ఇక్కడ 'ఎఱుక' అనే పదం వచ్చి పద్యాన్ని శబ్దాలంకార మధురం చేసింది. ఇలా వ్రాయడం కూడా ఉపనిషత్తుల్లో ఉంది. ఎఱుక అంటే వే' అని. కేనోపనిషత్తులో 'ఎఱుక' లాగా 'వేద' అన్న శబ్దం ఎన్నిసార్లు వచ్చి ఎఱుక తత్త్వాన్ని చెప్పిందో చూడండి.

"నాహం మన్యే సు వేదేది
నోన వేదేచి వేదచ
యోనస్తద్వేద తద్వేద నోనవేదేతి వేదచ"

దీని అర్థం. నేను ఈ బ్రహ్మను సరిగా ఎరుగుదును అనుకోవడం లేదు. నేను పూర్తిగా ఎరుగను అనేది కూడా లేదు. ఈ సంగతి ఎరుగున్నవాళ్లు ఎరుగుదురు. ఎరు గనన్నంత మాత్రాన ఎరుగక పోవడమూ కాదు.

త్వమేవాహమ్ = నీవే నేను. అహమేతత్వామ్ = నేనే నీవు అనే మహా వాక్యాలను మన వేమన ఎంత చక్కని పద్యాలుగా రూపొందించాడో చూడండి.

నేనను వచనంబు నీ వనగా వచ్చు
నీవు నేనన బడు నిష్ట దెలియ
నేను నీవె నీవె నేనను వచ్చురా!

అలాగే ఓం తత్సత్ "అది అదే. (వాడు వాడే) అనే దానికి చూడండి.

వాడు వాడు వాడు వానిలోపల నుండు
వాడె వాడు వాడు వాడుగాడు
వాడు వానిగూర్చివాడెపో బ్రహ్మంబు

ఇలా ఉపనిషద్వాణిని జ్ఞాన వాదాన్నే తెలుగు కవిత్వంలో అందించి వేమన జాతికి మహోపకారం చేశాడు. ఆయన వేదాల్ను తిట్టి ఉండవచ్చు అయినా వేద సారవే ఆయన మాటల్లో దొరిలింది. ప్రతిదీ ముందు ప్రజల్నుండే పుడుతుంది. వేదాలూ ఉపనిషత్తుల విద్య కూడా మామూలు ప్రజల్నుండే పుట్టింది. కొంత కాలానికి అది పండిత విద్య యై ప్రజలకు దూరమై పోయింది. అప్పుడు సత్యద్రష్టలు వచ్చి వాటిని తిడతారు. అలాగే వేమన తిట్టి మళ్లీ దానికే ప్రజారూప మిచ్చాడు.

(ముగింపు వ్యాసం : ఫిబ్రవరి సంచికలో...)

కవిత

'మా తెలుగు తల్లికి ఇంగ్లీషు పూదండ!'

"మా తెలుగు తల్లికి మల్లెపూదండ
మా కన్నతల్లికి మంగళారతులు..."
వేదికలన్నీ తెలుగు తల్లికి
ప్రార్ధన గీతాలాపనతో
స్వాగతం పలుకుతున్నాయి!
పరభాషా వ్యామోహంలో
అమ్మనాన్నల ఆడంబర జీవితం
చిన్నారుల జీవన మార్గానికి
అవరోధమై నిలిచిన వేళ...
అ...ఆ...ఇ...ఈ ల పద సంపద
బిడ్డలకు అందని ద్రాక్షే కదా!?
అమ్మభాషను అక్కున చేర్చినా
అమ్మభాషను ఉచ్చరించినా
నేరమనే భావనను...
పసికూనలకు ఉగ్గుపాలతో
రంగరించి నేర్పుతోన్న తల్లిదండ్రులూ
బహుపరాక్...! బహుపరాక్...!
మమ్మీ... డాడీ...
అంకుల్...ఆంటీ....
పదాలను మరువకండి!
అమెరికా....ఆస్ట్రేలియాలు
బ్రిటన్...జర్మనీలు
ప్రపంచదేశాలన్నింటా
తెలుగుబిడ్డల సత్తా చాటండి!
కానీ...ఇక్కడ మాత్రం...
గ్రామసీమల సర్కారు బడుల్ని వదిలి
ఇంగ్లీషు కార్పొరేట్ స్కూళ్ళను చేరండి!
విద్యా వ్యాపారుల వలలో చిక్కి
సాంప్రదాయ విద్యకు
శెరగోపం పెట్టండి
అమృత మూర్తి అమ్మను
మృత్యుశకటం ఎక్కించి
తెలుగు రాష్ట్రాల పొలిమేరలు దాటించండి!
భావితరాల బిడ్డలకు
మృతభాష సమాధుల జ్ఞాపకాలను
జ్ఞాపికలుగా అందించి సత్కరించండి!
పాలకులూ...
వేదికలపై అమ్మభాషకు
ఘనమైన నీరాజనాలు సమర్పించండి!
తల్లిదండ్రులూ...
అమ్మ భాషను నాలుగు గోడల నడుమ
పవిత్రంగా సమాధి చెయ్యండి...!
భవిష్యత్ జీవితంలో
తెలుగు సంతతి భావితరాలు
మాతృభాషా దినోత్సవాలను
ఆంగ్లంలో వేడుక చేసుకోవాలి!
బహుపరాక్ పాలకులూ...!
బహుపరాక్ తల్లిదండ్రులూ...!!

– విడదల సాంబశివరావు
9866400059

చలసాని నరేంద్ర
9849569050

రఫేల్ ఒప్పందంపై రాజకీయ వివాదం ఎటు దారితీస్తుంది!

రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి రాజ కీయ వివాదం గత కొంతకాలంగా దేశంలో దుమారం రేపుతున్నది. ఈ విషయమై సుప్రీం కోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిన తర్వాత కూడా రాజకీయ వివాదం సద్దుమణగక పోవడం దురదృష్టకరం. ఈ ఒప్పందంలో దేశ రక్షణ, మన సైనిక పాటవం, విదేశాల నుండి దాడులను ఎదుర్కోగల సంసిద్ధత వంటి పలు సున్నిత అంశాలు ఇమిడి ఉన్నాయి. ఇటువంటి అంశాలలో దేశం మొత్తం ఒకటిగా ఉండ వలసింది.

ఇందిరాగాంధీ హయాంలో అణు పరీక్షలు జరిపినప్పుడు, వాజపేయి హయాంలో అణు సామర్ధ్యం ప్రదర్శించినప్పుడు. బాంగ్లాదేశ్ యుద్ధం వంటి సమయాలలో దేశం మొత్తం ఒకటిగా ఉండటం తెలిసిందే. అధికార, ప్రతిపక్షాలు ఒకే స్వరంతో నిలబడ్డాయి. కానీ ఇప్పుడు అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. అధికార, ప్రతిపక్షాలు ఎవరికి వారు రాజకీయ ప్రయోజనాలలకోసం పాకులాడటమే గాని పరస్పరం సమాలోచనలు జరుపుకొని, అనుమానాలను నివృత్తి చేసుకొని ఉండవలసింది.

వాస్తవానికి మన వైమానికాదళంకు అత్యవసరంగా యుద్ధ విమానాల అవసరం ఉంది. ఈ విషయంలో పుష్కరకాలంగా ప్రయత్నాలు జరుపుతున్నాం. వివిధ కారణాల చేత యుపిఎ హయాంలో ఈ ఒప్పందం జరగలేదు. అందుచేత పరిస్థితుల అత్యవసరం దృష్ట్యా నరేంద్ర మోదీ ప్రభుత్వం కొన్ని మార్పులు చేసి, దేశ ప్రయోజనాలు, అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఒప్పందం చేసుకో వలసి వచ్చింది.

సహజంగానే ఈ విషయాలపై దేశంలో పలు అనుమానాలు చెలరేగాయి. ఈ విషయం తమ ముందుకు రావడంతో సుప్రీం కోర్టు చాలా బాధ్యతాయుతంగా వ్యవహరించింది. అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి, ఈ ఒప్పందంలో ఎటువంటి అనుమానాలకు ఆస్కారం లేదని స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు తీర్పు తర్వాత అయినా అధికార, ప్రతిపక్షాలు కలసి సంయమనంతో వ్యవహరించి ఉండవలసింది. అయితే వారిద్దరికీ మరి కొద్ది నెలల్లో జరిగే లోక్ సభ ఎన్నికలు కనిపిస్తున్నాయి గాని దేశ ప్రయోజనాలు కనిపించడం లేదు.

ఈ సందర్భంగా సుప్రీం కోర్టు తీర్పును దృష్టిలో ఉంచుకొని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను పరిశీలించవలసి ఉంది. ముఖ్యంగా అప్పులలో కూరుకు పోయిన అనిల్ అంబానీకి మేలు చేకూర్చడం కోసం ప్రభుత్వరంగసంస్థ అయిన హెచ్ ఏ ల్ కు కాకుండా రిలయన్స్ డిఫెన్స్‌కు ఇందులో భాగస్వామ్యం కల్పించడం కోసం ప్రభుత్వం సహకరించిన్నట్లు ఆరోపణలు చేస్తున్నారు.

అట్లాగే యుద్ధ విమానాల సంఖ్యను 126 నుండి 36కు తగ్గించడం ద్వారా నరేంద్ర మోదీ ప్రభుత్వం జాతీయ భద్రత విషయంలో రాజీ ధోరణి ప్రదర్శించిన్నట్లు విమర్శిస్తున్నారు. అయితే యుపిఎ ప్రభుత్వం 126 విమానాల కొనుగోలుకు సంప్రదింపులు జరిపినా ఒప్పందం కుదుర్చుకోలేక పోవడాన్ని మరచిపోలేము.

ఇంతలో మీడియాపార్ట్ అనే ఒక పోర్టల్‌లో కనిపించిన ఫ్రెంచ్ జర్నలిస్ట్ అంతటోన్ రొగేట్ వార్త కథనం మరో సంచలనం రేపింది. కాంగ్రెస్ నేతలకు తాజాగా మరో ఆయుధాన్ని సమకూర్చిన్నట్లు అయింది. రిలయన్స్ ను విమానాల తయారీలో భాగస్వామిగా డస్సాల్ట్ చేసుకోవడం తప్పనిసరి అని భారత ప్రభుత్వం పేర్కొన్నదని డస్సాల్ట్ ఏవియేషన్ డిప్యూటీ సీఈఓ మే, 2017లో చెప్పిన్నట్లు పేర్కొన్నది. అందుకు సంబంధించి ఆ కంపెనీ అంతర్గత పత్రం ఒకటి తమకు చేరినట్లు పేర్కొన్నది. ఈ విధంగా రఫేల్ ఒప్పందంపై పలు అనుమానాలు వ్యాప్తి చేయడానికి కాంగ్రెస్ పార్టీకి అవకాశం కలిగింది. అయితే వాస్తవాలు ఏమిటి ?

36 విమానాలకు ఎందుకు తగ్గించారు ?

నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చే సరికి భారతదేశంలో విమానాల తయారుకు సంబంధించి హెచ్ ఏ ఎల్, డస్సాల్ట్‌ల మధ్య అంగీకారం కుదరక పోవడంతో సంప్రదింపులు దాదాపుగా స్తంభించి పోయాయి. రెండు వైపుల నుండి ప్రమాదం ఏర్పడితే ఎదుర్కోవడానికి భారత వైమానిక దళానికి 42 స్క్వాడ్రన్ విమానాల అనుమతి ఉండగా వారి వద్ద 33 మాత్రమే ఉన్నాయి. వాటి సంఖ్య మరింతగా 31కి తగ్గిపోయాయి. ఉన్న విమానాల సంఖ్య కూడా తగ్గిపోతూ ఉండడంతో వైమానిక దళానికి అత్యవసరంగా యుద్ధ విమానాల అవసరం ఏర్పడింది. సాంకేతిక బదిలీకి, భారత్ దేశంలోనే ఉత్పత్తి చేపట్టాలి అంటే సంప్రదింపులకు చాల ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది.

పైగా, అటువంటి ఒప్పందం కుదుర్చుకొంటే భారత దేశంలో వాటి ఉత్పత్తికి అనుగుణంగా హెచ్ ఏ ఎల్ లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయవలసి ఉంటుంది. అందుకు కూడా మరి కొంత వ్యవధి అవసరం కాగలదు. దానితో కొనుగోలు వ్యవహారం జాప్యం అవుతుందని ప్రభుత్వం ప్రస్తుతం 36 విమానాలను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. వాస్తవానికి ఇప్పటికే నావికాదళం మరిన్ని విమానాలు పొందే ప్రయత్నం ప్రారంభించింది. వాటిల్లో అత్యధిక భాగం భారత దేశంలోనే తయారవుతాయి. కేవలం అత్యవసర అవసరాల కోసమే ఈ 36 విమానాల కొనుగోలు చేపట్టినదని గమనించాలి.

హెచ్ ఏ యల్ ఎందుకు భాగస్వామి కాలేదు ?

ఈ కొనుగోలు ఒప్పందంలో – భారత్ లో తయారీ నిబంధన లేకపోవడంతో హెచ్ ఏ ఎల్ ను భాగస్వామిగా చేసే అంశం

ప్రస్తావనలోకి రాలేదని చెప్పవచ్చు. తక్కువ సంఖ్యలో విమానాలను ఇక్కడ తయారు చేయడం ఆర్థికంగా వెసులుబాటు కాబోదని విదేశాల నుండే కొనుగోలు చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. మరో వంక ఈ ఒప్పందంలో అసలు హెచ్ ఏ ఎల్ భాగస్వామి కాదు. ఆఫ్ సెట్ నిబంధనలను భర్తీ చేసుకోవడం కోసం డస్సాల్ట్ రిలయన్స్‌తో పాటు మరి అనేక భారత్ కంపెనీలతో ఒప్పందాలను కుదుర్చుకొంది.

యుపిఏ హయాంలో ఈ ఒప్పందంపై సంప్రదింపులలో పాల్గొన్న వైమానిక దళ అధికారి ఒకరు హెచ్ ఏ ఎల్, డస్సాల్ట్ ల మధ్య తీవ్రమైన విభేదాలు ఎదురు కావడంతో ఒప్పందం ఆగి పోయిన్నట్లు చెప్పారని లైవ్ ఫిస్ట్ అనే ఒక పోర్టల్ పేర్కొన్నది.

డస్సాల్ట్ పై అంబానీని ప్రభుత్వమే రుద్దిందా ?

భారత ప్రభుత్వం వత్తిడి మేరకే రిలయన్స్ ని భాగస్వామిగా చేసుకున్నట్లు డస్సాల్ట్ డిప్యూటీ సీఈఓ ఒకరు చెప్పారంటూ కథనం ప్రచురించిన మీడియాపార్ట్ విశ్వసనీయత పట్ల ఒక వంక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. వైవీఎస్ పగోట్ లో ప్రచురించిన మరో అంతర్గత పత్రం కథనం చూస్తే తప్పుడు కథనం ప్రచురించారనే అనుమానం కలుగుతున్నది. ఈ ఒప్పందం ఫలితంగా "భారత్‌లో తయారీ" తప్పనిసరి పరిణామం అని, అందుకనే రిలయన్స్‌ను ఇందులో భాగస్వామిగా చేశారని పోర్టయిల్ ఏవియేషన్ పోర్టల్ మరో కథనం ప్రచురించింది.

యుపిఏ ప్రభుత్వం హయాంలో రూపొందించిన ఆఫ్‌సెట్ విధానం ప్రకారం ఇటువంటి ఒప్పందాల విలువలో కొంతభాగాన్ని భారత్ లో విదేశీ పరికరాల ఉత్పత్తికోసం వినియోగించ వలసి ఉంది. రఫెల్ ఒప్పందంలో భాగంగా, ఈ ఒప్పందం విలువ మొత్తం లో సగభాగంను భారత్ లో ఆఫ్ సెట్ పెట్టుబడిగా పెట్టడానికి డస్సాల్ట్ అంగీకరించింది. అందుకోసం ఆ సంస్థ పలు ప్రైవేట్, ప్రభుత్వ రంగాలలోని భారతీయ కంపెనీలను ఎంచుకోగా వాటిల్లో ఒకటి రిలయన్స్.

ఆఫ్ సెట్ లలో రిలయన్స్ భారీగా ప్రయోజనం పొందు తుందా ?

రఫెల్ ఒప్పందంలో భాగంగా ఆఫ్ సెట్ పెట్టుబడులను నాలుగు భాగాలుగా విభజించారు. డస్సాల్ట్ విమానం ప్రధాన ఆకా రాన్ని నిర్మించి, వివిధ ఇతర కంపెనీలు తయారు చేసిన విడి భాగాలను కలుపుతుంది. రాడార్లు, ఏవియానిక్స్ లను తలెస్ అనే కంపెనీ నిర్మిస్తుంది. ఇంజిన్, ఎలక్ట్రానిక్ పరికరాలను సాఫ్రాన్ నిర్మి స్తుంది. ఆయుధాలకు ఎంబిడిఏ బాధ్యత వహిస్తుంది.

ఈ ఒప్పందం విలువ రూ 60 వేలు కోట్లు కావడంతో, అందులో సగభాగం సుమారు రూ 30 వేలు ఆఫ్ సెట్ భాగస్వాముల విలువగా ఉంటుంది. తమ ఆఫ్ సెట్ విలువ అమలులో సుమారు 10 శాతం మేరకే రిలయన్స్ భాగస్వామ్యంతో చేబడతామని డస్సాల్ట్ సీఈఓ తెలిపారు. మీడియాపార్టీ కథనం సృష్టించిన గందరగోళం సందర్భంగా అజెన్సు ఫ్రాన్స్ – ప్రెస్ జరిపిన ఇంటర్వ్యూ లో ఆయన ఈ వివరణ ఇచ్చారు. తమ ఆఫ్ సెట్ ప్రణాళికల అమలుకోసం తాము మరో 100 ఇతర కంపెనీలతో సంప్రదింపులు జరుపుతు న్నట్లు కూడా అయన చెప్పారు.

ఎకనామిక్స్ టైమ్స్ కథనం అంచనా ప్రకారం మొత్తం ఆఫ్ సెట్ విలువ రూ 30 వేల కోట్లలో 3 శాతం వరకు రిలయన్స్ కు దక్కే అవకాశం ఉంది. డస్సాల్ట్ రిలయన్స్ సంయుక్త సంస్థలో మొత్తం పెట్టుబడులు సుమారు రూ 845 కోట్లు ఉండే అవకాశం ఉంది. తలాష్ కూడా కొద్దిపాటి మొత్తం పెట్టుబడిగా పెడుతుంది. ఈ భాగస్వామ్య కంపెనీ డస్సాల్ట్ ఫల్కన్ జెట్ లోని కొన్ని భాగాలను తయారు చేసిందని తెలుస్తున్నది. అంటే మొత్తం కొనుగోలు విలువలో చాలా తక్కువ మొత్తమే రిలయన్స్ కు దక్కే అవకాశం ఉంది.

రిలయన్స్ తో పాటు కేంద్ర ప్రభుత్వ సంస్థలయిన రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డి ఆర్ డి ఓ), హెచ్ ఏ ఎల్ లలో కూడా పెట్టుబడులు చేరనున్నాయి. ఇంజిన్, ఎలక్ట్రానిక్ పరికరాలను తయారు చేయవలసిన సాఫ్రాన్ ఈ రెండు ప్రభుత్వ సంస్థలలో పెట్టుబడులు పెడుతోందని తెలుస్తున్నది. కావేరి జెట్ ఇంజిన్ కార్య క్రమాన్ని పునరుద్ధరించడం కోసం డి ఆర్ డి ఓ కు పెట్టుబడులు లభించే అవకాశం ఉండగా, హెలికాప్టర్ ఇంజిన్ ల తయారు కోసం ఆ కంపెనీతో హెచ్ ఏ ఎల్ సంయుక్త భాగస్వామ్యానికి దిగే అవకాశం ఉంది. తలెస్ పెట్టే పెట్టుబడులలో కొద్దిభాగం మరో ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ కు దక్కే అవకాశం కూడా ఉంది.

రఫెల్ ఒప్పందం కారణంగా అత్యధికంగా ప్రయోజనం పొందుతున్నది అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ అని రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలు పచ్చి అబద్ధాలని ఈ వాస్తవాలు వెల్లడి చేస్తున్నాయి.

రఫెల్ ధర సమంజసం కాదా ?

రక్షణ నిపుణుడు అభిజిత్ ఇయర్ మిత్ర పేర్కొన్నదానిని బట్టి ఖతర్ రఫెల్ యుద్ధ విమానం ఒకొక్క దానిని 292 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసింది. అదే విమానాన్ని ఈజిప్ట్ 246 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసింది. అయితే భారత్ మాత్రం 243 మిలియన్ డాలర్లు మాత్రమే చెల్లిస్తున్నది. అంటే ఇతర దేశాలు కొనుగోలు చేస్తున్న తరహాలోనే ధర ఉన్నట్లు స్పష్టం అవుతుంది.

అయితే భారతదేశం ఈ ఒప్పందం వల్ల కొన్ని అదనపు ప్రయోజనాలు పొందబోతున్నది. కేవలం యుద్ధవిమానాల నిర్వ హణకు మద్దతు అందజేయడమే కాకుండా ఆయుధాలు, శిక్షణ సమ కూర్చడంతో పాటు భారత్ అవసరాల మేరకు విమానాలను తయారు చేయనున్నారు. భారత నావికాదళం సూచించిన మేరకు నిర్మాణంలో జరిపే మార్పులతో ధర మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ఖతర్, ఈజిప్ట్ లు కొనుగోలు చేసిన విమానాలలో ఇటువంటి అనేక మార్పులు లేవు. అయినా వాటితోపాటే మనం ధర చెల్లిస్తున్నాము.

పైగా, ఈ ఒప్పందం మొత్తం విలువలో 50 శాతం మొత్తాన్ని భారత్‌లో ఆఫ్ సెట్ పరిశ్రమలలో పెట్టుబడులు పెట్టవలసి

పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి

ఉంటుంది. ఈ పెట్టుబడుల వలన మన దేశంలో రక్షణ ఉత్పత్తులు పుంజుకొనే అవకాశం ఉంటుంది. యుద్ధ విమానాల ధర ఎక్కువగా ఉన్నదంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవి. ఎందుకంటే 2000 ప్రారంభంలో పేర్కొన్న ధరలనే ఇప్పుడు కాంగ్రెస్ చూపుతున్నది. అప్పటి నుండి పెరిగిన ద్రవ్యోల్బణం, ఉత్పత్తి ఖర్చులను పరిగణనలోకి తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు.

రఫెల్ ఒప్పందంపై పసలేని ఆరోపణలు

మొదటగా లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం సందర్భంగా జరిగిన చర్చలో రాహుల్ గాంధీ రఫెల్ ఒప్పందంపై నేరుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ని లక్ష్యంగా చేసుకొని తీవ్ర విమర్శలు చేసారు. ఈ ఆరోపణలు భారత భద్రతతో పాటు దేశ రక్షణ సంసిద్ధతను సహితం తీవ్ర విఘాతం కలిగించే రీతిలో ఉన్నాయి. మన రక్షణ వ్యవస్థను ఆధునీకరణ కావించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకొనే రీతిలో కూడా ఉన్నాయని చెప్పవచ్చు. పైగా, వాస్తవాలకు చాలా దూరంగా ఉన్నాయి. అందుకనే చేస్తున్న ఆరోపణలలో ఎటు వంటి పస లేదని చెప్పవచ్చు.

ఒప్పందంలో ఉన్న – 'రహస్యం' అన్న నిబంధనను ఆధారం చేసుకొని ఒప్పందం వివరాలను వెల్లడించడానికి ప్రభుత్వం తప్పుకొం టున్నదని, ప్రభుత్వ రంగాన్ని నిర్లక్ష్యం చేసి ఒక ప్రైవేట్ కంపెనీకి ప్రయోజనం చేకూరుస్తున్నారంటూ ప్రధానంగా ఆరోపణలు చేస్తు న్నారు.

గతంలోకి వెడితే భారత వైమానికదళం అత్యవసరాన్ని దృష్టిలో ఉంచుకొని 126 మధ్య తరహా, బహుళ పాత్రలు నెరవేర్చగల యుద్ధ విమానాల (ఎం ఎం ఆర్ సి ఏ) కోసం ఆగష్టు, 2007లో టెండర్లను పిలిచారు. వాటిల్లో 18 విమానాలను మొత్తం నిర్మించినవి కొను గోలు చేయవలసి ఉండగా, మిగిలిన వాటిని భారత్ లోనే సాంకేతిక పరిజ్ఞానం బదిలీ ద్వారా హిందూస్తాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ (హెచ్ ఏ ఎల్) లో నిర్మించవలసి ఉంది.

విస్తృతంగా ట్రైల్స్ పరిశీలించిన తర్వాత రెండు కంపెనీలను సాంకేతికంగా అనువైనవిగా గుర్తించారు. అవి దస్సాల్ట్ రఫెల్, యురొఫైటర్ టైపూన్. చివరిగా తక్కువ ధర కావడంతో రఫెల్ ను ఎంపిక చేశారు. ఈ విషయమై జనవరి, 2012లో ప్రకటన చేసి అప్పటి నుండి సంప్రదింపులు జరపడం ప్రారంభించారు.

2014 నాటికి ఈ సంప్రదింపులు స్తంభించి పోయాయి. ముందుకు వెళ్లే అవకాశం కనబడనే లేదు. పెరుగుతున్న వ్యయం (10–12 బిలియన్ల నుండి 25–30 బిలియన్ డాలర్లుకు)తో పాటు మరో రెండు అంశాలు ప్రతిబంధకంగా మారాయి. అత్యాధునిక యుద్ధ విమానాలు తయారు చేయగల సామర్థ్యం హెచ్ ఏ ఎల్ కు పూర్తిగా లేదని భావించడంతో ఆ కంపెనీ తయారు చేసే 108 యుద్ధ విమానాలకు హామీగా ఉండడానికి దస్సాల్ట్ నిరాకరించింది.

సాంకేతిక పరిజ్ఞానం బదిలీకి సంబంధించిన వివరాల విషయంలో సహితం ఇద్దరి మధ్య బేధాభిప్రాయాలు నెలకొన్నాయి. పరిమితంగా తయారు చేయగల సాంకేతిక పరిజ్ఞానం ఇవ్వడానికి మాత్రమే దస్సాల్ట్ సంసిద్ధత వ్యక్తం చేయగా, డిజైన్ కు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం బదిలీకి ఒప్పుకోవడం లేదు. ఈ సంప్రదింపు లతో ఎటువంటి పురోగతి లేకుండా ఉండడంతో అవి ముగిసినట్లే అని అప్పటి రక్షణమంత్రి ఏ కె ఆంటోని ప్రకటించారు.

ఇటువంటి సున్నిత అంశాలపై ప్రభుత్వ పక్షం కూడా ప్రతి పక్షాలను విశ్వాసంలోకి తీసుకొని నచ్చచెప్పే ప్రయత్నం చేయకుండా రాజకీయ దాడులకు దిగుతూ ఉండడంతో అనుమానాలు మరింత పెరిగే అవకాశం ఏర్పడుతుంది. దానివలన భద్రత ప్రయోజనాలకే విఘాతం కలిగే ప్రమాదం ఉంది.

కవిత


అమ్మకే అమ్మనై

నువు నను మోసినపుడు
నిను చూసి ఉండనుగాని
నువు తృప్తిగా మురిసిపోతుంటే
చూడాలని ఉంది.
ఒక్కసారైనా కసిరి నన్ను
పొమ్మన్నావో తెలీదుగాని
నీ ఎద గుడిలో ఆడించి పెంచావని
ఆప్యాయంగా హత్తుకున్నావని
మనసుకి తడితే
స్వర్గాన్ని చూడకున్నా
...చెప్పేయలేనా
నువు చూపించిన ప్రేమలో
అది ఏపాటిదని
అమ్మా!!
నీకోసం ఏదైనా చేస్తా.
అడిగింది ఇస్తా అని
వీలుకాని మాట ఇచ్చి
తప్పలేను గాని
నువు నను పెంచినంత
ప్రేమగా నేను తప్ప
ఇంకెవరూ నిను చూసుకోలేదనేట్టుగా
సహనంగా నీతోఉంటా
బాధలోనూ నీ తోడుంటా
అమ్మనై చూసుకుంటా

–ద్వారకామాయి బత్తుల

సన్నిధానం నరసింహశర్మ
9292055531

ప్రోత్సాహానికీ వాత్సల్యానికీ పెట్టింది పేరు 'ఉషశ్రీ'



'ఉషశ్రీ' మూడక్షరాలా కీర్తిశేషులు! శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ వంటి వారల రచనల సారాన్ని రక్తాణువుల్లో భద్రపరచుకొన్నవారు. కథా రచయిత, విశ్వశ్రీ పత్రికా సంపాదకుడు. పురాణ ప్రవచనా మేరునగధీరుడు, ఆర్షవాఙ్మయ విశ్లేషణాచతురుడు – ఇలా ఎన్నో రూపాలూ పార్శ్వాలూ ఆయనకున్నా ప్రజలు ఆయన్ని లెక్కించుకున్నది రేడియో ఉషశ్రీగానే!

రేడియో ద్వారా ఎందరో పేరు తెచ్చుకోగా రేడియోకే పేరు పెంచినవారు ఉషశ్రీ అనడం పెంచి ఎంచడం కాదు.

ఇప్పుడు మనం చాగంటి కోటేశ్వరరావు, సామవేదం షణ్ముఖశర్మ, గరికిపాటి నరసింహారావు, మైలవరపు శ్రీనివాసరావు వంటివారి – వారివారి ప్రత్యేకతలతో కూడిన ఉపన్యాసాలు, ప్రవచనాలు వింటున్నాం – ఆనందం.

ఉషశ్రీ ఆధ్యాత్మిక ఉపన్యాసాలు కూడా సాహిత్యోపన్యాసాల పరిమళాలు వెదజల్లేవి. క్రియాత్మకంగా వాడుక బాసగా కనబడుతూ గ్రాంధిక పదబంధాల సమ్మేళనంలో పదవేస్తూ అక్షరాల ద్వారా ఘట్టాన్ని సామాన్య శ్రోతలకు సైతం దృశ్యమానం చేయగలిగే ఓ అనల్ప శిల్పం ఆయన్ని వరించింది. దానికితోడు ఆయనకున్న ఓ విలక్షణ కంఠం మంది ఎడందల్ని అమాంతం లోబరచుకునేది. చలన చిత్ర నటులతోపాటు ఉషశ్రీ కంఠం ధ్వని అనుకరణ కళాకారులకు ఓ అంశం అయింది. ఉషశ్రీ ఆర్ష వాఙ్మయ అధ్యయనం గొప్పది.

ఇప్పటి చాలా మందికి తెలియనిదేమిటంటే ఇంత గొప్ప కంఠం ఉన్న ఉషశ్రీగారి తండ్రి పురాణపండ రామమూర్తి గారికీ ఖంగుమని మ్రోగే ఓ అద్భుత కంఠం వుండేది అని. ఆనాటి కాలంలో పురాణ రామమూర్తి, జటావల్లభుల పురుషోత్తం, ప్రభాకర ఉమామహేశ్వర పండితులు హిందూ ఆధ్యాత్మిక ప్రవచనకర్తలుగా మాంచి పేరుండేది.

"రామమూర్తికిన్ రెండవ సాటి వక్త యిక లేదనుచున్ గడగట్టి' అనడానికి సరిపోయేవారు. జటావల్లభులకు వైజ్ఞానిక దృష్టి, ఆంగ్ల జ్ఞాన ప్రభావమూ వుండేది. టి.యస్. ఇలియట్ మృతిచెందినప్పుడు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ఆయన గొప్పదనాన్ని రాశారు. ఇక ప్రభాకర ఉమామహేశ్వర పండితులు వీరోచిత శైలిలో ప్రత్యర్థులను సవాలు చేస్తూ ప్రసంగించేవారు.

నరే రామమూర్తిగారి అబ్బాయి ఉషశ్రీ ప్రస్తుత కథా నాయకుడు. ఆయన తన విశ్వశ్రీ పత్రికల్లో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి విశ్వనాధ సత్యనారాయణ వంటి వారిపై ప్రత్యేక సంచికలు వేసేవారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రం ఓ సాహిత్య కళా కేంద్రంగా ఉండేది. బాలాంత్రపు వంటివారలు డైరెక్టర్లు, ఉషశ్రీ గారు, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ సాహిత్యేతర కళారంగాల ప్రముఖులు ఉండి అర్హతగల కవి ప్రకాండులకు కళాకారులకు సదవకాశాలను కల్పించేవారు. ఎన్నో శీర్షికల నూతనత్వంతో ఉండేవి. ఆర్థికావసరాలున్న అర్హతగల కవి కళాకారులకు ఉషశ్రీ మానవతావాదం తోడ్పడేది.

యువకుడిగా ఉన్న నాకు 3,4 పర్యాయాలు కవితా పఠనంలో అప్పటికీ ఎంతో పేరు పొందిన జ్ఞానానంద కవిగారితో పాటు అవకాశాలు వచ్చాయి. సన్నిధానంగారూ మీకు నాతోబాటు అవకాశాలు రావడం ఆనందమే, అనేవారు. ఆ అనుసంధానానికి నాకు ఆశ్చర్యంగా ఉండేది.

బేతవోలు రామబ్రహ్మంగారు రాజమహేంద్రవరానికి వచ్చే ముందు ఉషశ్రీగారు నాయనా సన్నిధానం! మన రాజమండ్రికి రాము డొస్తున్నాడు జాగ్రత్తగా చూసుకోండి అని కబురు పంపారు. వెంటనే నేనూ పురాణపండ శ్రీనివాసూ కలసి కవి పండితులతో బేతవోలు రాముడికి స్వాగత సభ ఏర్పాటు చేశాం. మల్లంపల్లి వంటి పెద్దలు ఆ సమావేశానికి విచ్చేశారు. 1970 దశకంలో నేను విజయవాడ పటమటలో పాతూరివారి గ్రంథాలయ శిక్షణ తరగతుల్లో చదువుకు నేటప్పుడూ ఉషశ్రీగారు నా చిరునామా తీసుకుని రేడియో ద్వారా అర్థవంతంగా వినియోగపడి వాత్సల్యాన్ని కురిపించేవారు.

ఒకేనాటి కాలంలో ఆయా రంగాలలోని పెద్దలు తమ రంగా లకి చెందిన యువకులు ఏమాత్రం ముందడుగులు వేసినా వారిని తమ అక్కున చేర్చుకునేవారు. మధునాపంతులవారి శిష్యుణ్ణని ఉషశ్రీగారు నన్ను ప్రోత్సహించేవారు. అంతేకాదు వారి స్నేహితుడైన స్వాతంత్ర్య సమర యోధుడు, మద్దూరి అన్నపూర్ణయ్య శిష్యుడు ఆర్.బి. పెండ్యాలగారి తమ్ముడి కొడుకునని నాపై వాత్సల్యముండేది.

కాకినాడలో విజయవాడ ఆకాశవాణి కేంద్రం నిర్వహించిన ఓ కవి సమ్మేళనం (అత్యవసర పరిస్థితిని ఇందిరను సమర్థిస్తూ) ఉషశ్రీ ఆధ్వర్యంలో జరిగింది. రాజమహేంద్రం నుండి వచన కవిత చదవడానికై కొత్తపల్లికి, పద్య కవిత చదవడానికి నాకూ అవకాశం

వచ్చింది.

ఉషశ్రీ - సంచలన సంరంభం అంటున్నాడు సన్నిధానం, ఏమిటో విందాం' అన్నారు మాధుర్య కంఠంతో, అప్పటి పద్యాలన్నీ నాకు గుర్తే. ముందర నాకు పద్యాలు గుర్తుంటాయి. తరువాతే భార్యా, కుటుంబ సభ్యులు, తరువాత మిత్రులూనూ, అప్పటి పద్యాలలో మచ్చుకు ఒకటి.

చం॥చలనములేని జాతి మనజాలదు, సంచలనాత్మక క్రియా
బలమునుగూర్చి మార్చినది భారతమున్ మన ఇందిరమ్మ-పం
టల పొలముల్ గగుర్పొడుచుటన్ బడిగంటలుమ్రోగుటన్ జన
మ్ముల చిరునవ్వు లివ్వ సుధ పొంగగ పొంగుట నద్దికన్పడున్

మిగిలిన మూడు పద్యాలూ కూడా ఇక్కడ యిద్దునుగాని అదిగో కత్తెరతో సంపాదకులు రమేష్‌బాబు దర్శనమిస్తున్నారు. కట్ చేస్తే...

ఉషశ్రీగారు ఒక ఉగాది రేడియో కవి సమ్మేళనంలో నాకు అవకాశం కల్పించారు. దాశరథి, సి.నా.రె. కరుణశ్రీ వంటి హేమా హేమీలు పాల్గొన్న ఆ కవి సమ్మేళనంలో యువకునిగా నాకు అవకాశం రావడానికి ఉబ్బితబ్బిబ్బై పోయాను. వయస్సు చిన్నదైన కారణంగా పెద్దవారి పేర్లున్న కారణంగా ఆ కరపత్రాన్ని ఒకళ్ళకి తెలియకుండా మరొకళ్ళకి ఎందరికో చూపించుకుని ముచ్చట పడి పోయాను. కడుపులో ఇంత అన్నం సరిగా చేరిందో లేదో అనే గడ్డుకాలపు బతుకుల్లో గుండెల్లో ఇన్ని కవిత్వాలూ పద్యాలు చేరిన సంపన్నతకి మురిసిపోయిన ఆ రోజులలో ఆనందమే ఆనందం. ఆ తీపి గురుతుల్లో ఉషశ్రీగారు అమరులు. స్టేచరు ఫీలింగుల ఊబిల్లో చిక్కుకుపోయే కొందర్ని చూస్తే ఒకనాటి వారెంత గొప్పవారో అర్థమవుతుంది. ఏరా ఒరే అనిపిలిచే ఆప్యాయతలు పరిమళించే పెద్దలు మనకు లేకపోవడం ఓ దౌర్భాగ్యమే...తప్పదుమరి.

నాయనా నరసింహశర్మా బాగున్నావా? మా నాన్న గారికి నువ్వంటే ఇష్టం. అందుచేత మా నాన్నగారి ప్రతి ఆబ్దీకానికి నువ్వు వచ్చేసి భోంచేయవలసిందే అంటే అది శాసనం. రాజమండ్రిలో పురాణపండ రాధాకృష్ణమూర్తిగారింట్లో రామమూర్తిగారి ప్రతి ఆబ్దీకానికి నేను తిథిని.

మా పెదనాన్న పెండ్యాల గారు ఉషశ్రీ గారు ప్రాణమిత్రులు.

పిఠాపురంలో ఎప్పుడో ఉషశ్రీగారు ఊళ్ళో మిత్రులతో బాతాఖానీలు పెట్టుకుని తిండి కూడా చూసుకోకుండా అర్థరాత్రి వేళల్లో మా పెదనాన్నగారింటికెడితే ఏరా ఉషశ్రీ ఏమన్నా తిన్నావా అంటే లేదంటే - తమ దత్తత తల్లిచేత అప్పటికప్పుడు వండింపజేసి పెట్టించేవారట. అందుకు కృతజ్ఞతగా ఉషశ్రీగారు మా పెదనాన్నగార్ని చేతుల ద్వారా చేతల ద్వారా చూసుకునేవారు. ఓసారి బేతవోలు వారు రాజమండ్రిలో గౌతమిలో నా గదికి విచ్చేసి శర్మగారూ ఈ కవరు ఉషశ్రీ ఇచ్చారు మీ పెదనాన్నగారికివ్వండి అంటే అలా చేశాను. చిన్న అంశాలలా వున్న ఇవి పరస్పర ప్రేమాభిమానాల ఎదల కదలికలున్న సంఘటనలు.

ఉషశ్రీ గారి గొంతుకకు కేన్సర్ రాగా చివరలో ఆయనతో పాటుగా ఉన్నది మా పెదనాన్న పెండ్యాలగారు మాత్రమేనని ఇప్పటికీ కుటుంబ సభ్యులు చెప్పేవారు.

ఉషశ్రీ సోదరులు వైజ్ఞానిక రచయిత పురాణపండ రంగనాథ్ గౌతమిలో నాతో చెప్పేవారు ఏమనంటే -

ఉషశ్రీగారు బాధపడలేక ఒరేయ్ రంగా! (రంగనాథ్) పొటాషియం సైనడో ఏదో అది వుంది కదా! అది కొంచెం నాలుకమీద వేసుకుంటే ఏ బాధలేకుండా చనిపోతాను కదా అది చేయరా అని అడిగేవారని'. అన్నయ్యా! మనది కర్మ దేశం కదా! నేనలా చేసి ఎలా చంపుతాను' అనే వాణ్ణని చెప్పారు.

ఓసారి - తనవద్దే కావలా కాన్తూ వున్నట్లుండే మా పెదనాన్నగారితో 'పెండ్యాలా! ఏ గొంతుతో అయితే నేను రామాయణ భారతాలు చెప్పానో అదే గొంతుకకి కేన్సర్ రావడమేమిట్రా చిత్రం!' అన్న మాటలు తలచుకొంటే ఎవరికైనా కళ్ళు చెమర్చకుండా ఉంటాయా!

మనుష్యులు అశాశ్వతం, అక్షరాలే శాశ్వతం. ఆయన అక్షరాలు ఆయన గొంతుతోపాటు ఉండి కేసెట్ల రూపంలో నేను ఉషశ్రీని, జీవించే వున్నాను అని అంటూనే వుంటాయి.

ఉషశ్రీ కుమార్తె గాయత్రి రచనా రంగంలో పత్రికల్లో కనబడుతూండడం అచట పుట్టిన చిగురు కొమ్మైన చేవ అనడానికి ఓ చిన్న సాక్ష్యం.

"మాతృభాషకే మీ మద్దతు" కవి సమ్మేళనం

సి.పి.బ్రౌన్ సేవా సమితి ఆధ్వర్యంలో...అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం (ఫిబ్రవరి 21, 2019) సందర్భంగా...ఆంధ్ర, తెలంగాణా రెండు రాష్ట్రాల్లోని ప్రతి జిల్లా కేంద్రంలోను 'తెలుగు భాషకు ఓటేయండి - ఆంగ్ల దొరతనాన్ని తరిమేయండి" అను నినాదంతో కవి సమ్మేళనాలను నిర్వహిస్తున్నాము.

1.అను ఈ మెయిల్ ద్వారా మీరు కవితలను పంపవలెను.

2. మీ కవితలు చేరవలసిన ఆఖరు తేది జనవరి 25, 2019.

3. మీ కవితలను సరిచూసి ఆమోదయోగ్యమైనచో మీకు తెలియజేస్తాము.

4. మా నుండి ఆమోదం పొందాక మీరు కవి సమ్మేళనంలో పాల్గొన వచ్చును.

5. వ్యక్తులపై, పార్టీలపై తీవ్రమైన పదజాలం వాడరాదు.

6. వేదిక వివరాలను త్వరలో మీకు తెలియచేస్తాము.

భాషాభిమానులారా! తెలుగు భాషపై మీ అభిమతాన్ని ఈ కవి సమ్మేళనం ద్వారా తెలియచేయండి.

వివరాలకు : ఇడమకంటి లక్ష్మిరెడ్డి, అధ్యక్షులు : సి.పి.బ్రౌన్ సేవా సమితి, బెంగుళూరు - 9342540479

మారేమండ రామారావు

జి.వెంకటేశ్వరరావు
9491457496

మారేమండ రామారావు ఆంధ్రదేశచరిత్ర పరిశోధకులలో మొదటి వరుసలోనివారు. మద్రాసు క్రిష్టియన్ కళాశాలలో బి.ఎ. ఆనర్స్ చదివినారు. మద్రాసు విశ్వవిద్యాలయంలో ప్రముఖ చరిత్రకారుడు కె.ఏ.నీలకంఠశాస్త్రి పర్యవేక్షణలో "ఓరుగల్లును పాలించిన కాకతీయులు" అనే అంశం మీద పరిశోధన చేసి, 1937లో డాక్టరేటు డిగ్రీని పొందినారు. మద్రాసు విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందిన రెండవ ఆంధ్రుడు మారేమండ రామారావు.

రామారావు చరిత్రపరిశోధకునిగా పేరుగాంచారు. మొదట "శాతవాహన చరిత్ర' వీరి అభిమానాంశంగా ఉండినది. క్రమంగా ఆంధ్రదేశ చరిత్రకు సంబంధించిన విషయాలపై ఆసక్తిచూపి, అనేక కొత్త విషయాలను కనుగొని అనేక వ్యాసములను, గ్రంథములను వ్రాసినారు.

రామారావు మొదట గుంటూరులోని హిందూ కళాశాలలోను; తరువాత హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలోను పనిచేశారు. తరువాత తిరుపతి వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చరిత్రశాఖ ఆచార్యునిగా పనిచేశారు. పదవీ విరమణ చేసిన తరువాత (1966) వీరి చారిత్రక పరిజ్ఞానాన్ని గుర్తించిన యు.జి.సి వారు వీరిని 'ఎమిరిటస్ ప్రొఫెసర్' గా నియమించగా – వీరు గుంటూరు హిందూ కాలేజీలో ఉంటూ పరిశోధన చేశారు.

రామారావు బహుగ్రంథ రచయిత. ప్రాచీన చాళుక్య దేవాలయములు, శ్రీశైల దేవాలయములు, ఆంధ్రప్రాంతంలోని ముఖ్యమైన దేవాలయములు, విష్ణుకుండిన నాణెములు, తూర్పుచాళుక్యుల నాణెములు అను గ్రంథాలను పురావస్తు శాఖ ముద్రించింది. 'చోళ టెంపుల్స్ ఇన్ ఆంధ్ర' అనే గ్రంథాన్ని వ్రాశారు. తిరుపతిలోని తిరుమల, తిరుచానూరులో దేవాలయాలను గురించి వ్రాసిన గ్రంథాన్ని టి.టి.డి వారు ప్రచురించారు. ది ఎర్లీ చాలుక్యన్ టెంపుల్స్, ది టెంపుల్స్ ఆఫ్ శ్రీశైలం,గ్రంథాలను పురావస్తుశాఖ ప్రచురించింది. ఇవేగాక. ది టెంపుల్స్ ఆఫ్ కలింగ, సెలెక్ట్ కాకతీయ టెంపుల్స్, శైవ డెయిటీస్ ఆఫ్ ఆంధ్రదేశ, గ్రంథాలను శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ముద్రించింది. వీరు ది ఇక్ష్వాకూస్ ఆఫ్ విజయ పురి, అనే గ్రంథాన్ని రచించి, ఏనాడో నాగార్జునకొండ ప్రాంతంలో మరుగున పడిపోయిన రాజ్యవంశముల చరిత్రను వెలికి తీశారు. మరో గ్రంథం ది ఇన్స్క్రిప్షన్ ఆఫ్ ఆంధ్రదేశ. వీరు అనేక జిల్లాలలో పర్యటించి శాసనాలను సేకరించి వ్రాసిన ప్రామాణిక గ్రంథమిది. వీరి పరిశోధక విద్యార్థి అయిన డా॥ ఎ. సూర్యకుమారి సహకారంతో ఈ గ్రంథాన్ని వ్రాసినారు.


మారేమండ రామారావుగారు గుంటూరులో ఆంధ్రేతిహాస పరిశోధక మండలి కార్యదర్శిగా ఉంటూ '1950లో శాతవాహన సంచిక' ను వెలువరించారు. పురావస్తు ప్రదర్శనశాల హైదరాబాదువారు మారేమండ రామారావు సంపాదకత్వంలో "కాకతీయ సంచికను' ముద్రించారు. ఆంధ్ర ఇతిహాస పరిశోధకమండలి ద్వారా – 'ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి' అను త్రైమాస పత్రికను నడిపినారు. బుద్ధజయంతి సందర్భంగా ఆంధ్రదేశములోని ముఖ్యమైన బౌద్ధక్షేత్రములను గురించి వివరిస్తూ – ప్రత్యేక సంచికను ప్రచురించారు.

రామారావు వ్రాసిన పరిశోధక వ్యాసములు భారతి, ఆంధ్ర పత్రిక, ప్రతిభ, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, స్రవంతి, ఆంధ్రప్రదేశ్ మొదలగు పత్రికలలోనూ, ఆంధ్ర ఇతిహాస పరిశోధక మండలి పత్రిక, జర్నల్ ఆఫ్ ఇండియన్ హిస్టరీ పత్రికలలో ప్రచురింపబడినవి. కాకతీయులను గురించిన కొన్ని ఆసక్తికరమైన సత్యాలు, వెలనాడు ప్రభువులచరిత్ర, కాకతీయుల రాజకీయ చరిత్ర, నైజాం రాజ్యంలో కనుగొనబడిన కాకతీయ శాసనముల జాబితా, రేనాటి చోళులు, ప్రాచీన – మధ్య యుగ కాలమునాటి గ్రంథాలయములు – అనే శీర్షికలతో ఆంధ్రఇతిహాస మండలి పత్రికలో ప్రచురింపబడినవి. ఆంధ్రదేశంలోని బౌద్ధ సంఘారామాల వివరాలను సేకరించి వ్యాసాల రూపంలో ప్రచురించారు. బొజ్జన్నకొండ, ఆదుర్రు మొదలగు బౌద్ధ సంఘారామ ప్రాంతాలలో పర్యటించి వాటి గొప్పతనాన్ని గురించి వ్యాసాలను వ్రాసినారు. ఇవేగాక-మోనోగ్రాఫ్ ఆఫ్ కృష్ణదేవరాయ, ద్వైతమత చరిత్ర, ఎర్లీ హిస్టరీ ఆఫ్ ద్వైత స్కూల్, సెలెక్ట్ శాతవాహన కాయిన్స్ ఇన్ ది మద్రాస్ గవర్నమెంట్ మ్యూజియం సెలెక్ట్ శాతవాహన కాయిన్స్ఇన్ గవర్నమెంట్ మ్యూజియం హైదరాబాదు, గ్లింప్సెస్ ఆఫ్ దెక్కన్ హిస్టరీ అనే గ్రంథాలను రచించారు. వీరు వ్రాసిన ప్రాచీన నాణెములు అనే గ్రంథాన్ని నామిస్మాటిక్ సొసైటీ ఆఫ్ ఇండియా అనే సంస్థ ముద్రించినది. భారతీయ విద్యా చరిత్రము, భారతీయ నాగరికత – విస్తరణము; తెలుగు వెలుగు మొదలగు గ్రంథములను వ్రాసినారు.

వీరు ఆంధ్రదేశ ప్రాచీన చరిత్రను గురించిన పరిశీలనలు అనే విషయంపైన మద్రాసులో విలియం మేయర్ ఎండోమెంటు వారి ఆధ్వర్యంలో 1968లో జరిగిన సదస్సులో ప్రసంగించారు. దీనిని మద్రాసు ప్రభుత్వం ముద్రించినది. కర్ణాటక – ఆంధ్ర సంబంధాలు" అనే అంశం మీద కర్ణాటకలోని ధార్వాడ్ విశ్వవిద్యాలయంలో ప్రసంగించగా – వారు దీనిని ముద్రించారు;

రామారావు ఆంధ్రదేశ చరిత్రకు అపూర్వ సేవచేసి ఆంధ్రులలో నూతనోత్సాహాన్ని కలిగించారు. వీరు సాధారణ చరిత్రకారునిగానే కాకుండా – రాజకీయ చరిత్రను ఆకళింపుచేసికొని – దేవాలయ చరిత్ర, కళల చరిత్రను వెలికితీసి ప్రసిద్ధిగాంచారు. వీరు 1930 – 1966 వరకు ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్, ఆలిండియా ఓరియంటల్ కాంగ్రెస్, నామిస్మాటిక్ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థలతో సంబంధాలను కలిగి ఉన్నారు. వీటిలో కార్యనిర్వాహక సభ్యులుగా పనిచేశారు. ఉస్మానియా, వెంకటేశ్వర విశ్వవిద్యాలయాలకు సెనేటు సభ్యులుగా ఉండినారు. వీరు 1973 అక్టోబరు 26న మరణించడంతో మనం ఒక గొప్ప చరిత్రకారుని పోగొట్టుకున్నాం.

విజయవంతంగా జరిగిన 'అరసం' వజ్రోత్సవం-18వ రాష్ట్రమహాసభలు



అభ్యుదయ రచయితల సంఘం (అరసం) పుట్టి 75 ఏళ్ళు. ఈ సందర్భాన ఆంధ్రప్రదేశ్ 'అరసం' 18వ రాష్ట్ర మహాసభలు 2018 డిసెంబరు 8,9 తేదీలలో గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా అఖిలభారత అరసం కార్యదర్శి వినీత్ తివారి పాల్గొనగా, అరసం నేత, నవచేతన పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు డా॥ ఏటుకూరి ప్రసాద్ ప్రారంభోపన్యాసం చేశారు. ఆం.ప్ర. అరసం అధ్యక్షుడు డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి ప్రారంభ సభకు అధ్యక్షత వహించగా, అరసం జాతీయనేత, తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి డా॥ఎస్వీ సత్యనారాయణ కీలకోపన్యాసం చేశారు. తొలుత అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అరసం పతాకావిష్కరణ చేశారు. జాతీయ, రాష్ట్రస్థాయి నేతలు, వివిధ బాధ్యతల్లో వున్నవారు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ సభలు జరిగిన రెండు రోజులూ ప్రసంగాలతోపాటు అనేక పుస్తకాల ఆవిష్కరణలు జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. తొలి రోజున ఈ క్రింది తీర్మానాలను అరసం ప్రారంభ సభలో ఏకగ్రీవంగా ఆమోదించారు. సాయంత్రం సభకు ముందు రచయితలు పెద్ద ఊరేగింపులో వీధులను చుట్టి వచ్చారు.

1.ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ఏర్పాటుకు జి.ఒ.ను విడుదల చేసి ఏడాది గడిచినా, ఇంతవరకు దానిని వ్యవస్థీకరించనందుకు ఆం.ప్ర. అభ్యుదయ రచయితల సంఘం నిరసనను తెలియజేస్తున్నది.

2. తెలుగు భాషా రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడి, 60 ఏళ్ళు గడుస్తున్నా ఇంతవరకు మొత్తం పాలనా వ్యవస్థను - శాసన నిర్మాణం నుంచి, అన్ని స్థాయిల్లో సాధారణ పరిపాలనను పూర్తిగా ప్రజల భాషలోకి తేలేకపోవడం ఇప్పటివరకు రాష్ట్రాన్ని ఏలిన, ఏలుతున్న ప్రభుత్వాల, నేతల పట్టనితనానికి నిదర్శనం అని అరసం రాష్ట్ర మహాసభ తీర్మానిస్తున్నది. ముఖ్యమంత్రి స్థాయిలో రాజకీయ సంకల్పంతోనే ఇది సాధ్యపడుతుందని, ప్రజల భాషలో పాలనను ప్రజల హక్కుగా, ప్రభుత్వాల బాధ్యతగా గుర్తించాలని పాలక వర్గాలను హెచ్చరిస్తూ ఈ సభ తీర్మానిస్తున్నది.

3. ఏళ్ళ తరబడీ భాషోద్యమ సంఘాలు, విద్యార్థి ఉపాధ్యాయ సంఘాలు, రచయితల వేదికలు చేసిన ఉద్యమాల ఫలితంగా 'ఆంప్ర తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ఏర్పాటుకై జి.ఒ.ను ఇచ్చి నెలలు గడచిపోతున్నాయి. కాని ఇంతవరకు దాని పాలక వర్గాన్ని ఏర్పరచకపోవడం ఆశ్చర్యంగా ఉంది. వెంటనే ఈ విషయమై తగు చర్యలు గైకొని నిపుణులతో సమర్థులతో ఈ సంస్థను ఏర్పాటు చెయ్యాలని ప్రభుత్వాన్ని కోరుతూ అరసం రాష్ట్ర మహాసభ తీర్మానించింది.



కర్నూలు జిల్లా నవ్యాంధ్ర రాష్ట్ర సమావేశం (నరసం)



నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సమావేశం (నరసం), కర్నూలు శాఖ ప్రారంభ సమావేశం సర్వాంగ సుందరంగా, సాహిత్య ప్రయోజనానుసరణంగా జరిగింది. 08-12-2018 న సిల్వర్ జూబ్లీ కళాశాల, తెలుగు భాషా వికాస ఉద్యమ సంస్థల సౌజన్యంతో ఏర్పాటు చేయబడ్డ ఈ సదస్సు శతాధిక కందనవోలు రచయిత్రుల సమ్మేళనానికి వేదిక అయింది. వందలాది మహిళలకు, విద్యార్థినులకు స్ఫూర్తినిచ్చింది. కా.వెం. సుబ్బలక్ష్మిగారు అధ్యక్షులుగా, ప్రధాన కార్య దర్శిగా డా. దండెబోయిన పార్వతీదేవిల కమిటి ఈ సదస్సును సమన్వయించారు.

కలం పట్టి కాస్త నేనూ ఈ సమాజం కోసం ఏదైనా వ్రాయాలి అన్న ఆసక్తి ఉన్న రచయిత్రులు మొదలుకొని, కలం తిరిగిన, గొప్ప సంకల్పంతో ఘనతగా వ్రాస్తున్న రచయిత్రుల దాకా సదస్సుకు రావడం సదస్సు ఆశయాన్ని ఫలవంతం చేసింది. అందరూ పరస్పరం రచనోద్దేశ్యాన్ని, తమ రచనా బాధ్యతలను, చిక్కని రచనల సృజనాశక్తిని గురించి చర్చించటం జరిగింది. తొలి తెలుగు కవయిత్రి తాళ్లపాక తిమ్మక్క వేదిక, మొల్ల మల్లెల లోగిలి, మాతృశ్రీ తరిగొండ వెంగ మాంబ ముత్యాల ప్రాంగణం, అనే వేదికల పేర సాహిత్య ప్రసం గాలు, కవితాగానం జరగటం ఈ సభలో విశేషం. మొదట మహిళ తనకు తాను చైతన్యవంతురాలు కావాలి. తానున్న సమాజానికి ఎలాంటి రచనలు చేసి ఉద్దీపనను తేగలనన్నది గమనించాలి. సమాజానికి దిశా నిర్దేశాన్ని ఇవ్వగల రచనలను బాధ్యతగా వ్రాయాలి. తద్వారా తనను తాను నిలబెట్టుకోవాలి. సమాజాన్ని ప్రత్యేకించి మహిళా సమాజాన్ని ముందుకు నడిపించాలి. ఇవే ప్రధానాంశాలుగా ఈ వేదిక ప్రస్తావించటం ద్వారా రచయిత్రుల కర్తవ్యాన్ని బలపరచి నట్లయింది.

రచయిత్రులతోపాటు కర్నూలు జిల్లాలోని ప్రసిద్ధ మహిళా మణులు సదస్సుకు హాజరయ్యారు. శ్రీమతి బుట్టా రేణుకగారు, యం.పి., శాసన సభ్యులు శ్రీమతి గౌరు చరితారెడ్డి, శ్రీమతి విజయమ్మ మోహనరెడ్డి, జిల్లా కలెక్టరుగారి శ్రీమతి స్వర్ణ శ్రీ సత్యనారాయణ, శ్రీమతి నగరూరు శమంతకమణి, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్, స్వామిని సుప్రేమానంద (చిన్మయమిషన్), ఐద్వా నాయకురాలు శ్రీమతి నిర్మల, రాష్ట్ర నరసం ఛైర్ పర్సన్ శ్రీమతి తేళ్ళ అరుణగారు. అధ్యక్షులు డా. చిన్నలక్ష్మి కళావతి, కార్యదర్శి డా. పాతూరి అన్నపూర్ణ మున్నగువారు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కర్నూలు జిల్లా రచయిత్రుల దర్శిని, శ్రీమతి వరలక్ష్మమ్మగారు, శ్రీమతి భ్రమరాంబగారు, శ్రీమతి పార్వతీదేవి గార్ల రచనలను ఆవిష్కరించటం జరిగింది. దర్శినిలో చక్కిలం విజయలక్ష్మిగారు, నంది వెలుగు ముక్తేశ్వరరావు రిటైర్డ్ కలెక్టరుగారు, శ్రీ జెయస్ఆర్‌కె శర్మగార్ల అభిప్రాయాలు ఎంతో విలువైనవి.



Unfiled Notes Page 44

పుస్తక సమీక్ష

మహిళా సాహిత్యంలో ఒక మణిపూస 'మహిళ'



మహిళ
రచన : బి.హనుమారెడ్డి, న్యాయవాది
పుటలు: 196
వెల: రు.100/-
ప్రతులకు: అన్ని విశాలాంధ్ర బుక్ హౌసులు

బోదకాలున్న వ్యక్తి ఇది నా కాలు కాదంటే ఎలా కుదరదో, అలాగే ఈ వ్యవస్థ తాలూకు రుగ్మతలు మనవి కాదంటే కుదరదు. విచికిత్సలు, చికిత్సలు అవసరమయితే ఆపరేషన్లూ సమాజ ఆరోగ్యానికి అవసరం.

మహిళా సమస్యలపై స్త్రీ పురుషులు విచికిత్సలు చేసుకోవడానికి బి.హనుమారెడ్డిగారి 'మహిళ' గ్రంథం ఎంతో ప్రయోజనకరం. వెన్నెల పువ్వు, పల్లెకు దండం పెడతా, మావూరు మొలకెత్తింది, గుజ్జన గూళ్ళు, వీక్షణం, వెన్నెలగీతం, పావని-కవితా సంపుటాల ద్వారా కవి ప్రఖ్యాతిని పడసిన సాహిత్య న్యాయవాది - బి.హనుమారెడ్డి రాజ్యాంగాన్ని, వివిధ చట్టాలను వాని మంచి చెడ్డలను, కావలసిన సంస్కరణలను బాగా అధ్యయనం చేసినవారు. ఇటీవల 'అంతర్వాహిని' పేర తన కథను రాసి తమ జీవన తరంగాలను మనకు తెలిపారు.

మహిళాసాధికారత, స్వావలంబన ఉద్యమరూపం చెందాయి. ఈ సందర్భంలో మహిళ మనముందు నిలబడింది. హక్కుల మధ్య ఘర్షణలు తలెత్తిన సందర్భంలో ఒక దీర్ఘవ్యాసంగా ఈ గ్రంథోదయమైంది.

కాల క్రమంలో స్త్రీపురుషుల పుట్టుకలు, ప్రాచీన హిందూ సమాజంలో, ప్రాచీన కావ్యేతిహాసాల్లో మహిళా చిత్రీకరణలు, మానవ హక్కుల రక్షణలో మహిళ పాత్ర, స్వీయ రక్షణకు స్త్రీ పాత్ర, మహిళోద్యమాల తీరుతెన్నులు వంటి అనేకాంశాల సంబంధిత ఆలోచనలు, చర్చలు, ఆశంసలు ఈ పుస్తకంలో పరచుకుని అంతటా వున్నై. మనుస్మృతి, బైబిల్, ఖురాను వంటి గ్రంథాల్లో స్త్రీ పురుషుల పుట్టుకలు ఎలా వచ్చాయని చెప్పారో చెప్పారు.

"కొన్ని సమయ సందర్భ జ్ఞానాంశాల్ని హనుమారెడ్డిగారు అక్కడక్కడ ఇవ్వడం ఆయన అధ్యయన దర్పణాలయ్యాయి.

కొన్ని శ్లోకాల భావ వ్యతిరేకతను వాస్తవ దృష్టితో చూడాలని వాటికెలాగైనా కాలదోషం పట్టిందని అవే శాసనాలు కావని మెత్తగా చెబుతారు.

శ్రీరాముడు క్రీ.పూ 10-1-5114 వ తేదీన జన్మించాడు. ఆయన వనవాసానికి క్రీ.పూ. 5-1-5089 న వెళ్ళాడు. హనుమంతుడు సీతను లంకలో క్రీ.పూ. 12-9-5076 వ తేదీన దర్శించాడు. రావణాసురుడు క్రీ.పూ. 4-12-5076వ తేదీన మరణించాడు- వంటి అంశాలు ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైంటిఫిక్ రీసెర్చి ఇన్ వేదాస్ పరిశోధనలను ఈ గ్రంథంలో సమయ సందర్భాల్లో ఇచ్చారు.

ఒక రకంగా ఈ దీర్ఘ వ్యాసంగా చెప్పబడినప్పటికీ ఇది చక్కని ఆకర్షణీయ ఉపన్యాస శైలిలో సాగింది.

ద్రౌపది మై ఛోయిస్ మై వోయిస్‌గా కాక పాండవులతో అవర్ ఛోయిస్ అవర్ వోయిస్‌గా భారతంలో మేటి మహిళగా నిలిచిందంటారు.

పెళ్ళి పుట్టు పూర్వోత్తరాలు గ్రంథంలో తాతాజీ తన భావాలు, లోకాచారాలు ఎలా చెప్పారో వీరు మళ్ళీ చెప్పారు. అవి ఆలోచనలకు అవసరాలు కూడా.

రచయిత న్యాయవాది అవడం చేత విడాకులు - మనోవర్తి వంటి అంశాల్లో సాధికార చర్చ చేశారు.

'వ్యతిరేకత కొరకు వ్యతిరేకత' లా కాక కుటుంబ వ్యవస్థను రక్షించుకుంటూ భార్యాభర్తలు సహజీవనం చేయడం అవసరమంటారు. శతాబ్దాల చారిత్రక పరిణామ అంశాల్ని పూసగుచ్చినట్లు చెబుతూ ఆధునిక కాలంలో గురజాడ కన్యాశుల్క రచనకు చేసిన అధ్యయనపు లోతుల్ని చెప్పడం ప్రశంసనీయం. రచయిత వాస్తవ దృష్టికి "అన్ని సందర్భాలలోనూ చట్టాల వలన జీవితాలు బాగుపడతాయనుకోలేము. వాస్తవాలను గమనిస్తే న్యాయం కోసం పోలీసు స్టేషనునుగాని, న్యాయస్థానాన్నిగాని ఆశ్రయించిన మహిళ గౌరవంగా కుటుంబ జీవితంలోకి తిరిగి రావటం లేదు...సమాజపు భావ జాలాన్ని మార్చే ప్రయత్నాలు జరగాలి. పురుషులూ స్త్రీలూ తీవ్రతలు లేని చేతనావస్థను పొందాలి" వంటి వాక్యాలు నిలబడతాయి.

ఉదార, తీవ్ర, వికాస సామాజిక వాదాల స్త్రీ స్వేచ్ఛా వాదాల్ని గురించి రాస్తున్న సందర్భంలో మహిళా సాధికారత అంటే స్వేచ్ఛా ప్రవర్తనగానే కొందరు మహిళలు ఆవేశంగా ప్రకటిస్తున్నారంటారు.

'మహిళ - మానవ హక్కుల రక్షణ' లో వర్తమానానికి ఉపయోగపడే అంశాలు ఎన్నో ఉన్నాయి.

వైజ్ఞానిక సమాచారాన్ని రచనగా చేయడం నిజానికి ఓ కళ. హనుమారెడ్డిగారు మంచి కళాకారులు. మానసిక పరివర్తన భార్యాభర్తల్లో సమానంగా రాకపోతే కేవల చట్టాల వర్తింపులు ఉపయోగపడవంటారు.


కట్టమంచి రామలింగారెడ్డి ముసలమ్మ మరణం, విశ్వనాథ కిన్నెరసాని పాటలు కావ్యాల్లో ముసలమ్మ, కిన్నెరసాని పాత్రలను సాహిత్యంలో స్త్రీ ప్రకరణంలో క్రొత్త అన్వయాలతో అభివర్ణించారు.

పరిణామ దర్శనం, వర్తమాన భావనం, వాస్తవిక అంశాలతో ఈ గ్రంథం మహిళా సాహిత్యంలో మణిపూసగా భాసిస్తోంది.

సన్నిధానంనరసింహశర్మ
9292055531

పుస్తక సమీక్ష

అసిపాళీ అరుణకేళి 'అశోక నివాళి'



అశోక నివాళి (1,2 భాగాలు)
రచయిత: సింగంపల్లి అశోక్‌కుమార్(అసి)
వెల: రు.100/- (ఒక్కొక్కటి)
ప్రతులకు : 'ఆలోచన' మారుతీనగర్, విజయవాడ - 4
సెల్ : 9246277375

అమరులైన సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ, సామాజిక ఉద్యమకారులను గురించి, వారి సాహిత్య రాగాల, జీవిత త్యాగాల పరిచయాలని రెండు సంపుటాలుగా 'ఆలోచన' విజయవాడ వారు మన ముందుకు తీసుకొని వచ్చారు. శ్రీశ్రీనిధి హోలికుడు, కవి జన్మకి తల్లిగా 'మహాప్రస్థానం', తాతయ్యగా శ్రీశ్రీని భావించే సింగంపల్లి అశోక్‌కుమార్, సాహిత్య బడిలో బలపాల బాలకుడిని అంటూనే రెండుభాగాలలో కలిపి నూరుమందికి 'అక్షరాస్త్ర నివాళి'ని అర్పించారు. 2007 సం॥ నుండీ 'శ్రీశ్రీ బులెటిన్' పేరున త్రైమాసిక కర పత్రాలకు సంపాదకత్వం, 90 పైగా శ్రీశ్రీ సాహిత్యనిధి ప్రచురణల కూర్పు చేసి ప్రశంసలను అందుకున్నారు అసి. 2005వ సం॥లో ప్రారంభమై చినుకు, వార్త, అరుణతార, విశాలాంధ్ర, ప్రజాశక్తి వంటి పత్రికలలో ఈ నివాళులు ప్రచురింపబడుతూ వచ్చాయి.

అశోక నివాళి మొదటి భాగంలో కందుకూరి వీరేశలింగం (1848) తో ప్రారంభం అయి షేక్ నాజర్‌వలి(1920) తో ముగిసి, ఆమధ్య కాలంలో మన తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన; సామాజిక ఉద్యమకారులు, ఇతర 50 మంది ప్రముఖుల అక్షర చిత్రాలు ఉన్నాయి. చివరలో పాద సూచికలు ఇవ్వబడ్డాయి. ఆ విధంగానే రెండవ భాగంలో రాంభట్లకృష్ణమూర్తి(1920)తో ప్రారంభం అయి యాదాటి కాశీపతి(1944) వంటి విశిష్ట వ్యక్తులు 50 మందిని గురించిన అక్షర చిత్రాలున్నాయి. చివర పాద సూచికలు ఉన్నాయి. వెరసి రెండు భాగాలలోను నూరు(50+50) వ్యాసాలు కుంజర యోధమ్ము దోమ కుత్తుక జొచ్చెన్' అన్నట్లుగా చక్కటి శైలిలో క్లుప్తత, కచ్చితత్వం(ప్రెసిషన్) తోను చట్రంలో బిగించినట్లు అమర్చారు. ఒకే నిడివితో, చాల ప్రణాళికాబద్ధంగా, అందంగా అక్షరాలను అన్ని వ్యాసాలను ఒకే పరిమాణంతో గ్రాపు గళ్లలో కొలిచి గీసినట్లుగా ముచ్చటగా ముద్రింపబడటం ఈ పుస్తకాలకు ప్రత్యేక ఆకర్షణ.

ఇక ప్రతీ వ్యాసంలోను ఒకే పంథాను అనుసరించారు రచయిత. వారి మాటల్లోనే చెప్పాలంటే -

1) నివాళి చెప్పే యోధుడి లక్షణాన్ని, లక్ష్యాన్ని నాలుగు పాదాల 'రుబాయి'గా చెప్పటం, 2) ఆ యోధుడి సందేశాన్ని వ్యాసానికి ప్రధాన శీర్షికగా చేయటం., 3) వ్యాసం అంతా ఆ యోధుని జీవిత, సాహిత్య విశ్లేషణ. 4) ఆ విశిష్ట వ్యక్తి గురించి మరొక ప్రముఖ వ్యక్తి చేసిన ప్రశంసను జోడించటం. 5) సాహితీ వేత్త లేక ఆ యోధుని జనన మరణ వివరాలతో నివాళి రచన ముగించటం.

ఈ రెండు భాగాలలోను యింకా ముచ్చట గొలిపే అంశాలు కొన్ని ఉన్నాయి - మొదటి, చివరి కవర్ పేజీలపై అందులో పేర్కొన్న 50 మంది ప్రముఖుల చిన్న ఛాయా చిత్రాలున్నాయి. రెండవది - రెండు భాగాలలోను 60 చొ॥న పాద సూచికలు ; యింకా ప్రముఖంగా ఆ పాద సూచికలలో పేర్కొనబడిన వ్యక్తుల 60 చొ॥న ఛాయా చిత్రాలు కూర్చారు. ఈ విధంగా ఒక్కొక్క భాగంలో 110 చొ॥న ప్రముఖుల (వ్యాసంలోని యోధుడు మరియు పాద సూచికలలో పేర్కొన్న వారివి) చిన్న ఛాయా చిత్రాలు చాలా అరుదైన, ఆసక్తిని కలిగించే రీతిలో ప్రచురించారు.

ఇంకొక విశేషం ఏమంటే యీ రెండు భాగాలలోను నూరుమంది వ్యాసాలను వారు పుట్టిన రోజు క్రమంలో నివాళి క్రమం చేయబడింది. "అసిపాళీ అరుణకేళి అశోక నివాళి" అన్నది అద్దేపల్లి రామమోహనరావు చేసిన కామెంట్, ఈ విధంగా చాల ఆసక్తికరంగా సాహితీవేత్తలు, సామాజిక ఉద్యమకారుల సంక్షిప్త జీవితం, సాహిత్య, ఉద్యమ చరిత్రలను అందించడంలో రచయిత కృషి ప్రశంసనీయం. ముందుముందు మరికొన్ని భాగాలు వెలువరిస్తానని రచయిత చెప్పటం స్వాగతించదగినది. ఇందరు విశిష్ట వ్యక్తుల గురించిన సమాచారం ఒకచోట అందించిన ఈ పుస్తకాలు విద్యా సంస్థలలోను, గ్రంథాలయాలలోను ఉండదగినవి. విద్యార్థులకు, సాహిత్యాభిమానులకు చాల ఉపయోగకరం.

కావ్యేషు నాటకం రమ్యమ్ (వ్యాసాలు సమీక్షలు)



కావ్యేషు నాటకం రమ్యమ్ (వ్యాసాలు సమీక్షలు)
రచయిత:సుంకర కోటేశ్వరరావు
వెల: రు.150/-, పుటలు : 264
ప్రతులకు:రచయిత, డోర్ నెం. 3-33-68, 4వ వీధి,ఎన్జీఓ కాలనీ, నరసరావుపేట, గుంటూరు సెల్ : 9948023464

నాటకరంగం, నాటక కళ, నాటక సాహిత్యం గురించిన అంశాలపై పాఠకులకు సమగ్రమైన అవగాహన కల్పించే వ్యాసాల సంకలనం ఇది. దర్శకుడు, నటుడు, ప్రయోక్త, పరిషత్ నాటక పోటీలకు న్యాయ నిర్ణేత, చిత్రకారుడు, 50 సం॥లకు పైగా నాటక రంగంలో సుదీర్ఘమైన అనుభవంతో అపారమైన కృషి, అధ్యయనం రంగరించి, ఒక సిద్ధాంత వ్యాసమా అనిపించేలా మన ముందుంచారు, రచయిత కోటేశ్వరరావు.

నాటక సాహిత్యంపై ఈ మధ్య కాలంలో విరివిగా కాక

పోయినా అడపాదడపా రచనలు వస్తున్నాయి. 'యవనిక'(డా॥పెద్ది రామారావు), 'భూమి(డా॥ కందిమళ్ళ సాంబశివరావు), మీకు యిదిగో యిప్పుడు 'కావ్యేషు నాటకం రమ్యమ్'. అనేకానేక గ్రంథాలు, రచయితల చరిత్రలు పరిశీలించి క్రోడీకరంచిన ఈ సమాచారం నాటకరంగ ప్రియులకే కాక, సాహిత్యాభిమానులకు కూడ విలువైన విషయ సంపదను అందించే ప్రయత్నం జరిగింది. 1980 తర్వాత వివిధ దిన, మాసపత్రికలలో ప్రచురింపబడ్డాయి. ఆధునిక తెలుగు నాటకరంగం-సాహిత్య స్రష్టలు- నాటకాలు -నటులు- ప్రయోక్తలు, నాటకరంగ వికాసం మొ॥ విషయాలపై చాల విస్తృతంగా విషయ సేకరణ చేసి ఒకచోట ఉంచారు రచయిత. సంస్కృత నాటక సాహిత్యంపై వారి వివరణ, విశ్లేషణలు అనుభవసారం - 'సంస్కృత నాటక రచనా సంస్కృతి', 'భాషా సురమ్యాగైర్వాణీ... తత్ర భాసకవేః కృతిః"అనే వ్యాసాల్లో కనిపిస్తుంది. ఇక, 'చారుదత్తం' నుండి వెలువడిన వసంత కోకిల 'మృచ్ఛకటికం' వ్యాసం - విషయంలోను వివరణల లోను కూడా అభినందించదగిన - కృషి చేశారు. భాసుడు, కాళిదాసు, భవభూతి, శ్రీ హర్షుడు, శూద్రకుడు తదితర ప్రముఖ సంస్కృత నాటక కర్తల నాటకాలపై, వాటి తీరు తెన్నులను సమీక్ష చేసిన తీరు చూసినపుడు రచయిత చరిత్రకారునిగా మనకు దర్శన మిస్తాడు.

తెలుగు నాటక పరిణామంలో తొలి ఘటనలన్నింటినీ నమోదు చేయడం ద్వారా తన వ్యాసాలను ప్రారంభించిన రచయిత, తరువాతి వ్యాసాలలో ఆధునిక తెలుగు నాటక రంగం ఎదగాల్సినంత ఎత్తుకు ఎదగ లేదన్న ఆవేదన, అందరూ సమష్టి కృషితో చర్చలు, సదస్సులు జరిగి మరింతగా సాహిత్యం వెలువడితే ఈ పరిస్థితులను అధిగమించవచ్చనే ఆశ ద్యోతకమౌతుంది. ఇంకొక ఆసక్తికరమైన సమీక్షా వ్యాసం - విశ్వనాథవారి 'వేనరాజు' నాటకం త్రిపురనేని వారి 'ఖూనీ' నాటకం గురించిన తులనాత్మక పరిశీలన ; పౌరుష ప్రతాప నిలయాలకు నిలయమైన 'పల్నాటి యుద్ధం' - దాని గురించిన విశేషాలు, దానితోపాటు 'నాయుడు - నాయకురాలు' పరిశోధనాత్మక పద్య నాటకం కోసం తాను రాసిన పీఠికను ఈ సంకలనంలో చేర్చారు. చివరగా తాను స్థిరపడిన నరసరావుపేటలో సాంఘిక నాటకం వికాసం గురించిన వివరాలు (2011 వరకు) జోడించారు. మొత్తం మీద ఈ సంకలనంలోని 13 అధ్యాయాలలో నాటక కళ గురించిన విశ్లేషణా పూర్వకమైన విషయ సంపదను చదువరులకు ఆసక్తికలిగించేలా తన నాటక పరిజ్ఞానాన్ని అనుభవాన్ని, నిరంతర కృషిని అధ్యయనాలని చక్కటి భాషలో, సులభమైన శైలిలో వ్యక్తీకరించిన పుస్తకం యిది. ఇందులో రచయిత - నాటకరంగం యొక్క విశిష్ట లక్షణం 'ప్రజా చైతన్యం' అన్న స్పృహ కలిగినవాడుగా, నాటకం మరింతగా ప్రజా ప్రయోజనాలను సాధించే దిశగా చేయవలసిన ప్రయత్నాలను, సూచనలను ఎంతో నిబద్ధతతో వివరించారు. ఈ పుస్తకం పాఠకులకు నాటక రంగంపై సమగ్ర అవగాహన కలిగించే కరదీపిక. ఈ రచనకు 2017 సం॥నకు రాష్ట్ర ప్రభుత్వ నంది నాటకోత్సవాలలో 'ఉత్తమ రంగస్థల సాహిత్యం నంది బహుమతితోపాటు రు. 35,000/- నగదు లభించింది.

రైతు బాంధవుడు ఆచార్య ఎన్.జి.రంగాగారి తెలుగు రచనల సమీక్ష-జీవన దృశ్యమాలిక



సంపాదకులు : అన్నె సాంబశివరావు
వెల: సాదాప్రతి రు.200/-
మేలుప్రతి రు. 400/-
ప్రతులకు: కృషికార్ సేవాసమితి
గుంటూరు
సెల్ : 74166 17788

ఆచార్య ఎన్.జి. రంగా ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు. రైతు ప్రయోజనాల కోసం, గ్రామీణ పేదలకు, రైతు కూలీలకు, వ్యవసాయ కార్మికులకు, చేనేత పని వారికి మేలు జరగాలని వారి హక్కుల కోసం పోరాటాలు చేసి రైతు జనబాంధవుడిగా ప్రఖ్యాతి గాంచిన విషయం తెలిసినదే. 60 సం॥ పైగా పార్లమెంటరీ సభ్యత్వం, 'సహకార సేద్యాన్ని' వ్యతిరేకించి నెహ్రూ ప్రతిపాదించిన 17వ రాజ్యాంగ సవరణ బిల్లు పార్లమెంటులో నెగ్గకుండా తీవ్ర పోరాటం చేశారు. చివరకు కాంగ్రెసు పార్టీని విడనాడి 1959 లో స్వతంత్ర పార్టీ స్థాపించి, తరువాత మళ్లీ మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన గరీబీ హటావో, 20 సూత్రాల పథకాల వలన రైతు ప్రయోజనాలు నెరవేరతాయనే ఉద్దేశ్యంతో మరల 1971లో కాంగ్రెసులో చేరటం, తన చివరి శ్వాస వరకు "కిసాన్ - మజ్దూర్ - ప్రజా - రాజ్" రావాలని ప్రగాఢంగా ప్రయత్నించిన భారతీయ కర్షక ఆత్మ - రంగా.

ఇవన్నీ ఒక ఎత్తయితే రంగా గారిలో మరియొక్క విశిష్టత - వారి గ్రంథ రచనా సామర్థ్యం. రంగా కలం నుండి విస్తృతంగా సుమారు 66 గ్రంథాలు వెలువడ్డాయి. ఇందులో ఎక్కువభాగం ఆంగ్లంలో, తక్కినవి తెలుగులో ఉన్నాయి. రంగా ఆంగ్ల గ్రంథాలను చాల వరకు వారి భక్తులు, అనుయాయులు తెలుగులోకి అనువదించారు. వారి ఆత్మకథ 'ఫైట్ ఫర్ ఫ్రీడమ్'(1968) ఆంగ్ల మూలానికే 05 తెలుగు అనువాదాలు ప్రచురితమయ్యాయి. ప్రపంచ ఆర్థిక సాంఘిక విషయాలతోపాటుగా రంగా, తాను ప్రతిపాదించిన, నమ్మిన సిద్ధాంతాలు విధానాలకు ఊతమిచ్చేలా రచనలు చేశారు.

ఇప్పుడు కృషికార్ సేవా నమితి, గుంటూరు - అన్నె సాంబశివరావు సంపాదకత్వంలో రంగా 'తెలుగు రచనల సమీక్ష

– జీవన దృశ్యమాలిక' పేరున రంగాజీకి నివాళిగా ఈ చిన్న పుస్తకాన్ని ప్రచురించారు. రంగా తెలుగు రచనలు పదింటిపై యిందులో సమీక్షా వ్యాసాలున్నాయి. 'హరిజన నాయకుడు' (నవల), ఆధునిక రాజ్యాంగ సంస్థలు

పై సమీక్షలకు అనుబంధంగా 52 పేజీలతో, రంగా వివిధ ప్రముఖులతో, కార్యక్రమాలలో 1931 నుండి 1991 వరకు పాల్గొన్న అపురూప ఛాయా చిత్రాలు ఉన్నాయి. ఆ విధంగానే 1931 నుండి రంగా గురించి ప్రచురింపబడిన వార్తా పత్రికల కత్తిరింపులు 'నాటి పత్రికలలో రంగా' అన్న శీర్షికలో ప్రచురించారు.

చివరగా రంగాగారి అనుంగు శిష్యుడు, ప్రజాబంధు, స్వాతంత్ర్య సమరయోధుడు అన్నే సూర్యనారాయణగారి జీవిత విశేషాలు, వారు వ్యవసాయ రంగంలోను, నీటిపారుదల, ప్రాజెక్టుల విషయమై, తెనాలి తాలూకా గ్రామాలలో విద్యుచ్ఛక్తి సరఫరా కోసం చేసిన కృషి; రంగాగారితో కలిసి పాల్గొన్న ఉద్యమాల వివరాలను జోడించారు.

రంగా అభిమానులకు, రంగా గురించి విని తెలుసుకోవాలని ఉత్సుకత కలిగిన వారికి ఈ చిన్న పుస్తకం కొంత సమాచారాన్ని ఇవ్వగలుగుతుంది. రంగా అపురూప చిత్రాలను, తెలుగు రచనలపై వచ్చిన సమీక్షలను అందుబాటులోకి తెచ్చిన సంపాదకులు అన్నే సాంబశివరావు కృషి అభినందనీయం.

ఎమ్.వి.శాస్త్రి
9441342999

అరచేతిలో అర్థాలు (త్రిభాషా నిఘంటువు)

తెలుగులోని సుమారు 15,000 పదాలకు సమానార్థకాలని ఆంగ్లభాషలోను, హిందీ భాషలోను అరచేతిలోని చరవాణిలో (మొబైల్) మన ముందుంచే ఆండ్రాయిడ్ యాప్ ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. ఆంగ్ల పదాల వరకు, ఉచ్చారణ సౌకర్యం మాత్రం ప్రస్తుతం అందుబాటులో ఉంది.

గూగుల్ ప్లే స్టోర్ లోకి వెళ్ళి "త్రిభాషా నిఘంటువు" అని టైపు చేస్తే త్రిభాషా నిఘంటువు తెరుచుకుంటుంది. దానిని ప్రవేశపెట్టు కుంటే (ఇన్‌స్టాల్ చేసుకోవాలి) తెలుగు పదాలకు ఆంగ్ల, హిందీ భాషలలో అర్థాలు అలవోకగా మనం చూసుకునే వీలుంది.

'ఈ సౌకర్యాన్ని' 'ఆండ్రాయిడ్ యాప్' ను పెద్ది సాంబశివరావు (గుంటూరు) రూపకల్పన చేశారు. వీరి ప్రధాన సంపాదకత్వంలో ఇప్పటి వరకు 50 నిఘంటువులు (ద్వి, త్రిభాషా) వెలువడ్డాయి. వైద్య, ఆరోగ్య శాఖలో అధికారిగా పదవీ విరమణ చేసి 75 సం॥ల వయసులో తెలుగు భాషకు, సంస్కృతికి వీరు చేస్తున్న కృషి అభినందనీయం. ఫణికిరణ్ సమకూర్చిన సాంకేతిక సహకారంతో యీ యాప్‌కు రూపకల్పన చేశారు.

ప్రకృతి వ్యవసాయ గీత రచనలకు ఆహ్వానం

రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకంతో...భూతాపం పెరిగి, పర్యావరణ సమతౌల్యం దెబ్బతిని చివరకు మానవాళి మనుగడే నేడు ప్రశ్నార్థకమయ్యింది. అటువంటి విషమ పరిస్థితి నుండి గట్టెక్కేందుకు గోచరించిన ఒకే ఒక్క మార్గం ప్రకృతి వ్యవసాయం. అటువంటి ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత తెలుపుతూ సాగే ప్రకృతి వ్యవసాయ గీతాల రచనలకు జట్టు ట్రస్టు ఆహ్వానం పలుకుతోంది ఆంధ్రా, తెలంగాణా ఇరు తెలుగు రాష్ట్రాలకు చెందిన కవులు, రచయితల నుండి ప్రకృతి వ్యవసాయ గీతాల రచనలను ఆహ్వానిస్తోంది.

విషయం :

నేడున్న పరిస్థితిలో ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత. భూ తాపం తగ్గించుట. గాలిలో ఉన్న కర్బనాన్ని భూమిలోకి పంపించి పుడమితల్లి వేడిని తగ్గించుట. రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకంతో ముసురుతున్న బి.పి., షుగర్, కేన్సర్‌లాంటి రోగాలు నివారించేందుకు ప్రకృతి వ్యవసాయం ఎలా దోహదపడుతుంది. హైబ్రీడ్ విత్తనాల కంటే, మన సాంప్రదాయ నాటు విత్తనాలు మన ఆరోగ్యానికి, నేలకు ఎలా మేలు చేస్తాయి. ప్రకృతి గొప్పదనం, పంచభూతాల గొప్పతనం, వాటికి కీడు చేస్తున్న మానవుడికి వస్తున్న ప్రకృతి విపత్తులు, విలయాలను ఎలా అడ్డుకోవడం అనే అంశాలపై ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన కవులు, రచయితలు 2019, జనవరి 22 వ తేదీ లోగా తమ రచనలను పంపించాలి. 9440164289, 9494012244 (వాట్సాప్), లేదా... పంపించాలి.

బహుమతులు :

విజేతలైన రచనలకు ప్రథమ బహుమతి రూ.10,000లు, ద్వితీయ బహుమతి రూ. 5,000లు, తృతీయ బహుమతి రూ.5,000లతో పాటు, అంగీకరించిన మరో 10 రచనలకు రూ. 1,000లు చొప్పున బహుమతులు ఇవ్వడం జరుగుతుంది.

ఆఖరు తేదీ : రచనలను 22, జనవరి 2019 లోగా పంపించాలి.

ఇట్లు

డా.డి.పారినాయుడు, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ, జట్టు ట్రస్ట్, తోటపల్లి గరుగుబిల్లి మండలం, విజయనగరం జిల్లా.

అమ్మనుడిపై నెనరు లేనివాడు
కన్నతల్లినీ, పుట్టిన నేలనీ
ప్రేమించలేడు..

ఆలోచించండి

అమ్మా..!- అని పిలిస్తే.. వినడానికీ.. కమ్మగా ఉంటుంది. - మమ్మీ.. డాడీ..- అని పిలిచినా.. కొందరికి సరదాగానే ఉంటుంది. కానీ, ఆ పిలుపులు శాశ్వతమైతేనే ప్రమాదం. ఎందుకంటే.. ఇంగ్లీషు మోజులోపడి అమ్మలాంటి మాతృభాషకు దూరం కావొచ్చు. దూరమవ్వడమేకాదు.. నిజానికి మన పిల్లల చదువులూ ఇంగ్లీషు బడుల బడుల్లో.. అయోమయానికి గురువుతున్నాయనేది వాస్తవం. ఇది ఎవరో అన్నమాట కాదు...బ్రిటన్‌లోని రీడింగ్‌వర్సిటీ పరిశోధకులు అంటున్నమాట. ఈ బృందం.. చిరుప్రాయపు దశలో ఇంగ్లీషు బడుల్లో చదువులు అనే అంశంపై ఢిల్లీ, హైదరాబాద్‌ల్లోని ప్రాథమిక పాఠశాలలపై నాలుగేళ్లపాటు పరిశోధనలు చేసింది. ఆ పరిశోధనలో-భారత్‌లోని విద్యార్థులకు చిన్న వయస్సులోనే ఇంగ్లీషు మీడియంలో విద్య ప్రయోజనాన్ని చేకూర్చడంలేదు- అని స్పష్టం చేసింది. ఇదే విషయంపై కేంబ్రిడ్జీ వర్సిటీ పరిశోధకురాలు లాంఢీ సింప్లీ...- పిల్లలు వారి మాతృభాషలోనే విద్యాభ్యాసం మొదలుపెట్టాలి. అప్పుడే వారి చదువు మరింత మెరుగ్గా సాగుతుంది-అని పేర్కొన్నారు. ఇలా మాతృభాషే ముఖ్యమని నిపుణులు చెబుతున్న తరుణంలో నేటి పిల్లల చదువుల గురించి తల్లిదండ్రులు దృష్టి పెట్టాల్సిన కొన్ని అంశాల గురించి :

గవర్నమెంటు బడులు.. అనే మాట దాదాపు అంతా మర్చిపోతున్నారు. పల్లెపల్లెనా..అపార్ట్‌మెంట్ సంస్కృతిలానే ఇంగ్లీషు కాన్వెంట్లూ వీధివీధిన విస్తరించి.. సర్కారుబడుల ప్రస్తావనే లేకుండా పోయింది. ఈ క్రమంలో మాతృభాషలూ చివరి బెంచిలో కూర్చున్న కుర్రాడిలా బిక్కుబిక్కుమంటున్నాయి. పిల్లల తల్లిదండ్రులూ ఇంగ్లీషు బడులవైపే మొగ్గు చూపుతున్నారు. ఇలా అమ్మ భాషను పక్కనపెట్టి, ఆంగ్లభాషలో చదువులు ప్రారంభించడంలో లాభాలెలా ఉన్న..నష్టాలూ చాలానే ఉన్నాయనేది పరిశోధకుల మాట. ఎదిగే, చదివే వయసులో మాతృభాషకు పిల్లలు దూరంగా ఉండటంవల్ల కలిగే దుష్ఫలితాలూ అనేకం అనేది వారి మాట.

గొప్పలు.. మెప్పులు :

నేటి తరం పిల్లల చదువుల గురించి తల్లిదదండ్రుల ఆలోచనలు, ఆశలు, వారు చదివే చదువు భవిష్యత్తుకు ఎంతవరకు ఉపయోగపడుతుంది? అన్నది ఆలోచించటం లేదు. మొన్నటివరకు పిల్లల మొదటి మాట అ.. అమ్మా .. ఇప్పుడు వారి మొదటి మాట మమ్మీ. చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలు ఎందులోనూ చుట్టుపక్కల వారికి తీసిపోకూడదని అప్పులు చేసి మరీ చదివిస్తున్నారే కానీ, టీచర్లు ఎలా బోధిస్తారు? విద్యా బోధనలో ఎలాంటి విధానాలు అనుసరిస్తున్నారు? ఇలాంటి ప్రశ్నలను ఎవరూ వేసుకోవటం లేదు. ఫలానా స్కూల్లో మార్కులు బాగా వస్తున్నాయంట!- అంటే చాలు.. తీసుకెళ్లి చేర్పించేస్తున్నారు. అంతేకానీ పిల్లలు పాఠాలు బట్టీ పడుతున్నారా? అర్థం చేసుకుంటున్నారా? అన్న విషయమే పరిగణనలోకి తీసుకోవటం లేదు. ఈ చిన్ని అజాగ్రత్త పిల్లల భవిష్యత్తునూ అనేక రూపాల్లో శాసిస్తుందనేది వాస్తవం.

అమ్మ ఆలన :

చిన్న పిల్లలు తల్లితో ఎక్కువ సమయం గడుపుతారు. తల్లి మాట్లాడే భాషలోనే మాట్లాడతారు.. పాడతారు.. తింటారు.. నిద్రపోతారు.. చూసిన ప్రతి విషయాన్నీ తనకు తెలిసిన, వచ్చిన భాషలో తల్లితోనే మొదటగా సంభాషిస్తారు. అలా మాతృభాషతో బంధం బలపడే సమయానికి తల్లిదండ్రులు పిల్లలను తీసుకెళ్లి, ఇంగ్లీషు మీడియం స్కూల్లో వేసేస్తారు. వారికదో కొత్త ప్రపంచం. ఇంట్లో విన్న భాషకు భిన్నంగా కొత్త మాటలు వినాల్సి ఉంటుంది. ఒకే వస్తువు, ఒకే వ్యక్తీకరణ రెండు భాషల్లో తారట్లాడుతూ ఉంటుంది. ఈ సందిగ్ధంలో మాతృభాష వ్యక్తీకరణ అసలు అలవాటు కాకుండానే పోతుంది. పిల్లలు చక్కగా స్కూల్ యూనిఫారం వేసుకుని, టక్ చేసుకుని, స్కూల్ బ్యాగు తగిలించుకుని, ఎంచక్కా వాళ్ల కోసం వచ్చే స్కూల్ వ్యానులో ఎక్కి వెళుతుంటే తల్లిదండ్రులకు వచ్చే ఆనందం అంతా ఇంతా కాదు.. తామే - వరల్డ్ కప్-గెలిచినంతగా సంబరపడి పోతుంటారు. కానీ, ఆ పిల్లల అవస్థలు పట్టించుకోరు. వారికి చదువు అర్థమవుతుందా? లేదా? అన్నది గమనించుకోరు.

ప్రశ్న వేస్తే.. తప్పా? :

వారి చిన్ని బుర్రలకు తట్టే ప్రశ్నలను టీచర్లను అడిగితే, ఓపిగ్గా సమాధానం చెప్పేవారు కొందరైతే.. అరకొర విద్యార్హతలతో బోధన చేసే కొందరు టీచర్లకు ఎలా సమాధానం చెప్పాలో తెలియక ఆ చిన్ని ప్రశ్నలను మొగ్గ దశలోనే తుంచేస్తుంటారు. దీంతో ఇంటికొచ్చి తల్లిదండ్రులను ప్రశ్నిస్తే, వాళ్లు వారికి సమాధానం చెప్పలేక, ఈ బాధలన్నీ మనకెందుకు అని వీళ్లను తీసుకెళ్లి, ట్యూషన్లలో పడేస్తారు. దాంతో వారి బాధ్యత తీరిపోయింది అనుకుంటారు. దాంతోనే పిల్లల అసలు పాట్లు మొదలు. ఇలా ప్రతి దశలోనూ తెలుగు, ఇంగ్లీషు పోటీ పడుతుంటాయి. కాదు కాదు.. తల్లిదండ్రులు, పిల్లల మనసులు సంఘర్షణ పడుతుంటాయి. కానీ చివరికి నెగ్గేది తల్లిదండ్రులే. నిజం చెప్పాలంటే ఇంగ్లీషు మీడియం చదువులంటే మోజు అందుకు కారణం.- నేర్చుకోవటం అనేది చాలా సహజమైన ప్రక్రియ. ఇంగ్లీషు మీడియం దీన్ని పరాయీకరించి చాలా మొరటుగా, కృత్రిమంగా మారుస్తోంది. దీనివల్ల ఎంత మానవ వికాన విధ్వంసం జరుగుతుందో.. పిల్లలు ఎంత సతమతమై, మొద్దుబారిపోతున్నారో ఎవరూ అధ్యయనం చేయటం లేదు. కేవలం మార్కులు, గ్రేడ్లతోనే పిల్లల చదువులను కొలుస్తున్నారు. మన భావితరం స్వేచ్ఛగా ఆలోచించి, ప్రశ్నించేతత్వాన్ని కాలరాయడానికి పనిగట్టుకుని చేస్తున్న దుర్మార్గం ఇది.

- షేక్ రహ్మానుద్దీన్
9686903386



పయనపు దారుల్లో : యాత్రా సాహిత్యం
రచన : పూదోట శౌరీలు
పుటలు:96, వెల: రు.100/
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్
1-2-740, హనుమాన్ మందిరం దగ్గర
రాకాసిపేట, బోధన్ - 503 185
సెల్ : 9010153505



ప్రేమకి ముగింపు ఎప్పుడు? : కథలు, వ్యాసాలూ - ఇంటర్వ్యూలూ, సమీక్షలూ, ఉత్తరాలూ.
రచన: రంగనాయకమ్మ
పుటలు: 208, వెల: రు.80/-
ప్రతులకు : అరుణా పబ్లిషింగ్ హౌస్
ఏలూరురోడ్డు, విజయవాడ - 2
ఫోన్ - 0866-2431181 /9440630378




కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక :పరిచయం
పరిచయం : రంగనాయకమ్మ
పుటలు:144, వెల: రు.40/-
ప్రతులకు: అరుణా పబ్లిషింగ్ హౌస్
ఏలూరురోడ్డు విజయవాడ - 2
సెల్: 94406 30378




సప్తతి అభినందన :
కె.ఎస్.చలం సప్తతి వేడుకలు సావనీర్
పుటలు:56, వెల: అమూల్యం
ప్రతులకు:కె.ఎస్.చలం సప్తతి వేడుకలసమితి
4-53-1, ఎల్.బి.కాలనీ
విశాఖపట్నం- 17



వర్తమాన భారతం
సి.వి.రచనల సంపుటి
పుటలు:176, వెల: రు.100/-
ప్రతులకు: మైత్రీ బుక్ హౌస్, జలీల్ వీధి
కార్ల్‌మార్క్స్ రోడ్, విజయవాడ - 2.
ప్రజాశక్తి బుక్ హౌస్, కార్ల్‌మార్క్స్ రోడ్
విజయవాడ - 2.




నీరు నిప్పు - కవితా సంకలనం
రచన : ఆచార్య కె.ఎస్.చలం
పుటలు: 60, వెల: రు.50/-
ప్రతులకు :విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
ప్రజాశక్తి బుక్ హౌస్
నవచేతన బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు.




పలుకులమ్మ పదాలు : కవితలు
రచయిత : కె.ప్రభాకర్
పుటలు:64, వెల: రు.100/-
ప్రతులకు: రవి పబ్లిషింగ్ హౌస్
కె. విమలా రాణి, 2ఎల్, 7/4, 3 ఫేజ్,
కెపిహెచ్‌బి కాలని, జెఎన్‌టియు పోస్టు
హైదరాబాద్ - 85, సెల్ : 9000938291




మట్టిరంగు బొమ్మలు : కవితలు
రచయిత : సిరికి స్వామి నాయుడు
పుటలు:168, వెల: రు.100/-
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
ప్రజాశక్తి బుక్ హౌస్, అనేక
సెల్ : 94940 10330



మట్టిమనిషి ధిక్కార స్వరం - కవితా సంకలనం
సంపాదకులు : బైస దేవదాసు
పుటలు: 66, వెల: రు.10/-
ప్రతులకు :నేటి నిజం, తెలుగు డైలీ, ఎస్సార్టీ - 74,
జవహర్ నగర్, హైదరాబాదు -20
ఫోన్ : 040-27662477



సరిపడని సంగతులు
రచన : టి. రాఘవ
పుటలు:86, వెల: రు.50/-
ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌస్,
కార్ల్‌మార్క్స్ రోడ్
విజయవాడ - 2.




సినారె సినీగీతాల సౌరభం : వ్యాసాలు
పుటలు: 278, వెల: 350/-
ప్రతులకు : రవి పబ్లిషింగ్ హౌస్
కె.ప్రభాకర్, హెచ్ఐజి బ్లాక్ నెం.1, ఫ్లాట్ నెం.104
డా॥ ప్రభాకర్ రెడ్డి చిత్రపురి హిల్స్
హైదరాబాద్ - 500 104
సెల్ :9000938291



ప్రాచీన కుల సంస్కృతి-సామాజిక ప్రగతి :
వ్యాసాలు
రచయిత : డి.పేరలింగం
పుటలు: 48, వెల : అమూల్యం
ప్రతులకు : డి.పేరలింగం, హేతువాది, సైన్స్
గ్రంథాలయం, ఎ.వి. అప్పారావు రోడ్, రాజమండ్రి
సెల్ : 95026 54774

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

'సరసి' నుండి మరొక నవ్వుల కానుక! 'నవ్వేదేస్'



ఇప్పటివరకూ ఆరువేలకు పైగా కార్టూన్లను తెలుగు ప్రజలకు కానుకలుగా అందించిన 'సరసి', వాటిలో కొన్నిటిని చిన్నచిన్న సంపుటాలుగా వెలువరిస్తున్న క్రమంలో తాజాగా 'నవ్వేదేస్!' పేరున ఒక పుస్తకాన్ని అందించారు. 'నవ్వేదేస్' పేరున ఆంధ్రజ్యోతి దినపత్రిక ఆదివారం సంచికలో నాలుగేళ్లపాటు వరుసగా వచ్చిన కార్టూన్లను గుదిగ్రుచ్చి, ఆ పేరుతోనే ఈ 'సంచిక' ను ప్రజలకు అందించారు 'సరసి'.

ఈ కార్టూన్‌లలో ఏది ఎక్కువగా నవ్విస్తుందో మనం పోటీ పెట్టుకొని ఎంపిక చేయడం మొదలు పెడితే, అందరమూ ఓడిపోవడం ఖాయం. ఎందుకంటే అందరూ అన్నిటినీ ఎంపిక చేస్తారు తప్ప, దేన్నీ వదలిపెట్టలేరు! పోనీ ఫలానా కార్టూన్ ఏమీ బాగాలేదు అందామా - తక్కినవారెవరూ దానికి ఒప్పుకోరు. చివరికి గెలిచేది సరసిగారే. సరస్వతుల రామనరసింహం అన్న తన పేరులోంచి స.ర.సి అనే మూడక్షరాలను ఎంపిక చేసుకోవడంలోనే ఆయన ప్రజ్ఞ మనకు ద్యోతకమవుతుంది.

నాకెంతో ఇష్టమైన 'సరసి', నాడు 'నడుస్తున్న చరిత్ర' నూ నేటి 'అమ్మనుడి' నీ తనవిగా ప్రేమించాడు. నన్ను తనవాడినిగా ఆదరించాడు. ఏనాడూ ప్రతిఫలం ఆశించకుండా చిరునవ్వుతో కార్టూన్‌లను అందించాడు. ఇందుకు ఏ విధంగా కృతజ్ఞతల్ని తెలుపుకోవాలో తెలియని పరిస్థితి నాది. ఇప్పటివరకూ నా పత్రికల్లో వచ్చిన సరసి కార్టూన్లను ఒక అందమైన పుస్తకంగా తెచ్చి తనకు కానుకగా అందివ్వగలిగితే నా గుండె బరువు కొంత తగ్గుతుంది.

ఇంతవరకూ వచ్చిన సరసి కార్టూన్ల సంపుటాల వలెనే ఇప్పుడొచ్చిన 'నవ్వేదేస్' కూడా 'హిట్టే'. ప్రతి కార్టూనూ హిట్టే అయినప్పుడు కార్టూన్‌ల దండలు 'సూపర్‌హిట్' లు అవుతాయి గదా...పేజీకొక కార్టూన్ చొప్పున 200కు పైగా నవ్వించే, నవ్విస్తూ ఆలోచింపజేసే, కొండొకచో ఉడికించే, కదిలించే బొమ్మల్ని ఈ పుస్తకం మనకు అందిస్తున్నది.


ప్రతి ఇంట్లోనూ 'సరసి' కార్టూనల పుస్తకాలను ఉంచుకోవాలి. మనసు బాగోలేకపోయినా, ఏమీ తోచకపోయినా, కష్టాలనెదుర్కొంటున్నా, 'నవ్వేదేస్' ను తిరగేస్తే మనం కడుపుబ్బ నవ్వుకొంటూ - అన్ని కష్టాలనూ అధిగమించే శక్తిని తెచ్చుకొంటాం. ఇది నా హామీ!

- డా॥ సామల రమేష్‌బాబు

ప్రతులకు : ఫ్లాట్ నెం:56, 3వ వీధి, అనంత సరస్వతీ నగర్, మల్కాజ్‌గిరి, హైదరాబాదు-500047

(ఫోన్ : 9440542950) లేదా- హైదరాబాదులో కాచిగూడా ఆర్యసమాజ్ ఎదురు వీధిలోగల నవోదయ బుక్‌హౌస్ (040-24652387)

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
January 2019 Vol :4, Issue 11
Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month
RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/13/2018-20



If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam, ANGALAKUDURU (po), TENALI-522 211, Guntur (dt) A.P. Cell:9440 448244